గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 52 | సోమవారం | 11-08-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

దేవాదుల ప్రాజెక్ట్ త్వరలోనే పూర్తి
హెచ్‌సిఏ అవినీతిలో కూరుకుపోయింది
రైతుల చూపు.. నానో వైపు
లోపలి పేజీల్లో

# సిఎం ఆకస్మిక పర్యటన



- ముంపు ప్రాంతాల సందర్శన
- హైదరాబాద్ అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధనగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారీ వర్షాల కారణంగా వరదలతో ప్రభావితమైన హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, మైత్రివనం, బుద్ధనగర్, బల్కంపేట్ ప్రాంతాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు ముంపు సమస్యతో సతమతమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం వరద ముంపు ప్రాంతాలను ఉన్నతాధికారులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో తాము పడుతున్న కష్టాలను స్థానికులు ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న తరువాయి 2లో



# ఒకరికి ఒకటే ఓటు

ఇసి డిజిటల్ జాబితాలు ఇవ్వాలి : కాంగ్రెస్ డిమాండ్




**న్యూఢిల్లీ:** బిజెపితో కుమ్మక్కై ఓట్ల దొంగతానికి ఎన్నికల సంఘం పాల్పడటానికి వ్యతిరేక పోరు ప్రతి ఒక్క పౌరుడు కలిసి రావాలంటూ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఒకరికి ఒకటే ఓటు నినాదంతో 'ఓట్ల చోరీ' వ్యతిరేక ప్రచారోద్యమాన్ని చేపట్టింది. ఇందుకోసం వెబ్ పేజీని ప్రారంభించింది. ఇసి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసేందుకు ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చింది. డిజిటల్ ఓటర్ జాబితాల కోసం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న డిమాండ్‌కు మద్దతుగా ఈ ప్రచారోద్యమంలో భాగస్వాములు కావాలని కోరింది. ఇదే క్రమంలో రాహుల్ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. 'ఓట్ల దొంగతనం... ఒకరికి ఒకటే ఓటు ఉండాలన్న ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రంపై దాడి' అని అన్నారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే ఓటర్ల జాబితాలు లోపాలు లేకుండా ఉండాలని పేర్కొన్నారు. 'ఎన్నికల సంఘానికి మా డిమాండ్ చాలా స్పష్టం. పారదర్శకత చూపాలి, డిజిటల్ ఓటర్ జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రాజకీయ పార్టీలు సొంతంగా ఆడిట్ చేసుకునే అవకాశం కల్పించాలి' అని రాహుల్ వెల్లడించారు. 'ఓట్ చోరీ.ఇన్/ఇసి డిమాండ్' అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడం ద్వారా తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఇది ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం జరిగే పోరాటమంటూ తరువాయి 2లో

# రాబర్ట్ వాద్రాకు రూ.58 కోట్ల ముడుపులు



కోర్టుకు తెలిపిన ఈడి

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఆర్థిక నేరం కేసులో ఉచ్చు బిగుస్తోంది. గురుగ్రామ్‌లో జరిగిన ఓ వివాదాస్పద భూ ఒప్పందం ద్వారా వాద్రాకు రూ.58 కోట్ల ముడుపులు అందినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) ఆరోపణలు చేస్తోంది. ఢిల్లీలోని ప్రత్యేక పిఎంఎల్‌ఏ కోర్టులో ఈడి చార్జిషీట్ దాఖలు చేసింది. ఈడి ఫిర్యాదును పరిశీలించిన కోర్టు... దీనిపై విచారణను ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేస్తూ వాద్రాకు నోటీసులు జారీ చేసింది. రాబర్ట్ వాద్రాకు చెందిన స్కై లైట్ హాస్పిటాలిటీ సంస్థ గురుగ్రామ్‌లోని షికోహ్‌పూర్‌లో ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 3.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిని రూ.7.50 కోట్లకు కొన్నట్లు సేల్ డీడ్‌లో చూపించారు. అయితే ఆ ప్రాంతంలో ఒక్కో ఎకరా రూ.15 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. పైగా చెక్కు ద్వారా చెల్లింపులు జరిపినట్టు పత్రాలు చూపించారు. అయితే వాద్రా చెక్కు ఇప్పటివరకు ఎన్‌క్యాష్ కాలేదు. దీంతో ఆ భూమి మొత్తాన్ని వాద్రా సంస్థకు ఉచితంగా ఇచ్చేశారని ఈడీ అనుమానిస్తోంది. ఈ మొత్తం లావాదేవీని లంచంగా ఈడీ భావిస్తోంది. ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ సంస్థకు హౌసింగ్ స్కీమ్ లైసెన్స్ ఇప్పించేందుకు అప్పటి హర్యానా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడాపై తరువాయి 2లో

# మరో వారం రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో వారం రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే కుండపోత వర్షాలు ముంచెత్తుతున్న విషయం తెల్సిందే. గత వారం పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు ఇలానే వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అయితే ఆగస్టు 14 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో కూడా ఆగస్టు 14 నుంచి 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నాలుగు రోజుల్లో ఒకటి రెండు రోజులు మాత్రం అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. 15 రోజున రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. 15 రోజున స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తరువాయి 2లో

# 'గెలుపు చోరీ'పై నేడు 'ఇండియా' ఎంపిల ప్రదర్శన

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా వారు ఆరోపిస్తున్న 'గెలుపు చోరీ' (ఓటు దొంగతనం) ని నిరసిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతత్వంలోని ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు సోమవారం పార్లమెంటు నుంచి ఎన్నికల కమిషన్ (ఇసి) కార్యాలయం వరకు ప్రదర్శన చేయనున్నారు. కూటమి ఫ్లోర్ లీడర్లు కూడా అధికారికంగా తమ అభ్యంతరాలను నమోదు చేయడానికి ఎన్నికల కమిషనర్లను కలుస్తారని ఆ వర్గాలు తెలిపాయి. ఉదయం 11.30 గంటలకు పార్లమెంటు నుంచి ఈ ప్రదర్శన ప్రారంభం కానుంది. కర్నాటకలోని మహదేవపుర అసెంబ్లీ తరువాయి 2లో



# బిజెపికి తెలంగాణ గేట్ వే

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- బిజెపిలో చేరిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న రోజుల్లో తెలంగాణ బిజెపికి 'గేట్ వే ఆఫ్ తెలంగాణ' అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. బాలరాజుకు రాంచందర్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ రావుతో పాటు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్, ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు, ఎంఎల్‌సి అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు ఆకర్షితుడై గువ్వల బాలరాజు పార్టీలో చేరారని తెలిపారు. బాలరాజు అచ్చంపేటతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటు శాతం 13.9 శాతం నుంచి 36 శాతానికి పెరిగిందని, 8 ఎంపి సీట్లు గెలుచుకుందని, తరువాయి 2లో

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో 'ఇండియా' ఉమ్మడి అభ్యర్థి

ప్రతిపక్ష నేతతో ఖడ్గే సంప్రదింపులు



**న్యూఢిల్లీ:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన తమ ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టబోతోంది. ఈమేరకు భాగస్వామ్య పార్టీ మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అందరు నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్నికల ఫలితం ఏమైనాగానీ పోటీ విషయంలో రాజీ పడకుండా తమ అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా ఐక్య సంఘటన సంకల్పించింది. అయితే ఎవరిని నిలబెట్టాలో నిర్ణయించుకోలేదు. దీనిపై ఇప్పటివరకు ఇండియా నాయకుల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరగలేదు. సమర్థ అభ్యర్థుల పేర్ల పరిశీలన, ఏకాభిప్రాయం కోసం ఖడ్గే ప్రయత్నాలు సాగుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ఆదివారం తెలిపాయి. బిజెపి తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాతే ఇండియా తన అభ్యర్థిని ఎంపిక చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నట్లు వెల్లడించాయి. వాస్తవానికి బీహార్‌లో ఎస్ఐఆర్, ఎన్నికల రిగ్గింగ్‌కు వ్యతిరేకంగా ఇండియా ఐక్యపోరుకు సంకల్పించింది. ఇలాంటి సమయంలో జరుగుతుండటంతో ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇండియా అభ్యర్థి ఎవరన్నది కూడా ఆసక్తికరంగా మారింది. ఇదిలావుంటే, తమ ఐక్యతను చాటేందుకు ఇండియా నాయకులంతా ఇటీవల లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నివాసంలో విందుకు 25 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. బిజెపి ఇసి ఓట్ల చోరీ నమూనాపై సంప్రదింపులు, చర్చలు జరిపారు. 2024 జూన్ తర్వాత ఇండియా నాయకులు భేటీ కావడం ఇదే మొదటిసారి. కాగా, సోమవారం 'ఇండియా' ఎంపీలందరికీ ఖడ్గే విందు ఏర్పాటు చేశారు. అయితే, ఆరోగ్యం సహకరించడం లేదంటూ తన పదవీ కాలం ముగియకుండానే ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్కర్ ఈనెల 4న రాజీనామా చేశారు. దీంతో కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. పార్లమెంటు ఉభయ సభల మొత్తం సంఖ్యా బలం 781గా ఉంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గెలవాలంటే 391 ఓట్లను అభ్యర్థి సాధించాలి. నామినేటెడ్ సభ్యులతో సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా ఓటు వేసేందుకు అర్హులు. అయితే 422 మంది సభ్యుల బలం ఎన్డీయేకున్నది కాబట్టి ఈ ఎన్నిక ఏకపక్షమయ్యే అవకాశముంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం సెప్టెంబరు 9వ తేదీని ఖారారు చేస్తూ గత గురువారం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ అయింది. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ ఉన్నారు. ఆయనకు మూడు నామినేషన్లు ఇప్పటికే అందగా, అవి సక్రమంగా లేవన్న కారణంగా తిరస్కరించారు. అభ్యర్థుల నామినేషన్లకు గడవు ఈనెల 21వ తేదీతో ముగుస్తుంది. పరిశీలన 22న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహారణకు 25వ తేదీ వరకు సమయముంది.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో గోల్‌మాల్

- కోదాడలో చేతివాటం చూపిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అనుచరులు
- స్కాంలో బొల్లం మల్లయ్యయాదవ్ పిఏ సూత్రధారి
- అసలు లబ్ధిదారుల ఫిర్యాదుతో బయటపడిన బాగోతం

ప్రజాపక్షం/కోదాడ




సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ స్కాంలో పెద్ద గోల్‌మాల్ జరిగినట్లు బయటపడింది. గత ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్ వున్న హయాంలో ఆయన పిఏగా చెప్పుకున్న ఓ వ్యక్తితో పాటు కొందరు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ స్కాంలో ఉన్నట్లు సమాచారం. ఆర్థిక సహాయం కావాలని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులు మంజూరైన తర్వాత లబ్ధిదారులకు కాకుండా వారి పేర్లు, ఇంటి పేర్లతో సరిపోయే వేరే వ్యక్తులకు ఆ చెక్కులను ఇచ్చి వారితో ఆ మొత్తాన్ని డ్రా చేసుకుని వాటాలు వేసుకుని పంచుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారంలో సెక్రటేరియేట్‌కు చెందిన ఓ ఉద్యోగి ప్రమేయం కూడా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో తమకు చెక్కులు రానివారు ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతికి ఫిర్యాదు చేయడంతో ఆ చెక్కుల గోల్‌మాల్ విషయం బయటపడింది. కాగా ఇప్పటి వరకు ఎన్ని చెక్కులు ఇలా డ్రా చేశారు? ఎంతమొత్తం దుర్వినియోగం చేశారనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదని, చెక్కుల గోల్‌మాల్ విషయం బయటకు తెలియడంతో గతంలో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొని చెక్కులు రానివారు తమ వివరాలతో క్యాంపు ఆఫీస్‌కు వెళ్తున్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులు ప్రాథమికంగా విచారణ ప్రారంభించారని, బిఆర్ఎస్‌కు చెందిన నాయకుల ప్రమేయంపై విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో వచ్చిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తప్పుడు తేదీలలో యాభైకి పైగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అక్రమంగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ నాయకుడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పక్కదోవ పట్టించి లక్షల రూపాయలు చేతులు మారినట్లుగా అధికారులు నిర్ధారించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నకిలీ ధృవపత్రాలతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు అప్లై చేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెక్కులను వేర్వేరు వ్యక్తుల పేర్లతో చెక్కులను తీసుకుని వేరే వ్యక్తులకు కొంత నగదు ఆసరాగా చూపించి డ్రా చేసిన నగదును కేటుగాళ్లు కొట్టేసినట్లు తెలుస్తోంది. మునగాల మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు సురగాని రాంబాబు గౌడ్ నకిలీ ధృవపత్రాలు సృష్టిస్తే మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత పిఏ తనకు ఉన్న పరిచయాలతో సెక్రటేరియట్ తరువాయి 2లో


# 8 రాష్ట్రాలకు పాకిన 'సృష్టి సరోగసి' దందా

- 75 మంది పిల్లల అక్రమ రవాణాకు పాల్పడిన డాక్టర్ నమ్రత
- రూ.25 కోట్లకుపైగానే దోపిడీ
- కేసు వివరాలు ఇవ్వాలంటూ పోలీసులకు ఇడి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్




'సృష్టి అక్రమ సరోగసి' కేసులో రోజుకో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. సరోగసి అక్రమాలు ఎనిమిది రాష్ట్రాలకు పాకిందని పోలీసుల తాజా దర్యాప్తులో తేలింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, ఛతీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా సృష్టి ఆసుపత్రి అధినేత్రి డాక్టర్ నమ్రత తన దందాను 2021 నుంచి మొదలు పెట్టిందని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. ఈ రాష్ట్రాలలో దంపతుల వివరాలు, పిల్లల విరాలను పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు నమ్రత ఆయా రాష్ట్రాల నుంచి 75 మంది పిల్లల్ని చైల్డ్ ట్రాఫికింగ్ తరువాయి 2లో




# గంటల్లోనే పాక్‌ను దెబ్బతీశాం

వందేభారత్ రైళ్లు ప్రారంభించిన మోదీ

బెంగళూరు: భారతదేశంలో 2014లో కేవలం 74 విమానాశ్రయాలే ఉన్నాయని, ఇప్పుడు 160కి చేరాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. బెంగళూరులో పర్యటించిన ప్రధాని ఆదివారం కొత్తగా మూడు వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ మౌలిక సౌకర్యాల కల్పనలో బెంగళూరు రోల్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. భారత్ వేగవంతమైన అభివద్ధిని నమోదు చేస్తోందన్నారు. 2014లో భారత్‌లో కేవలం 74 విమానాశ్రయాలే ఉన్నాయని, ఇప్పుడు 160కి చేరాయని తెలిపారు. ఆరోగ్యం, విద్యారంగాల్లో కీలక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక సాంకేతికత, మేక్ ఇన్ ఇండియా ఉన్నాయన్నారు. గంటల వ్యవధిలోనే పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టామన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశాన్ని ప్రపంచం సరికొత్త కోణంలో చూశాయన్నారు. పాకిస్థాన్ లోపలికి వెళ్లి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని మోదీ గుర్తుచేశారు. కాగా, ఆదివారం కేఎస్ఆర్ రైల్వే స్టేషన్ నుండి మూడు వందే భారత్ రైళ్లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో బెంగళూరుబెళగావి, తరువాయి 12లో

# స్వదేశంలోనే నెతన్యాహూకు వ్యతిరేకత

ఇజ్రాయెల్‌లో వేలాదిమంది నిరసన ప్రదర్శన



**టెల్‌అవీవ్ :** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూపై ఆ దేశ ప్రజల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి గాజాను స్వాధీనం చేసుకునేందుకు ఉద్దేశించిన సెక్యూరిటీ కేబినెట్ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకించారు. యుద్ధం ఆపాలని, బందీల విడుదలకు ఒక ఒప్పందం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గాజాలో యుద్ధ విస్తరణ ప్రణాళిక అమలు చేస్తే బందీల ప్రాణాలకు హమాస్ ఉగ్రవాదులు హాని తలపెడతారని ప్రదర్శకులు భయాందోళన వ్యక్తం చేశారు. హోస్టేజెస్–మిస్సింగ్ ఫ్యామిలీస్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ భారీ ప్రదర్శన జరిగింది. అదేవిధంగా స్పెయిన్ దేశంలో కూడా గాజా ప్రజలకు మద్దతుగా, నెతన్యాహూ యుద్ధ ప్రణాళికకు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బీజింగ్‌లో 14 నుండి 17 వరకు రోబో ఫుట్‌బాల్ పోటీలు

**బీజింగ్ :** బీజింగ్‌లో ఈ నెల 14నుండి 17వ తేదీ వరకు వరల్డ్ హ్యూమనాయిడ్ రోబో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయి. భూగోళంపై మనిషిని పోలిన 5 వి 5 మరమనుషులతో ఆటలు జరగడం ఇదే ప్రథమం. ప్రపంచవ్యాప్తంగా మొదటిసారి హ్యూమనాయిడ్ రోబోలతో ఇలాంటి భారీస్థాయి పోటీ ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా ఐదు ఖండాలలో ఉన్న 16 దేశాల నుండి 280 హ్యూమనాయిడ్ రోబో టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటాయి. అమెరికా, బ్రెజిల్, జర్మనీ, ఆస్ట్రేలియాసహా 15 దేశాల టీములు అంతర్జాతీయస్థాయి టీములు. మొత్తం 26 రకాలలో 538 ఈవెంట్లు జరుగుతాయి. మొత్తం 500 హ్యూమనాయిడ్ రోబోలు ఈ పోటీల్లో గెలుపుకోసం తలపడతాయి. బీజింగ్ లోని నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఓవల్‌లో ఈ పోటీలు జరుగుతాయి. మనుషుల జోక్యం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆల్గోరిథమ్ నియంత్రణలో స్వయంప్రతిపత్తితో ప్రతి ఆటా జరుగుతుంది. ఈ మొత్తం 288 హ్యూమనాయిడ్ రోబో టీమ్స్‌లో 192 యూనివర్సిటీ ఆధారిత టీములు కాగా, మరో 88 కార్పొరేట్ ఆధారిత టీములు.

## చర్చల్లో ఉక్రేన్‌ను భాగస్వామిగా చేర్చాల్సిందే

### జెలెన్‌స్కీకి యూరోపియన్ మిత్రదేశాల మద్దతు



**కీవ్:** ఉక్రేన్‌ను శాంతి చర్చల్లో భాగస్వామిగా చేర్చాల్సిందేనని ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల నాయకులు పట్టుపట్టారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి పూర్తి సంఘీభావాన్ని, తమ మద్దతును తెలిఇయజేశారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌లతో జెలెన్‌స్కీ ఫోన్ సంభాషణల సందర్భంగా ఆ ఇద్దరు నాయకులు తమ వైఖరిని ఉద్ఘాటించారు. వారితోపాలు ఇటలీ, జర్మనీ, బ్రిటన్, డెన్మార్క్ పోలెండ్,ఫిన్లాండ్ దేశాల నాయకులు, యూరోపియన్ యూనియన్ కమిషన్ సంయుక్తంగా చేసిన ప్రకటనలో ఉక్రేన్‌లో చర్చల్లో మూడోభాగస్వామిగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఉక్రేన్ లేకుండా చర్చల్లో తీసుకునే నిర్ణయాలను మృత నిర్ణయాలుగా జెలెన్‌స్కీ అభివర్ణించారు. ఉక్రేన్ భాగస్వామ్యం లేకుండా, తమ ప్రమేయం లేకుండా చర్చల్లో ఎలాం నిర్ణయాలు తీసుకుంటారని జెలెన్‌స్కీ రెండు రోజులుగా ప్రశ్నిస్తున్నారు. అలస్కాలో అమెరికా–రష్యా మధ్య ఈనెల 15వ తేదీన ఉక్రేన్ యుద్ధ సమస్యపై శిఖరాగ్ర సమావేశానికి తేదీ, ప్రదేశం ఖరారైనప్పటినుండీ జెలెన్‌స్కీ తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించారు. చర్చల్లో తమ భాగస్వామ్యం కూడా ఉండాలని, తమ దేశ భూభాగాన్ని ఉదారంగా ఎవ్వరికీ ధారాదత్తం చేసేందుకు ఉక్రేన్ ప్రజలు సిద్ధంగా లేరని, చర్చల్లో తమ అభిప్రాయాలు కూడా వినేందుకు ప్రాతినిధ్యం ఉండేలా ఈ ద్వైపాక్షిక ముఖాముఖీని త్రైపాక్షిక ముఖాముఖీ సమావేశంగా మార్చాలని జెలెన్‌స్కీ డిమాండ్ చేశారు. దీనిపై వైట్‌హౌస్ వర్గాలు స్పందిస్తూ, ట్రంప్ ఈ సమావేశాన్ని త్రైపాక్షిక సమావేశంగా నిర్వహించాలని ప్రయత్నం చేశారని, కానీ పుతిన్ వ్యక్తం చేసిన అభ్యంతరాలవల్ల ప్రస్తుతానికి అలస్కాలో పుతిన్–ట్రంప్ మధ్య సమావేశం ద్వైపాక్షికంగా జరుగుతుందని వివరణ ఇచ్చారు. అలస్కాలో ఉక్రేన్‌తో కలిసి త్రైపాక్షిక సమావేశం నిర్వహించేందుకే ట్రంప్ ఇష్టపడుతున్నారనీ, కానీ ప్రస్తుతానికి ఇది ద్వైపాక్షిక సమావేశంగానే జరుగుతుందని వాషింగ్టన్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ, పుతిన్–ట్రంప్ మధ్య తదుపరి సమావేశం రష్యా గడ్డపై జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

**రష్యా షరటోవ్‌పై ఉక్రేన్ దాడి :** దక్షిణ రష్యా ప్రాంతం షరటోవ్‌పై ఉక్రేన్ ఆదివారంనాడు డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అనేక అపార్ట్‌మెంట్ భవంతులు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో ఒకరు మరణించారు. షరటోవ్ గవర్నర్ రోమన్ బషర్‌గిన్ టెలిగ్రామ్ మెసేజ్ వేదికగా ఈ విషయం చెప్పారు. ఐతే ఏ పారిశ్రామిక వాద డ్రోన్ల దాడిలో ధ్వంసమైందో ఆయన చెప్పలేదు. డ్రోన్ దాడుల్లో మూడు అపార్ట్‌మెంట్లు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్కడివారంతా ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళారు. రష్యా సైనిక దళాలు 121 ఉక్రేన్ డ్రోన్లను ధ్వంసం చేసినాగానీ ఎనిమిది డ్రోన్లు వచ్చి షరటోవ్ ప్రాంతాన్ని దెబ్బతీశాయి.

# గాజాపై ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు

**మాడ్రిడ్:** గాజాలో ఇజ్రాయెల్ ఆక్రమణ యుద్ధ ప్రణాళికను వ్యతిరేకిస్తూ యూరప్‌లో, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. నెతన్యాహూ అనుసరిస్తున్న వైఖరిని వేలాదిమంది ప్రదర్శకులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ర్యాలీలు నిర్వహించారు. గాజాలో ప్రజలకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. స్పెయిన్ దేశం మాడ్రిడ్ నగరంలో వందలమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నెతన్యాహూ విధానాన్ని వ్యతిరేకించారు. చిలీ శాంటియాగోలో, అర్జెంటైనా బ్యూనోస్ ఐర్స్‌లో, టర్కీదేశం ఇస్తాంబుల్‌లో, బెల్జియం బ్రస్సెల్స్‌లో, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో, యెమెన్ రాజధాని సనాలో, స్పెయన్‌లోని బార్సిలోనాలో, మాడ్రిడ్‌లో, లండన్‌లో వేలాదిమంది వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గళమెత్తి నినాదాలు చేశారు. గాజాలో ఇప్పటివరకూ రోజువారీ దాడులు చేసి, ప్రజలను కాల్చి చంపి, ఆహారం లేకుండా వారిని పస్తులుపెట్టి చంపిన తర్వాత గాజాను పూర్తిస్థాయిలో ఆక్రమించుకుంటామని నెతన్యాహూ ప్రకటన చేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. ఇజ్రాయెల్‌పై వ్యవతిరేకత వరదప్రవాహంలా మారింది. తక్షణం ఇజ్రాయెల్‌ను కట్టడిచేయాలన్న డిమాండ్స్ పెరిగాయి. గాజాలో తక్షణం యుద్ధం విరమించాలని, కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేయాలని పలు దేశాలలో నిరసన ర్యాలీల్లో పాల్గొన్న ప్రజలు నినాదాలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. పాలస్తినా ప్రజలకు పూర్తి సంఘీభావం ప్రకటించారు. టర్కీరాజధాని ఇస్తాంబుల్‌లో వేలాదిమంది ప్రజలు బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రపంచదేశాలు తక్షణం ఐక్యంగా గాజా సమస్య పరిష్కారానికి పూనుకోవాలని నినాదాలు చేశారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నెతన్యాహూ విధానాన్ని విమర్శించారు. గాజాలో ఆహార సరఫరాపై ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్విట్జర్లాండ్ జెనీవాలోని జార్డిన్ ఆంగ్లాయిస్ వద్ద వేలాదిమంది ప్రజలు గుమిగూడి గాజాలో సామూహిక హత్యాకాండను వెంటనే ఆపాలని కోరారు.



### లండన్‌లో 500 మంది పాలస్తీనా మద్దతుదార్ల అరెస్టు

గాజాలో ప్రజలను మల మలా మాడ్చి చంపుతున్నారని, తక్షణం ఈ నరమేధాన్ని ఆపాలని కోరుతూ వందలమంది ప్రదర్శకులు పాలస్తినాకు అనుకూలంగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా లండన్‌లో భారీ ప్రదర్శన చేశారు. లండన్‌లో నిషేధానికి గురైన ఇజ్రాయెల్ యాక్షన్‌కు మద్దతుగా ఈ భారీ ర్యాలీ చేశారు. దీంతో పోలీసులు దాదాపు 500 మంది ప్రదర్శకులను అరెస్టు చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఆకలిచావులకు గురిచేస్తున్నారని, ఈ సామూహిక హత్యాకాండను ఇక ఆపాలని ప్రదర్శకులు కోరారు. ర్యాలీ సందర్భంగా ప్రదర్శకులు పాలస్తినా అనుకూల నినాదాలు చేశారు. పాలస్తినా యాక్షన్ గ్రూపును నిషేధిస్తూ బ్రిటన్ ప్రభుత్వం తీసుకున్న చర్యకు వ్యతిరేకంగా కూడా ఈ భారీ ర్యాలీ జరిగింది. దీంతో పోలీసులు ప్రదర్శకులను అరెస్టు చేశారు. పాలస్తినా యాక్షన్ గ్రూపు ఉగ్రవాద వ్యతిరేక చట్టం పరిధిలోకి వచ్చిందని పేర్కొంటూ గతనెలలో ఈ సంస్థపై బ్రిటన్ ప్రభుత్వం నిషేధం విధించింది.

### గాజాలో 27 మంది మృతి
### 217కు పెరిగిన ఆకలి మరణాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఛీ..కొడుతున్నప్పటికీ గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం ఆగడంలేదు. ఆదివారం తాజాగా జరిగిన దాడుల్లో 27 మంది మరణించారు. అదేవిధంగా ఆకలి భరించలేక మరణించిన పిల్లలసంఖ్య 100 కు పెరిగింది. మొత్తం ఆకలి మరణాలు గాజాలో 217కు పెరిగాయి. హమాస్ అధీనంలోని ఆరోగ్యమంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం ఆదివారంనాడు మరో 11 మంది పిల్లలు పోషకాహారలోపంతో మరణించారు. మరోవైపు గగనతలమార్గంలో ఆహారం జాడవవిడినిప్పుడు వాటికోసం పరుగులు తీస్తున్న ఒక 14 ఏళ్ళలోపు బాలుడిపై ఆహారం మూట పడి బాలుడు మరణించాడు. గగనతలమార్గంలో ఆహారాన్ని జాడవిడిచే ప్రక్రియ అత్యంత ప్రమాదకరమైనదని, అలాంటి ప్రయోగాలు చేయవద్దని ఇజ్రాయెల్‌కు ఐక్యరాజ్యసమితి అనేకసార్లు హెచ్చరిక చేసినప్పటికీ పలు దేశాలను గగనతలమార్గంలో ఆహారం జాడవిడిచేందుకు అనుమతించడంతో ఈ ఉపద్రవం సంభవించింది. మరోవైపు గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ ఆహార కేంద్రాలవద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న పాలస్తీనియన్లపై సైన్యం జరిపిన కాల్పుల్లో మృతులసంఖ్య 1,772కు పెరిగింది. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒక్కగాజాలోనే ఇప్పటివరకూ 61,330 ప్రజలు మరణించారు.

## ఛాడ్ మాజీ ప్రధానమంత్రికి 20 ఏళ్ల జైలుశిక్ష : నిరసనలు

**ఎండెజ్మెనా:** ఆఫ్రికాలో లిబియా,సూడాన్,నైజీరియాల సరిహద్దుదేశం రిపబ్లిక్ ఆఫ్ ఛాడ్ మాజీ ప్రధానమంత్రి,ప్రతిపక్ష నాయకుడు సక్సెస్ మస్రా (42)కు ఇరవైసంవత్సరాలు జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన ట్రాన్స్‌ఫార్మర్స్‌తపార్టీకి చెందిన కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసన తెలియజేశారు. తమ నాయకుణ్ణి అన్యాయంగా అరెస్టు చేసి శిక్ష విధించారని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో సామూహిక హింసాకాండ రెచ్చగొట్టేవిధంగా విద్వేష ప్రసంగాలు చేసినందుకుగాను ఆయనకు ఈ శిక్ష విధించారు. విదేశీయులను చీదరించుకునే అసాధారణ జాత్యాంహంకారం ప్రదర్శించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు ఆయనకు ఈ శిక్ష పడింది. కానీ ఎలాంటి ఆధారాలు లేకుండానే ఊహాగానాలతో ఆయనను అరెస్టు చేసి శిక్షించారని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు.

2018లో రాజకీయ జీవితం ప్రారంభించడానికి ముందు ఆయన ఆర్థికవేత్తగా పనిచేశారు. మూడుదేశాల్లో చదువుకున్న మస్రా తొలుత ఆఫ్రికన్ డవలప్‌మెంట్ బ్యాంక్‌లో పనిచేశారు. 2024 జనవరి ఒకటో తేదీ నుండి మే 22వ తేదీ వరకు ఆయన ప్రధానమంత్రి పదవిలో కొనసాగారు. లోగోన్ ఆక్సిడెంటల్ ప్రాంతంలో విద్వేష ప్రసంగాల ద్వారా ఘర్షణలు రెచ్చగొట్టడంతో ఆ ప్రాంతంలో 42 మంది మరణించారన్న కారణంగా గత ఏడాది మే నెలలో మస్రాను సాయుధ బలగాలు ఆయనను అరెస్టు చేశాయి. గడచిన జూన్ నెలలో జైలులో ఉండగానే మస్రా వారం రోజులపాటు నిరాహారదీక్ష చేసి తర్వాత విరమించాడు.



## సిఎం ఆకస్మిక పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి, వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అలాగే మంచి నీరు ఎలా వస్తుంది, అందులో ఏమైనా మురుగు నీరు కలుస్తుందా? అంటూ వారిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు అమీర్‌పేట మైత్రీవనం సమీపంలోని గంగూబాయి బస్తీ, బుద్ధనగర్‌ను ఆయన సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలపై సిఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా బుద్ధనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన ఆయన, వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. బుద్ధనగర్‌లో కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ కాలువ ఎత్తు ఎక్కువగా ఉండటంతో వరద తీవ్రత పెరుగుతోందని సిఎం గుర్తించారు. వెంటనే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని అధికారులకు సూచించారు. పక్కనే ఉన్న గంగూబాయి బస్తీ కుంటను కొందరు పూడ్చివేసి పార్కింగ్‌కు వాడుకుంటున్నారని స్థానికులు సిఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సిఎం, ఆ ప్రాంతాన్ని సందర్శించి, ఒక ప్రత్యేక ట్రంక్‌లైన్‌ను ఏర్పాటు చేసి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులకు తెలిపారు. ఇటీవలి వరదల్లో నీరు నిలిచిపోయిన మైత్రివనం ప్రాంతాన్ని కూడా సిఎం సందర్శించి, స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**బాలుడితో ముచ్చట..**

ఈ పర్యటనలో భాగంగా అమీర్‌పేట్‌లోని బుద్ధనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జశ్వంత్ అనే ఏడవ తరగతి చదివే బాలుడితో మాట్లాడారు. వరద పరిస్థితి గురించి తెలుసుకుంటున్నప్పుడు, వరదనీరు ఇంట్లోకి వచ్చి తన పుస్తకాలు తడిసిపోయాయని బాలుడు ముఖ్యమంత్రికి చెప్పాడు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని బాలుడికి సిఎం రేవంత్ రెడ్డి ధైర్యం చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డికి ఒక మహిళా రాఖీ కట్టారు.

**ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి..**

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ పర్యటనలో సిఎం వెంట జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్, చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) సానే భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

## నెతన్యాహూకు వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా భారీ ప్రదర్శన జరిగింది. గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలనే ప్రణాళిక అమలు చేసేముందుగా గాజా నుండి ఇజ్రాయెల్ బందీలను విడిపించేందుకు పూర్తి ఒప్పందం చేసుకోవాలని, కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేయాలని ఇజ్రాయెల్ ప్రజలు నెతన్యాహూపై ఒత్తిడి తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రజలు వేలాదిమంది రాజధాని టెల్‌అవీవ్ వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. హమాస్‌వద్ద ఇప్పటికీ బందీలుగా ఉన్న వారి బంధువులు, స్నేహితులు, మిత్రులు, సామాన్య ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇటీవలికాలంలో ఇంత భారీ ప్రదర్శన ఇజ్రాయెల్ రాజధానిలో జరగలేదు. బందీల వీడియోలను హమాస్ ఉగ్రవాదులు విడుదల చేయడంతో ఇజ్రాయెల్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ప్రజల్లో నెతన్యాహూ వైఖరి, మొండిపట్టుదలపట్ల వ్యతిరేకత పెరుగుతున్నది. ప్రియమైన తమ బంధువులను ఉగ్రవాదులు తిండిపెట్టకుండా వారి సమాధులు వారినే తవ్వుకోమని పార, గునపం ఇచ్చి నిర్బంధించడాని ఇజ్రాయెలీలు తట్టుకోలేకపోతున్నారు.

**నమ్మకం పోయింది : ఆర్థికమంత్రి స్మోట్రిచ్**

ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూపై తనకు నమ్మకం పోయిందని ఇజ్రాయెల్ ఆర్థికమంత్రి స్మోట్రిచ్ చెప్పారు. గాజాను పూర్తిగా ఆక్రమించుకోవాలని సెక్యూరిటీ కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఆయన విమర్శించారు. గాజాలో యుద్ధ విజయానికి ఆయన తీసుకుంటున్న చర్యలపై తనకు నమ్మకం పోయిందని, ఇకమీద తాను ఆయనను నమ్మలేనన్నారు. గాజా ఆక్రమణ ప్రణాళికకు ఆమోదం తెలియజేయడం సగం సగం చేసిన పనిగా, అర్థరహితమైనదిగా విమర్శించారు. నెతన్యాహూకు ప్రజల్లో వ్యతిరేకత చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుండి ఆయన వైదొలగాలని మాత్రం స్మోట్రిచ్ బెదిరించలేదు. యుద్ధం తనకు నచ్చినవిధంగా సాగడం లేదన్నారు.

## నేడు 'ఇండియా' ఎంపిల ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

సీటుపై కాంగ్రెస్ విశ్లేషణను ఉటంకిస్తూ, ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కయిందని రాహుల్ గాంధీ ఆరోపించిన కొన్ని రోజుల తర్వాత ప్రతిపక్షాల నుంచి ఈ నిరసన కార్యక్రమం వచ్చింది. అక్కడ దాదాపు లక్ష ఓట్లు 'దొంగిలించబడ్డాయి' అని రాహుల్ ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఓటు చోరీ' కి సంబంధించి ఇంతకుముందు చేసిన తన ఆరోపణలను ఆయన పునరుద్ఘాటించారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు 'స్వచ్ఛమైన' ఓటరు జాబితా అవసరమని నొక్కి చెప్పారు. ఈ అంశాన్ని ప్రజాస్వామ్యాన్ని 'రక్షించడానికి' విస్తత పోరాటమని పేర్కొంటూ, కాంగ్రెస్ ఎంపీ 'ఎక్స్' లో ఇలా పేర్కొన్నారు : 'ఓటు చోరీ అనేది 'ఒక మనిషి, ఒక ఓటు' అనే పునాది ఆలోచనపై దాడి. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటరు జాబితా తప్పనిసరి. ఈసీకి మా డిమాండ్ స్పష్టంగా ఉంది. పారదర్శకంగా ఉండండి. డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయండి. తద్వారా ప్రజలు, పార్టీలు వాటిని ఆడిట్ చేయవచ్చు. ఈ పోరాటం మన ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం' అని తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్... ఓటరు జాబితా తారుమారుకి వ్యతిరేకంగా పోరాటాన్ని భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి 'డూ ఆర్ డై' అనే కార్యక్రమంతో పోల్చారు. రాబోయే సమావేశంలో దేశ వ్యాప్త ప్రచారంలో దాని తదుపరి దశలను పార్టీ చర్చిస్తుందని చెప్పారు. 'క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బాపు మనకు 'డూ ఆర్ డై' పిలుపు ఇచ్చినట్లే, నేడు మనం భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఇలాంటి డూ ఆర్ డై మిషన్‌ను ప్రారంభించాలి' అని వేణుగోపాల్ 'ఎక్స్' లో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అవకతవకలు, ఎన్నికల మోసాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా తదుపరి దశ ప్రచారం కోసం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షుడు అధ్యక్షతన ఆగస్టు 11న పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇంఛార్జ్‌లు, ఫ్రంటల్ సంస్థాగత అధిపతుల సమావేశాన్ని నిర్వహిస్తుందని ఆయన అన్నారు.

## 'సృష్టి సరోగసి' దందా

(మొదటి పేజీ తరువాయి)



ద్వారా దంపతులకు శిశువులను అందించి పెద్దమొత్తంలో డబ్బులు దండుకున్నట్లు తేలింది. సుమారు రూ.25 కోట్లకు పైగానే ఆమో ఈ దందాలో దోచుకున్నట్లు తేలింది. ఇప్పటికే గోపాలపురం పోలీసు స్టేషన్‌లో తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు కాగా 25 మంది (డాక్టర్లు, టెక్నిషియన్స్, ఆసుపత్రి సిబ్బంది)ని పోలీసులు అరెస్టు చేశారు. సృష్టి అక్రమ సరోగసి దందాలో వచ్చిన డబ్బులను నమ్రత విదేశాలకు తరలించినట్లు పలు సాక్ష్యాధారాలను పోలీసులు బయటికి తీశారు. విదేశాలలో కూడా ఈ దందా విస్తరించే పనిలో నమ్రత ఉండగా ఇక్కడ వెలుగు చూసిన ఉదంతంతో జైలుకు వెళ్లక తప్పలేదు. విదేశాలకు తరలించిన డబ్బుపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలోనే ఇడి అధికారులు సృష్టి కేసుకు సంబంధించి పూర్తి వివరాలు, నమోదైన ఎఫ్ఐఆర్ కాపీలను తమకు అందించాలని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌కు లేఖ రాశారు. నేడేరెపో ఇడికి అన్ని వివరాలు అందిన తరువాత సృష్టిపై ఇడి కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదే కేసులో వైజాగ్‌లని కింగ్ జార్జి ఆసుపత్రి (కెజిహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డాక్టర్ ఉషాదేవి, డాక్టర్ రమలను గోపాలపురం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వీరిని కూడా పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు సోమవారం సికింద్రాబాద్ కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. వీరిని గనుక లోతుగా విచారిస్తే సృష్టి అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో కొన్ని పోలీసు బృందాలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి సృష్టి అక్రమాలపై ఆరా తీస్తున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన డాక్టర్లు కూడా నమ్రతకు సహకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వీరి పాత్ర ఉన్నట్లు తేలితే అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయి.

## బిజెపికి తెలంగాణ గేట్‌వే

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై కాకుండా, మున్సిపల్ పరిపాలనపై దృష్టి సారించి, హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. 'గేట్‌వే ఆఫ్ హైదరాబాద్' అంటూ మాటలు చెప్పడం కాకుండా, క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఆహంకారంతోనే తాను ఓడిపోయాయనని చెబుతున్న నాయకులు(బిఆర్‌ఎస్), మరి 'మీరేలా' ఓడిపోయారని ప్రశ్నించారు. తనకు బిక్ష వేశారని అంటున్నారని, 2014 సంవత్సరంలో టిఆర్‌ఎస్‌లో మొదటి అధికారంలోనిక వచ్చినప్పుడు, సిఎం ఎన్నిక నేపథ్యంలో మొదటి సారి జరిగిన టిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశంలో దళితున్ని సిఎం చేస్తారా? అనే గుసగుసలు జరిగాయని, తానే జోక్యం చేసుకుని అనుభవం కలిగిన, తెలంగాణ సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన కెసిఆర్‌నే సిఎం చేయాలని తాను సూచించానని బాలరాజు గుర్తు చేశారు. అయితే సిఎం పదవి తాను ఇచ్చిన బిక్ష అని చెప్పవచ్చునా అని ఆయన బిఆర్‌ఎస్‌ను ప్రశ్నించారు. ప్రజలు ఓట్లు వేస్తేనే ఎంఎల్‌ఏ పదవి వచ్చిందన్నారు. ఓటమి చెందడంతో బిఆర్‌ఎస్‌లో అసహనం పెరిగి, ఎవరిపైన పడితే వారిపైన ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని బాలరాజు ఆరోపించారు.

## ఒకటే ఓటు

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ వక్కాణించారు. లింక్‌పై క్లిక్ చేసి... 'ఓట్ చోరీ ప్రూఫ్, డిమాండ్ ఇసి అకౌంటబిలిటీ, రిపోర్ట్ ఓట్ చోరీ'ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. బిజెపి, ఇసిఐ ఎన్నికల మోసాలను బహిర్గతం చేసే తన వీడియో కూడా అందుబాటులో ఉందన్నారు. 'ప్రజాస్వామ్యానికి మూలాధారం ఓటు, దానిపై బీజేపీ, ఈసీ నుంచి వ్యవస్థీకృత దాడి జరుగుతుంది' అన్న సందేశాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా కాంగ్రెస్ ఇస్తున్నది. నమోదు చేసుకున్న వారికి ఓట్ చోరీకి ఆమె/అతను వ్యతిరేకమని, డిజిటల్ ఓటర్ జాబితాల కోసం రాహుల్ డిమాండ్‌కు మద్దతిస్తున్నట్లు సర్టిఫికేట్ లభిస్తుంది. సర్టిఫికేట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కోశాధికారి అజయ్ మాకెన్ సంతకాలు ఉంటాయి. అనేక మంది కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నారు. తమ సర్టిఫికేట్లను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉండే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షానికి బయటకు వెళ్లకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**నిండు కుండల్లా జలాశయాలు..**

ఈ భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణా, గోదావరి నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్ జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు కూడా వరద పోటెత్తింది. హుస్సేన్ సాగర్ కూడా నిండు కుండలా మారింది. ఈ జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దిగువ ప్రాంతాల ప్రజలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## రూ.58 కోట్ల ముడుపులు

(మొదటి పేజీ తరువాయి)

వాద్రా ఒత్తిడి తీసుకొచ్చారని, ఆ ఒప్పందంలో భాగంగానే వాద్రాకు ఈ భూమిని సంబంధిత సంస్థ ఉచితంగా ఇచ్చేసిందని ఈడీ ఆరోపిస్తోంది. భూమి విలువను తక్కువ చేసి చూపించడం ద్వారా రూ.45 లక్షల స్టాంప్ డ్యూటీ కూడా ఎగవేశారని, ఆ కేసులో కూడా వాద్రాకు శిక్ష పడాలని ఈడీ వాదించింది. దీనిపై విచారణను ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేసిన ప్రత్యేక కోర్టు వాద్రాకు నోటీసులు జారీ చేసింది.

## పంపిణీలో గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తన మిత్రుడితో తప్పుడు తేదీలతో సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఇష్యూ చేసేవారు. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సెక్రటరియేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే పిఎ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు సిఎం రిలీఫ్ ఫండ్ స్కాంలో చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అసలైన బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరుతున్నారు.

### 2024 ఒడిశా ఎన్నికల్లోనూ...

# 'ఓట్ల దొంగతనం'

### ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ భక్తచరణ్ దాస్ ఆరోపణ

**భువనేశ్వర్ :** కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘంపై 'ఓట్ల దొంగతనం', ఈసి, బిజెపి కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నాయన్న ఆరోపణలు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో ఒడిశా రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఒడిశా కాంగ్రెస్ ఆరోపించింది. గత ఏడాది అసెంబ్లీ, లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఎన్నికల్లో ఒడిశా రాష్ట్రంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ ఆరోపించింది. శనివారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్‌దాస్ ఈ ఆరోపణ చేశారు. పోలింగ్ రోజున సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల మధ్య దాదాపు 42లక్షల ఓట్లు వేశారని చెప్పారు. సాయంత్రం ఇంత పెద్ద సంఖ్యలో ఓటర్లు ఎలా వచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. ఒడిశాలో బిజూ జనతాదళ్ (బిజెడి) ఏ ఒక్క లోక్‌సభ సీటునూ ఎందుకు గెలుచుకోలేక పోయిందనే ప్రశ్నలను లేవనెత్తారు. బిజెడి 51 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది కానీ ఒడిశాలో సింగిల్ లోక్‌సభ సీటునూ గెలుచుకోలేకపోయింది. బిజెడి కొన్ని లోక్‌సభ స్థానాలలో నాలుగు లేదా ఐదు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. కానీ తన అభ్యర్థులు ఎంపీలు కాలేకపోయారు. అలా ఎందుకు అయ్యిందో అంతుచిక్కని ప్రశ్న అని దాస్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఒకే ఒక్క లోక్‌సభ స్థానం కోరాపుట్‌ను గెలుచుకుందని, పార్టీ కోరాపుట్ లోక్‌సభ స్థానంలో భాగమైన ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకుగాను ఆరు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుందని ఒడిశా కాంగ్రెస్ చీఫ్ భక్తచరణ్ దాస్ వివరించారు. సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ ప్రతీ జిల్లాలోనూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 'ఓట్ల దొంగతనం ద్వారా ఎన్నికల సంఘం చేసిన మోసాన్ని, బిజెపి అధికారంలోకి వచ్చిన తీరును ప్రజలకు వివరిస్తాం' అని దాస్ చెప్పారు. కాంగ్రెస్ చీఫ్ భక్తచరణ్ దాస్ ఆరోపణలను బిజెపి సీనియర్ నాయకుడు జయనారా తోసిపుచ్చారు. 'కాంగ్రెస్ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆక్షేపించారు. వారికి అనుకూలత ఉంటే, పత్రాలు ఉంటే వారు ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలి. లేదంటే సమర్థ న్యాయస్థానాలను ఆశ్రయించాలి' అని జయనారా సూచించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

మంత్రి తుమ్మలకు సిఎం హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వానాకాలం పంటల సీజన్ పూర్తిగా ఊపుందుకోవడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఉండేందుకు వ్యవసాయశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వ్యవసాయ శాఖ సంబంధిత అంశాలు, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన మేర ఎరువుల సరఫరా లేకపోవడంతో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతానికి వరి పంటలకు పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ వాణిజ్య పంటలకు మాత్రం నష్ట వాటిల్లే అవకాశం ఉండడం తదితర అంశాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఎంకు వివరించినట్లు సమాచారం.

# రైతుల చూపు.. నానో వైపు

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** రైతులు ఎక్కువగా నత్రజని ఎరువులు వాడితే భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూసారాన్ని తగ్గించే యూరియాను అధిక మొత్తంలో వాడొద్దని అవగాహన సదస్సులు నిర్వహించి మరీ చెబుతున్నారు. ఇదే సమయంలో భూసారం పై ప్రభావం చూపని ద్రవరూపంలో ఉండే నానో యూరియా వినియోగించాలని సూచిస్తున్నారు. నానో యూరియా అనేది ద్రవ రూపంలో ఉండే ఒక కొత్త నత్రజని ఎరువు. దీని కణాల పరిమాణం 20 నుంచి 50 నానో మీటర్లు మాత్రమే ఇది ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పనిచేస్తుంది. పంట దిగుబడిని సగటున 8 శాతం వరకు పెంచగలదని వివిధ పరిశోధనల్లో తేలిందని వ్యవసాయశాఖ చెబుతుంది. మొక్కల పోషణ వినియోగ సామర్థ్యాన్ని సైతం 80శాతం వరకు మెరుగుపరుస్తుంది. నానో వాడకం వల్ల రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతాయి. బస్తాలను మోయాల్సిన అవసరం ఉండదు. అది మొక్కల నిరంతరంగా నత్రజనిని అందించే రిజర్వాయర్‌లా పనిచేస్తుంది. సుస్థిర వ్యవసాయానికి తోడ్పడుతుంది. దీనిని సాధారణ స్ప్రేయర్లతో పిచికారీ చేయవచ్చు. చాలా వరకు పురుగు మందులు, తెగుళ్ల మందులతో కలిపి వాడవచ్చు. మిశ్రమాన్ని కలిపే మందు. 'జార్ టెస్ట్' (గాజు సీసా పరీక్ష) తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. కలుపు మందులతో కలిపి వాడకపోవడమే మంచింది.

### అతి తక్కువ ధర ...

నానో యూరియా వినియోగంతో పంట సాగు ఖర్చు తగ్గుతుంది. అర లీటర్ ద్రావరణం 45 కేజీల గుళికల యూరియా బస్తాకు సమానంగా పరిచేస్తుంది. బస్తా యూరియా రూ. 266.50 కాగా, నానో యూరియా రూ. 225కే అర లీటర్ లభిస్తుంది. దీంతో రైతులకు ఖర్చులు ఆదా అవుతాయి. మరోవైపు భూసారంపై ఎలాంటి



ప్రమాదం చూపకుండా రైతులకు ప్రయోజనకారిగా ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఆర్థికంగా లాభదాయకం. నానో యూరియా వినియోగంతో పంటల్లో పచ్చదనం చురుగ్గా పెరుగుతుంది. గుళికల యూరియాను రైతులు పంట సాగుకు రెండు నుంచి మూడుసార్లు వినియోగిస్తున్నారు. ఇందులో నత్రజని 30 నుంచి 50 శాతమే వినియోగంలోకి వస్తుంది. మిగితా ఎరువు వృధాగా పోతుంది. దీంతో నేల, గాలి, నీరు కలుషితం అవుతుంది. నానో యూరియా మాత్రం కేవలం పంటకు మాత్రమే ఉపయోగపడుతుంది.

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

**రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి, కాగజ్‌నగర్**

గుళికల యూరియాతో పోలిస్తే నానో యూరియాతో అత్యధిక ప్రయోజనాలు లభిస్తాయి. నానో యూరియా పిచికారి చేయడం వల్ల కేవలం పంట మాత్రమే వినియోగించుకుంటుంది. భూసారం తగ్గకుండా ఉంటుంది. రైతులు గుళికల యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించాలి. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

# దేవాదుల ప్రాజెక్ట్ త్వరలోనే పూర్తి

డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్‌పై సమీక్ష

**ప్రజాపక్షం/ములుగు :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్ట్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని, పెండింగు బిల్లులను చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద దేవాదుల పంపు హౌస్ వద్ద రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జే.చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకాటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్.నాగరాజు, మురళి నాయక్, స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ ప్రభుత్వం హయాంలోనే దేవాదుల ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే దేవాదుల పూర్తిలో జాప్యం జరిగిందని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతలో తీసుకుందని తెలిపారు. వీలైనంత తొందరలో దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చెస్తామని అన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ భూ సేకరణ పనులను వెంటనే పూర్తి చేస్తామని, భూ సేకరణపై జిల్లా కలెక్టర్లు వెంటనే పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. భూ సేకరణలో న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాదుల పనులలో జాప్యం జరగడానికి బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ పై ప్రత్యేక దృష్టి పెడుతున్న నీటి పారుదల శాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేవాదుల ప్రాజెక్ట్ కింద ఆయకట్టు గణనీయంగా పెరిగిందని, పెరిగిన ఆయకట్టుకు సరిపడా నీటి కేటాయింపులు లేవని, ప్రస్తుతం దేవాదులకు 38 టిఎంసిల కేటాయింపులు ఉన్నాయని, దానిని 80 నుండి 100 టిఎంసీలకు పెంచాలని కోరారు. వీలైనంత తొందరలో సీడబ్ల్యూసితో చర్చించి నీటి కేటాయింపులు పెంచే ప్రయత్నం చేయాలని, దీనిని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని నీటి కేటాయింపులు పెంచాలని, నీటిని ఎత్తిపోయడానికి వాడుతున్న మోటార్లు పాత పడడం వల్ల తరచూ సమస్యలు ఎదురవుతున్నాయని, మోటర్ల సమస్యల వల్ల పూర్తి స్థాయిలో నీటిని పంపు చేయలేకపోతున్నామన్నారు. పంపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దశల వారీగా పంపుల నిర్వహణ మరమ్మతులు చేపట్టాలని, 3వ దశలోని ప్యాకేజీ 6 పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్యాకేజీ 6కింద స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాలలో 78వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని అన్నారు. కావున 3వ దశలోని ప్యాకేజీ 6పనులను పనులను వెంటనే పూర్తి చేయాలని, భూసేకరణ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



### సమక్క సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన మంత్రులు

ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకలగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించి, గంగారం దేవాదుల ఇంటేక్ పంప్ హౌస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమక్క సాగర్ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై ఇంజనీర్లతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, క్రీడలు మంత్రి వాకిటి శ్రీహరి అనంతరం సమీక్ష నిర్వహించారు.

# పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా మిగతా సామాజిక వర్గాలను కలుపుకుపోయినప్పుడే, సర్వాయి పాపన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లినట్టు అని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 'సర్దార్ పాపన్న ధర్మ పరిపాలన సంస్థ (ఎస్‌పిడిపిఎ) జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ' సంయుక్త ఆధ్వర్యంలో 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్' 375వ జయంతి జాతీయ వారోత్సవాలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్, బిసి కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ మంత్రులు వి.శ్రీనివాస్ గౌడ్, జోగి రమేష్, మాజీ ఎంపీ భరత్ గౌడ్, గుల్బర్గా ఎంఎల్‌ఎ జయదేవ్ గుత్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ సర్వాయి పాపన్న రాజ్యాధికారాన్ని స్థాపించి, చరిత్రలో నిలిచారంటే, ఆనాటి అన్ని సామాజిక వర్గాలనూ కలుపుకుపోయారని గుర్తు చేశారు. సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వృత్తిని కాపాడుకునే విషయంలో, పోటీ ప్రపంచంలో పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి, ఉపాధి అవకాశాలను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని సర్వాయి పేటలో పాపన్న గౌడ కోటకు రూ.5 కోట్లు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నామని, ఈ నెల 17న సైదాపూర్‌లో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. కోకపేటలో కేటాయించిన స్థలాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలనే విషయమై ఆలోచించాలని, యాదగిరిగుట్ట, వేములవాడలో సత్రం నిర్మించామని, జోగులాంబలో స్థలం కొనుగోలు చేశామని, అక్కడ కూడా సత్రా న్ని నిర్మిస్తామని కరీంనగర్‌లో పెద్ద గౌడ హాస్టల్‌ను నిర్మించామని వివరించారు. గతంలో కోటి 10 లక్షల ఈత మొక్కలు నాటారని, ప్రస్తుతం ఒక సంవత్సరం లోనే 40 లక్షల ఈత మొక్కలు నాటుతున్నామని, ఈత తాటి మొక్కలు పెద్ద ఎత్తున నాటి సంరక్షిస్తున్నామని తెలిపారు. సర్వాయి పాపన్న గౌడ్ వారసులుగా మన వృత్తిని రక్షించుకోవాలని, మొక్కలు నాటాలని సూచించారు.

# హెచ్‌సిఎ అవినీతిలో కూరుకుపోయింది

'తెలంగాణ క్రికెటర్స్ మీట్'లో టిసిఎ నేత ధరం గురువారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అవినీతిలో కూరుకుపోయిందని, క్రీడాకారుల పరువు జైలు పాలు చేశారని, వారి అక్రమాలు క్రీడాకారులు సహా అందరికీ తెలిసిపోయిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి తెలిపారు. వరంగల్ ఐఎంఎ హాల్‌లో, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి జైపాల్ సమన్వయంతో, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం 'తెలంగాణ క్రికెటర్స్ మీట్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధి కోసం, టిసిఎ ఎన్నో ఏళ్లుగా చేస్తున్న కృషికి గుర్తింపు ఇవ్వాలని, ఈ విషయంపై ఈ సమావేశంలో పాల్గొన్న క్రికెటర్లు ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ క్రికెట్ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు టిసిఎ ప్రణాళికలు సిద్ధం చేసిందని స్పష్టం చేశారు. 2021 జూలైలో బిసిసిఐ కోలాబరేషన్ ఆదేశాలను హెచ్‌సిఎ పాటించలేదని, బాంబే హైకోర్టు కంటెంప్ట్ ఆదేశాల ప్రకారం మార్చి 29, 2025న జరిగిన హెచ్‌సిఎటిసిఎ చర్చలకు తుది రూపం ఇవ్వకపోవడం ద్వారా, హెచ్‌సిఎకి తెలంగాణ క్రికెట్ అభివృద్ధిపై శ్రద్ధ లేదని స్పష్టం అవుతోందన్నారు. ప్రస్తుతం టిసిఎ కోరేది కోలాబరేషన్ కాకుండా మెంబర్‌షిప్ అని, రాష్ట్ర క్రికెట్ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి టిసిఎకు గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పొన్నాల జగన్, సమీ, ఎండి జాకీర్ హుస్సేన్, స్టీఫెన్, శరత్ యాదవ్, ఎండి మోహిన్, కలువల శివ, భాస్కర్, నవరసాన్, శశాంక్, పలువురు క్రికెట్ అభిమానులు, సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.

# శివ శంకర్ నేటి రాజకీయ నాయకులకు స్ఫూర్తి




పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ కేంద్ర మంత్రి శివ శంకర్ నేటి రాజకీయ నాయకులకు ఒక స్ఫూర్తిగా నిలిచారని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. రవీంద్ర భారతిలోఆదివారం మాజీ కేంద్రమంత్రి పుంజాల శివ శంకర్ 96వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, కార్పోరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్ గౌడ్, అనిల్ ఈరవర్తి, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ళ శారద, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కెవిపి రామచంద్రరావు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఇందిరా గాంధీకి శివశంకర్ అత్యంత సన్నిహితంగా క్రియాశీల నిర్ణయాల్లో అండగా ఉన్నారని తెలిపారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో శివశంకర్ చాలా ప్రభావితం చేశారన్నారు. మనమంతా శివ శంకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు.

# బంగారం, వెండి కంటే ఆరోగ్యమే నిజమైన సంపద




ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన గిడ్డంగిని ప్రారంభించిన గవర్నర్ విష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వైద్య ఖరీదైన ప్రస్తుత సమాజంలో ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన జనఔషధి కేంద్రాలను అన్ని ప్రాంతవాసులకు జన ఔషధీ పరియోజన ద్వారా అందుబాటులో తెచ్చే యత్నం విప్లవాత్మక కార్యక్రమమని రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఉప్పల్‌లో పిఎంబిఐ లార్వెన్ జనఔషధి డిస్ట్రిబ్యూషన్ అండ్ మార్కెటింగ్ గిడ్డంగిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీదైన బ్రాండెడ్ ఔషధాలను మార్కెట్ ధరల కంటె 90 శాతం తక్కువకు చవకగా జన ఔషధి కేంద్రాల ద్వారా అందిస్తోందని, వీటన్నింటిని తెలంగాణా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు ప్రస్తుతం ఏర్పాటు చేసిన గిడ్డంగి ద్వారా 6000 అవసరమైన ఔషధాలు, మరియు శస్త్ర చికిత్సా వస్తువులను సరఫరా చేసే వీలవుతుందన్నారు. బంగారం, వెండి ముక్కల కంటే ఆరోగ్యమే నిజమైన సంపద అని, మంచి ఆరోగ్యం లేకుండా మనసు వికసించదని గవర్నర్ తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. నాణ్యమైన జనరిక్ మందులను ప్రధాన మంత్రి భారతీయ జనఔషధి పరియోజన ద్వారా అతి చవకగా అందించటం ద్వారా గ్రామీణ వెనుకబడిన ప్రాంత ప్రజలు వైద్య ఖర్చుల్లో వేల కోట్ల రూపాయాలు ఆదా చేయటంలో సాయపడుతుందని, ఈ మందుల పంపిణీ బాధ్యత చేపట్టిన లార్వెన్ గ్రూప్ ఎండి వరుణ్ మడుపడుగ, సిఈఓ రాములను గవర్నర్ అభినందించారు. అనంతంర కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మోడి నేతృత్వంలో కేంద్ర ప్రభు త్వం 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఆస్తి, పెన్షన్లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా ఏ ఆస్పత్రిలో అయినా చికిత్స పొందేలా ఆయుష్మాన్ భారత్ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. జనఔషధి దుకాణాల ద్వారా జనరిక్ మందులు మార్కెట్ ధరల కంటె 90 శాతం వరకు తక్కువ ధరలకు లభిస్తాయన్నారు. కేంద్రప్రభుత్వం ఆరోగ్యం విషయంలో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు దక్కకుండా చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రారావు, ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, లార్వెన్స్ ఫార్మా అండ్ సర్జికల్ ప్రతినిధులు, తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కార్మికులకు లాభాల వాటా 37 శాతం ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్ రెడ్డి ఏదైనా మాట్లాడితే అర గంటలోనే రాజగోపాల్ రెడ్డి ఖండిస్తారని, మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని నేరుగా ఈటల రాజేందర్ వార్నింగ్ ఇస్తారని, అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఏదో ఒక వివాదం కొనసాగుతోందని, అలాంటప్పుడు బిఆర్ఎస్‌పైన ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, కల్వకుంట్ల కవితతో బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం చర్చలు జరిగాయి. జాగృతికి అనుబంధంగా ఉన్న 'సింగరేణి జాగృతి, హెచ్‌ఎంఎస్' సంఘాలు కలిసి పని చేయాలని వారు నిర్ణయించారు. అనంతరం మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కరప్షన్ గనిగా మారిందని ఆరోపించారు. ఉద్యోగ నియామకాలతో సహా అన్నింట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని, జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని దుయ్యబట్టారు. సింగరేణి సంస్థ కేంద్ర విజిలెన్స్, సిబిఐ పరిధిలోకి వచ్చే విధంగా సంస్థ మారాలని అభిప్రాయపడ్డారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి దసరా తర్వాత సింగరేణి యాత్ర చేపడుతామని కవిత ప్రకటించారు. సింగరేణి కార్మికులు ఏడాది దసరా బోనస్‌గా సంస్థకు వచ్చిన లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో లిబరల్, లెఫ్ట్ సంఘాలు ఏకతాటిపైకి రావాలని కవిత కోరారు.



# మాయమైన పన్ను వసూళ్ల రశీదుబుక్ దొరికింది

కలెక్టర్ సార్ పూర్తి విచారణ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోండి

సస్పెండైన మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ మొర



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపాలిటీలో మాయమైన పన్ను వసూళ్ల రశీదు బుక్ తిరిగి దొరికింది. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్‌ను దీనికి బాధ్యున్ని చేసి విధుల్లో నిర్లక్ష్యంగా వహించారంటూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ గత 24వ తేదీన వేటు వేసిన విషయం అందరికి తెలిసిందే. రశీదు బుక్ తిరిగి మున్సిపల్ కార్యాలయంలో దొరకడంతో దీనిపై పూర్తి విచారణ చేసి తిరిగి తనను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నాడు.

సూర్యాపేట మున్సిపాలిటీలో 2024–25 నల్లా బిల్లు వసూళ్ల కోసం బిల్ కలెక్టర్ చౌడం సురేష్‌కు ఇచ్చిన పన్ను వసూళ్ల రశీదు బుక్ మాయమైంది. అధికారులు నల్లా బిల్లు వసూళ్ల కోసం అతనికి 267 సీరియల్ నంబర్ ఉన్న రశీదు బుక్‌ను కేటాయించారు. సదరు బిల్ కలెక్టర్ 33 రశీదుల ద్వారా వసూలు చేసిన నల్లా బిల్లులు కార్యాలయములోని రెవెన్యూ విభాగంలో జమ చేశారు. ఆనారోగ్యముతో సెలవు పెట్టిన సదరు బిల్ కలెక్టర్ వద్ద ఉన్న రశీదు బుక్, హ్యాండ్ హెల్డర్ మిషన్‌ను అతని నుండి తీసుకురావాలంటే పై అధికారి అయిన ఇంచార్జీ మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ కళ్యాణి 4 ఏప్రిల్‌న సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్‌కు ఫోన్‌లో ఆదేశించడంతో మరో బిల్లు కలెక్టర్ సైదులును వెంట తీసుకొని చౌడం సురేష్ ఇంటికి వెళ్ళి వాటిని స్వాధీనం చేసుకొని మరుసటి రోజు ఆమెకు కార్యాలయంలో అప్పగించారు. ఇదిలా ఉంటే 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడంతో కార్యాలయంలో ఆడిట్ చేస్తుండగా మే 29వ తేదీన చౌడం సురేష్‌కు సంబంధించిన పన్ను వసూళ్ల రశీదు బుక్ మిస్స్ అయినట్లు గుర్తించారు. ఇదే విషయం ఆడిట్ అధికారులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సెలవుల్లో ఉన్న చౌడం సురేష్ ఫోన్ చేసి అడుగగా ఆర్‌ఓ కళ్యాణి ఆదేశాలతో 4 ఏప్రిల్ తేదీన తన ఇంటికి వచ్చి బూర సతీష్, బిల్ కలెక్టర్ సైదులు తీసుకుపోయినట్లు చెప్పాడు. కానీ తనకు అవి అప్పగించలేదని తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఆర్‌ఓ కళ్యాణి అధికారులకు చెప్పడం జరిగింది. దీంతో అప్పటి కమీషనర్ శ్రీనివాసులు ఆర్‌ఓ కళ్యాణికి, సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్‌కు, బిల్ కలెక్టర్ చౌడం సురేష్‌లకు మెమోలు జారీ చేశారు. ఇచ్చిన నోటీసులకు వారు తిరిగి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. బుక్ మాయంపై వారు ఇచ్చిన వివరణ ఆధారాలతో స్థానిక పోలీసులకు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగానే జిల్లా కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్‌ను బాధ్యుడిని చేస్తూ విధుల నుండి గత నెల 24వ తేదీన తొలగించారు. ఇది ఇలా ఉంటే... సస్పెండ్‌కు గురైన సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ తనకు అన్యాయం జరిగిందంటూ మొదటి నుంచి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చౌడం సురేష్ నుండి తాను రశీదు బుక్, హ్యాండ్ హెల్డర్ మిషన్‌ను తీసుకవచ్చి ఇంచార్జి మేనేజర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణికి అప్పగించినట్లు గట్టిగా చెప్పుకొస్తున్నాడు. అయినా అతని మాట ఎవరూ కూడా పట్టించుకోలేదని వాపోయాడు. చిరుద్యోగిని కావడంతోనే తనను బలి పశువును చేశారని కన్నీరు మున్నీరు అవుతున్నాడు. రశీదు బుక్, హ్యాండ్ హెల్డర్ మిషన్‌ను రెండు తీసుకవచ్చి ఇచ్చానని చెబుతున్న సతీష్ హ్యాండ్ హెల్డర్ మిషన్ మున్సిపల్ కార్యాలయంలోని పన్ను వసూళ్ల విభాగంలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఎలా వినియోగంలో ఉందని ప్రశ్నిస్తున్న పరిస్థితి. మాయమైతే బుక్‌తో పాటు మిషన్ కూడా కావాలంటూ చెప్పుకొస్తున్నాడు. మాయమైందని చెప్పిన పన్ను వసూళ్ల రశీదు బుక్ ఈనెల 1వ తేదీన కార్యాలయంలో తిరిగి దొరికింది. అది ఇన్ని రోజులు ఎందుకు కనపడకుండా పోయింది, ఇప్పుడు ఎలా వచ్చిందనే విషయం చర్చనీయాంశంగా మారింది.

**కలెక్టర్ సార్ పూర్తి విచారణ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోండి సస్పెండైన మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్**

తనను సస్పెండ్ చేసిన కలెక్టర్ సార్... దీనిపై పూర్తి విచారణ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ వేడుకుంటున్నాడు. తాను మొదటి నుండి చెప్పిందే నిజమైందని అయినా నా మాట ఎవరూ పరిగణలోనికి తీసుకోలేదని వాపోయాడు. మున్సిపల్ ఉన్నతాధికారులు వారు చేసిన తప్పిదాన్ని తనపై రుద్ది తప్పుడు నివేదికను కలెక్టర్‌కు అందజేశారని చెప్పారు. తాను చిరుద్యోగిని కావడంతో పైఅధికారులు చేయని నేరాన్ని తనపై మోపి సస్పెండ్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని రైతుల ధర్నా

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** విద్యుత్ సమస్యలను వెంటనే ప రిష్కరించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మ ండలం ఐనం గ్రామ రైతులు ఆదివారం కాగజ్‌నగర్ వి ద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భ ంగా రైతులు మాట్లాడుతూ ఐనం గ్రామంలో లోఓల్టేజి సమస్యలు ఉండటంతో వ్యవసాయ బోర్లు పనిచే యడం లేదని లోఓల్టేజి వలన పొలాలకు నీళ్లు అందక పొలాలు ఎండిపోతున్నాయని వాపో యారు. వర్షంలో కరెం టు సమస్య వచ్చి న విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవ డం లేదని అన్నారు.మా పొలాలకు 24 గంటలు విద్యుత్ స రఫరాచేయాలని తమ సమస్య అధికారులు వెంటనే పరిష్కరించాలనివారు అన్నారు. గ్రామ రైతులు ఉన్నారు.





## జనసేన కార్యాలయానికి తెలంగాణ మంత్రులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయానికి తెలంగాణ మంత్రులు రావడంతో జనసేన నేతలు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరి తదితరులు ఆదివారం మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మంగళగిరిలోని జనసేన కార్యాలయ ఆవరణలో లాండ్ అయింది. జనసేన నేతలు పవన్ కళ్యాణ్ తరుపున వీరికి ఘనస్వాగతం పలికారు. శాసనమండలి విప్ హరిప్రసాద్, ఇతర జనసే నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. తిరుగు ప్రయాణం సందర్భంగా కొండపల్లి బొమ్మలతో కూడిన జ్ఞాపకాలను మంత్రులకు అందజేసి వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## భూపాలపల్లిలో దొంగల హల్‌చల్

### ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో దొంగలు పది ఇండ్ల లో ఒకేసారి చోరీ చేసి హల్‌చల్ సృష్టించారు. రాఖీ పండుగ సందర్భంగా ఇండ్లకు తాళం వేసి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న విలువైన బంగారం వెండి డబ్బులు అపహరణకు గురయ్యాయి. శనివారం అర్ధరాత్రి తాళం వేసిన పది ఇండ్లలో తా ళాలు పగలగొట్టి సుమారు 30 తులాల బంగా రం, కిలోనర వెండి, రూ.3 లక్షలు దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. భూపాలపల్లి లక్ష్మీ నగర్‌లో ఒకేసారి 10 ఇండ్లలో చోరీ జరిగి న విషయాన్ని తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మె ల్యే గండ్ర సత్యనారాయణ రావు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఓదార్చారు. చోరీకి గ ల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులలో వెంటనే దొంగలను ప ట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్‌ను ఆదేశించారు. ఇ లాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా దొంగలను పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని కోరారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 30 వార్డులలో అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను వెంటనే పట్టుకొని క్రైమ్ రేటును తగ్గించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. దొంగలను పట్టుకొని చోరీకి గురైన సొత్తు ను స్వాధీనపరచుకొని బాధితులకు అందించే వి ధంగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. క్లూస్ టీమ్స్ రంగంలోకి దిగి సీ సీ కెమెరాల ఫుటేజ్ తో పాటు వేలిముద్రల న మూనాలను సేకరించారు. వీలైనంత తొందరగా దొంగలను పట్టుకుంటామని సిఐ నరేష్ కుమార్ తెలిపారు.ఈ దొంగతనం తోపట్టణంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## ధర్మపురిలో చిరుత సంచారం

### భయాందోళనలో శివారు ప్రజలు, రైతులు.

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో చిరుత పులి సంచారం భయాందోళనలు సృష్టించింది. పట్టణ శివారులోని పోచంపంపు ప్రాంతంలో ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకై వెళ్లిన ఓ రైతుకు చిరుత కనిపించడంతో విషయాన్ని స్థానికులకు తెలిపాడు. సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు చెప్పగా సదరు ప్రాంతంలో చిరుత జాడకై జల్లెడ పట్టారు. ఆచూకీ లభ్యం కాకపోగా దాని పాదముద్రల కొలతలను సేకరించారు. అనంతరం ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ శివారు ప్రాంతంలో చిరుత సంచరిస్తుందన్న సమాచారంతో వెతకగా దాని పాదం ముద్రలను బట్టి అది చిరుత పులిగా భావిస్తున్నట్లు చెప్పారు. శివారు ప్రాంత ప్రజలు, రైతులు చీకటి పడే లోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని, ఒక్కరి కంటే ఎక్కువగా పనులకు వెళ్లాలని సూచించారు. చిరుత జాడ కోసం గస్తీ నిర్వహిస్తున్నామని కనిపిస్తే సమాచారం ఇవ్వాలని బీట్ అధికారి జీవన్ తెలిపారు.




## జాతీయ విద్యావిధానంలోనే విద్యావ్యవస్థ పటిష్ఠం

### ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానంతో విద్యావ్యవస్థ పటిష్ఠ పరచడానికి మరింత దోహదపడుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో అల్ఫోర్స్ హైస్కూల్(సిబిఎస్ఇ)లో ఏర్పాటు చేసిన జాతీయ విద్యావిధానంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజంలో వెలువడుతున్న మార్పులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఉపాధ్యాయులు వాటిపట్ల విశ్లేషణాత్మకంగా వ్యవహరించాలన్నారు. విద్యా విధానంలో చోటు చేసుకున్న సమూల మార్పులకు , అత్యుత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళికలను చాల వ్యూహాత్మకంగా విశ్లేషణాత్మకంగా నిపుణులతో చర్చించిన తర్వాత ప్రవేశపెట్టడం జరిగిందని వారు తెలిపారు. విధ్యార్థులకు అనువైన పద్ధతుల్లో బోధన అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. నూతన ప్రమాణాలకు ధీటుగా ప్రవేశపెడుతున్న బోధన పద్ధతులను అలవర్చుకోవడమే కాకుండా అమలు పరచాలని వారు సూచించారు. కార్యక్రమానికి విచ్చేసిన రిసోర్స్ పర్సన్స్ ఎన్ఎస్ శ్రీనివాస్, సంజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యావిధానంలో వస్తున్న మార్పులను ఉపాధ్యాయులకు తెలియజేయడానికై, విషయాలను విశ్లేషణాత్మకంగా విధ్యార్థులకు సమాజంలో వెలువడుతున్న మార్పులకనుగుణంగా పలు అంశాల్లో శిక్షణ పొందాలన్నారు. తరగతి గదిలో సక్రమంగా అమలుపరచడమే కాకుండా విధ్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. నూతన విద్యావిధానం ద్వారా బోధించడం హర్షించదగ్గ విషయమన్నారు. చిన్నపిల్లలకు నేర్పించే విద్యావిధానం చాలా ఆకర్షణీయంగా నిలిచింది. కార్యక్రమంలో సిబిఎస్ఇ రిసోర్స్ పర్సన్స్ ఎన్ఎస్ శ్రీనివాస్, నాంపల్లి సంజీవ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నుంచి నీటి తరలింపును ఆపండి

### పోలవరం ఎత్తు తగ్గించాలి
### బనకచర్లను అంగీకరించం
### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
### సహచర మంత్రులతో కలిసి జవహర్ ఎత్తిపోతలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం :** శ్రీశైలం ఎగువ భాగాన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి తరలింపును తక్షణం నిలిపివేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని కోరారు. 11టిఎంసిల నీటిని తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని, తద్వారా నల్గొండ, ఖమ్మం జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర మండలంలో వైరానదిపై రూ.600కోట్లతో నిర్మిస్తున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి సహచర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా సాగర్ ఆయకట్టు రెండవ జోన్‌లోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా రోజూ ఒక టిఎంసి నీటిని విడుదల చేస్తేనే లక్షలాది ఎకరాలు సాగవుతుందని అటువంటిది పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 11టిఎంసిలు తరలించుకుపోతే ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒకవైపు కేంద్రంతో, మరో వైపు న్యాయ స్థానాల్లో తెలంగాణ వాటాల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని ఆయన తెలిపారు. వీరిద్దరూ గట్టిగా నిలబడడంతో బనకచర్ల, శ్రీశైలం లిఫ్టు నిర్మాణం ఆగిందన్నారు. భద్రాచలం డివిజన్‌లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కన పెట్టాలని సోనియా గాంధీకి విజ్ఞప్తి చేస్తే ఆమె సానుకూలంగా స్పందించారని, కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి తెలంగాణలోని బిఆర్‌ఎస్‌లు కలిసి ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాయని భట్టివిక్రమార్క తెలిపారు. గిరిజనులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలు ఆర్డినెన్స్ ద్వారా పోలవరానికి ధారాదత్తం చేశారని ఆయన ఆరోపించారు. గిరిజనులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా ఎపి సిఎం పోలవరం ఎత్తు తగ్గించి రెండు లక్షల ఎకరాలను కాపాడాలని భట్టి విజ్ఞప్తి చేశారు. వరద జలాల వాటా తేలిన తర్వాతే బనకచర్ల ప్రస్తావన తీసుకురావాలి తప్ప అప్పటివరకు తీసుకు రావాల్సిన పనిలేదన్నారు. పదేళ్ల పాటు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి సందర్భంలోనూ జవహర్ ఎత్తిపోతల పథకం కోసం ప్రయత్నం చేశానని, కానీ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మధిర నియోజక వర్గంలో ఆయకట్టు చివరి రైతుల బాధలు, ఇబ్బందులు గత ప్రభుత్వానికి అర్థం కాలేదన్నారు. 30 గ్రామాలకు సాగునీరు రావాలంటే ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉండేదని భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పుడు రెండవ జోన్‌కు తీసుకు రావడంతోపాటు జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించే అవకాశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగర్ ఎడమ కాలువపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించి మధిర ప్రాంతాన్ని సాగర్ రెండవ జోన్‌లోకి తీసుకురావడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకానికి రూ.600కోట్లు ఖర్చు అవుతుందని, 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మధిర నియోజక వర్గంలో ఐదు మండలాలు ఉండగా ప్రతి రెండు మండలాల మధ్య ఒక ఏరు పారుతుందని ఆయన గుర్తుచేశారు. కట్టలేరు, వైరా నదిపై నీటి పథకాలను ఏర్పాటు చేసుకున్నామని ఆయన తెలిపారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఖమ్మం జిల్లా వ్యవసాయ పరిస్థితులు దారుణంగా ఉండేవని భట్టి విక్రమార్క గతాన్ని గుర్తుచేశారు. జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు వచ్చిన మంత్రులకు మధిర ప్రాంత రైతాంగం ఘన స్వాగతం పలికారు.


# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** విద్య ద్వారా నిరక్షరాస్యతను అంతం చేయాలని, విద్యార్థులకు విద్య అందించడం ద్వారా వారి జీవితాలలో వెలుగులు నింపవచ్చునని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం తాడ్వాయి మండల తోగులో నూతనంగా నిర్మించిన పాఠశాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుత్తికోయ గూడాలలో చిన్నారులకు విద్య అందించాలని ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఈ ప్రాంతం అభయారణ్యంలో ఉండడం ద్వారా అనుమతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ తరుణంలోనే ఈ ప్రాంతంలోని పిల్లలకు విద్యను అందించాలనే సంకల్పంతో పీపుల్ హెల్పింగ్ సెంటర్ ఎన్‌జిఓ సంతోష్ 2020 కరోనా నుండి ఈ ప్రాంతంలో మాతో కలిసి తమ సేవలను అందిస్తున్నాడని, చక్రవర్తి హాస్పటల్ యాజమాన్యం గత సంవత్సరంలో తక్కళ్ళపాడులో స్కూల్ నిర్మించారని, ఈ రోజు ఇక్కడ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, సహకరించడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. విద్య అందరి ప్రాథమిక హక్కు అని, గిరిజన ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డిఎస్‌పి రవీందర్, చక్రవరి హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తరుణ్‌రెడ్డి, మండల అధికారులు, ఎన్‌జిఓ సంతోష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మాందాపూర్ అడవుల్లో ఆదిమానవుడి అడుగుజాడలు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని మాందాపూర్ ఆటవి ప్రాంతంలో ఆదిమానవుని అడుగుజాడలు కనిపిస్తున్నాయి. 420 ఎకరాలలో విస్తరించి ఉన్న ఆ ప్రాంతంలో విశాలమైన రాతి బద్దలపై ఆదిమానవుడు వేసిన చిత్రాలు ఇప్పటీకి చెక్కు చెదరకుండా ఉన్నాయి. రాతి గుండు కింది బాగంలో మనిషిని పోలిన చిత్రం కనిపిస్తుంది. అంతేగాకుండా సమీపంలో పెద్ద గుహ దానిలో 100 మంది ఉండే విధంగా ఉంది. ఇటీవల ఈ ప్రాంతంలోని రాతి బండలపై గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు సమాచారం.

## పేరుకే సిర్పూర్ ... ఏ పనికి అయినా కాగజ్ నగరే దిక్కా ?

**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి):** సిర్పూర్ నియోజకవర్గ పేరు సిర్పూర్ .. కానీ హామీలూ, కార్యాలయాలూ, అధికారులూ, సేవలన్నీ కాగజ్‌నగర్‌లోనే కేంద్రితమైపోతే ప్రజలు ఏం భావించాలి ?. నిజంగా పేరును కాగజ్‌నగర్ నియోజకవర్గంగా మార్చడం ఏం తప్పా ? అని ప్రజలు ఉద్వేగంగా ప్రశ్నిస్తున్నారు. ఒక్కొక్క శాఖ దినదిన ప్రాముఖ్యత సిర్పూర్‌ను ఎలా వెనక్కినెట్టిందో చూపే నిదర్శం.

**సిర్పూర్ నియోజకవర్గంలోని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ కాగజ్‌నగర్‌లోనే..**

(ఆర్‌డిఒ) కార్యాలయం డివిజనల్ అధికారి, పోలీస్ డివిజన్ కార్యాలయం కాగజ్‌నగర్, డిఎస్‌పి, అటవీ శాఖ కాగజ్‌నగర్, డిఎఫ్ఒ, కార్మిక శాఖ డివిజన్ కార్యాలయం. వ్యవసాయ శాఖ డివిజన్ కార్యాలయం. ఇగిరేషన్ డివిజన్ కార్యాలయం. హౌజింగ్ డివిజనల్ కార్యాలయం, అగ్నిమాపక కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగింది.

**సిర్పూర్ (టి)లో ఏమున్నాయి..?**

ఒక్కో గ్రామ పంచాయతీ , మండల స్థాయి కార్యాలయం మినహా మిగతావి దాదాపుగా నియోజకవర్గంలోని కార్యాలయాలు కాగజ్‌నగర్‌లో ఉన్నాయి. ప్రజలు తాము నిత్యం ఎదుర్కొంటున్న సేవలకు సంబంధించి పొడి ప్రకటనలు కాకుండా నేరుగా అధికారులు సమీపంలో ఉండాలని కోరుతున్నారు. కానీ అందుకోసం వారెందరో కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి.

**పాలకులు సిర్పూర్‌ను వెక్కిరిస్తున్నారు... ప్రజల ఆవేదన**

సిర్పూర్ టౌన్‌కి రైల్వే స్టేషన్ వనవాసి జనభా అన్నీ ఉన్నా ప్రభుత్వం చూపే అభివృద్ధి దృష్టిలో మాత్రం పాక్షికత కనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడు అంటున్నారు. సిర్పూర్ నియోజకవర్గం పేరు వినగానే ఒక అభివృద్ధిని చూపాలి. కానీ ఇప్పుడు సిర్పూర్ అన్న వెంటనే ఏం అభివృద్ధి లేదు కదా ! అనే వెక్కిరింపు కనిపిస్తుంది. పేరు మార్చి కాగజ్‌నగర్ నియోజకవర్గం చేస్తే బహుశా నిజానికి దగ్గరగా ఉంటుందని స్థానికుల యువతాభిప్రాయం.

**పరిష్కార మార్గం ఏమిటి ?**

సిర్పూర్ టౌన్‌లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు, ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించాలని ప్రజలు వినతులపై జిల్లా స్థాయి సమీక్ష కమిటి ఏర్పాటుకు చొరవ అవసరం. పాలకులు సంవత్సరానికి కనీసం ఆరు నెలలు సిర్పూర్‌లోనే ఉండాలి అన్న నిబంధన తీసుకురావాలి అని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన కేంద్ర ప్రభుత్వం

### ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** రా జ్యాంగాన్ని, ఓటుహక్కును కేం ద్రంలోని మోదీ ప్రభుత్వం అపహా స్యం చేసిందని వరంగల్ ఎంపి క డియం కావ్య అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు హనుమకొండ లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ అక్రమాలపై ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధం చేసిన పిపిటిని ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ ఎం పి డాక్టర్ కడియం కావ్య మాట్లాడతూ బీహార్ ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని తమ నాయకుడు రాహుల్ గాంధీ గుర్తించి ఆధారాలతో సహా ప్రశ్నిస్తే కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు స్పం దించలేదన్నారు. ఒక్క నియోజకవర్గం లోనే లక్ష ఓట్లు పెరగటం, ఒకే ఇంటి నెంబర్ పై 200300 ఓటర్ల నమోదు కావటాన్ని పరిశీలిస్తే అవన్నీ తప్పుడు ఓట్లని అర్థమవుతున్నని పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు మోదీ అమిత్ షా ఇసిని ఉపయోగించుకుని అనేక అవకతవకలకు పాల్పడ్డారని తెలిపారు. గాంధీ కుటుంబం గురించి, వారి త్యాగాల గురించి ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి మనకు ప్రధానిగా ఉండటం మన దురదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంపి పసునూరి దయాకర్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు, టిపిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీ మాన్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుసుమ వరుణ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# భయపెడుతున్న దొంగలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల కాలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తాళాలు వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి పాల్పడుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. శుక్రవారం తెల్లవారుజామున ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని గొల్లగూడెంలో మారణాయుధాలు, ముఖానికి ముసుగులు ధరించిన ముగ్గురు దొంగలు సంచరించడం సిసి కెమెరాల్లో రికార్డయింది. ఒక తాళం వేసి ఉన్న ఇంట్లోకి వెళ్లి రావడం కూడా కెమెరాలో రికార్డు కాగా ఎటువంటి చోరీ జరగలేదు. కానీ సత్తుపల్లిలో శనివారం జరిగిన దొంగతనాల్లో ఇక్కడ పాల్గొన్న ముగ్గురి మాదిరి అక్కడ కూడా ముగ్గురు దొంగతనానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరు వారు ఒకే రీతిగా ఉన్నారని బయట నుంచి దొంగల ముఠా దిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి మారణాయుధాలతో దొంగలు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# పల్లె దవాఖానతో ప్రజలకు మెరుగైన వైద్యం

### ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం తాటి పెల్లి గ్రామంలో 27 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 6లక్షలతో వేసిన త్రాగు నీటి పైప్ లైన్ ను ప్రారంభించి, గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్న పెట్ గ్రామంలో 20 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 50 లక్షలతో వేయనున్న సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశాక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నివాళులు అర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల తిప్పన్న పెట్ కు 16 కోట్లతో బ్లాక్ స్పాట్ రోడ్డు మంజూరు చేయటం జరిగిందని జగిత్యాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, తిప్పన్న పెట్ జగిత్యాల పట్టణంలో శివారు గ్రామం కావడంతో త్వరిత గతిన అభివృద్ది సాధ్యం అవుతుందని గ్రామంలో లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని చెరువుల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. శంకులపల్లి 85 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి దశాబ్ద కాలాల సమస్యను పరిష్కరించడం జరిగిందని పల్లె దవాఖానతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని జగిత్యాల నియోజకవర్గానికి అత్యధిక పల్లె దవాఖానలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. జిల్లాకు 16 రాగా జగిత్యాల నియోజకవర్గంలో 14 దవాఖానాలు మంజూరు అయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో జగిత్యాలకు అత్యధికంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 11 కోట్లు,ఈజిఎస్ నిధులు కూడా అత్యధిక నిధులు మంజూరు అయ్యాయని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి అని సీఎం సహకారం అందరు మంత్రుల, అధికారుల సహకారంతో జగిత్యాల అభివృద్ధి సాధ్యం అవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎమ్మార్వో శ్రీనివాస్, డిఈ మిలింద్, రామారావు, ఎంపీఓ రవి బాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఈ విజయ్, నాయకులు దామోదర్ రావు, ఎల్లారెడ్డి, రౌతు గంగాధర్, ములసపు లక్ష్మీ, మహేష్, నాదెం శంకర్, బక్కశెట్టి అంజన్న, బోలిశెట్టి గంగారెడ్డి, నీరటి గంగారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కాంగ్రెస్ డిఎఫ్ఏ పదవికి ఆనంద్ శర్మ రాజీనామా



**న్యూఢిల్లీ :** పార్టీ పునర్నిర్మాణంలో సహాయపడటానికి, యువ నాయకులను తీసుకురావడానికి వీలుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ ఆదివారం పార్టీ విదేశాంగ శాఖ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. విదేశాంగ శాఖ జాతీయ కమిటీకి ఆనందశర్మ దాదాపు దశాబ్దం పాటు సేవలందించారు. 'నేను ఇంతకుముందు సీపీ, సీపీపీ చైర్‌పర్సన్ ఇద్దరికీ తెలియజేసినట్లుగా, నా అభిప్రాయం ప్రకారం సామర్థ్యం గల యువ నాయకులను తీసుకురావడానికి కమిటీని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. అది దాని పని తీరులో కొనసాగింపును నిర్ధారిస్తుంది' అని అన్నారు. 'ఈ బాధ్యతను నాకు అప్పగించినందుకు పార్టీ నాయకత్వానికి కతజ్ఞతలు తెలియజేస్తూ, దాని పునర్నిర్మాణాన్ని సులభతరం చేయడానికి డీఎఫ్ఏ (విదేశాంగ శాఖ) చైర్మన్ పదవికి రాజీనామా సమర్పిస్తున్నాను' అని శర్మ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

# బిహార్ ఉప ముఖ్యమంత్రికి రెండు ఓట్లు

### తేజస్వీ యాదవ్ ఆరోపణ

**పాట్నా:** బిహార్ ఉపముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హాకు రెండు ఓటరు ఎపిక్ కార్డులు ఉన్నాయని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఆదివారం ఆరోపించారు. సిన్హాపై ఏమి చర్యలు తీసు కుంటున్నారని ఆయన ప్రశ్నించారు. తేజస్వీ యాదవ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'విజయ్ కుమార్ సిన్హా రెండు వేర్వేరు జిల్లాల్లో రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన ఓటరు. అతని పేరు ఒకే జిల్లాలోని లఖిసరాయ్ అసెంబ్లీ నియోజకవర్గంలో, పట్నా జిల్లాలోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఉంది' అని తెలిపారు. 'ఆయనకు రెండు వేర్వేరు ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్) లు ఉన్నాయి. ఆశ్చర్యకరంగా, బీహార్‌లో ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత ఇది జరిగింది. సిన్హా లేదా ఎన్నికల కమిషన్ ఎవరు బాధ్యత వహించాలి? సిన్హాపై ఎలాంటి చర్య తీసుకుంటున్నారు? వెల్లడయిన తర్వాత ఆయన (సిన్హా) ఎప్పుడు పదవికి రాజీనామా చేస్తారు? అని తేజస్వి ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై స్పందిస్తూ సిన్హా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'ముందుగా, నా, నా కుటుంబ సభ్యుల పేర్లు బంకిపూర్ అసెంబ్లీ స్థానంలో జాబితా అయ్యాయి. ఏప్రిల్ 2024లో నేను లఖిసరాయ్ నుంచి నా పేరును జోడించడానికి దరఖాస్తు చేసుకున్నాను. నాతోపాటు నా కుటుంబ సభ్యుల పేర్లను బంకిపూర్ నుంచి తొలగించడానికి నేను ఒక ఫారమ్‌ను కూడా నింపాను. నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. ఏదో కారణం చేత బంకిపూర్ నుంచి నా పేరు తొలగించలేదు. అది ఓటరు ముసాయిదా జాబితాలో కనిపించింది. నేను బూత్ లెవల్ అధికారికి ఫోన్ చేసి లిఖితపూర్వక దరఖాస్తును సమర్పించి, బంకిపూర్ నుంచి నా పేరును తొలగించాలని కోరుతూ రసీదు తీసుకున్నాను. నా దగ్గర రెండు పత్రాలు ఉన్నాయి. నేను ఒకే చోట ఓటు వేశాను' అని సిన్హా తెలిపారు. 'నేను ఒకే చోట ఓటు వేశాను. గతసారి కూడా నేను ఒకే చోట ఓటు వేశాను. జంగిల్‌రాజ్ యువ రాజు (తేజస్వి) అవాస్తవాలు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్ర యత్నిస్తున్నాడు.



తాను (తేజస్వి) ఇతరుల ప్రతిష్టను దెబ్బతీసే నాటకం ఆడుతున్నాడని బీహార్ మొత్తానికి తెలుసు. నాపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు ఆయన క్షమాపణ చెప్పాలి' అని సిన్హా అన్నారు. అయితే బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ లఖిసరాయ్ అసెంబ్లీ నియోజకవర్గంలో సిన్హా ఎపిక్ నంబర్ ఐఏఫ్ 3939337 అని, పట్నా జిల్లాలోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన ఎపిక్ నంబర్ ఏఎఫ్ఎస్0853341 అని వివరించారు. 'సిన్హా వయస్సు ఒక జాబితాలో 57 సంవత్సరాలు. మరొక జాబితాలో 60 సంవత్సరాలు. ఇది వయస్సు కుంభకోణం కాదా? అతను రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు వేర్వేరు ఫారమ్‌లను నింపి ఉండాలి. అతను ఉద్దేశపూర్వకంగా రెండు వేర్వేరు ప్రదేశాల్లో రెండు ఓట్లను నమోదు చేసుకున్నాడు. అతను వ్యక్తిగతంగా రెండు ఫారమ్‌లపై సంతకం చేయకపోతే, ఎన్నికల కమిషన్ నకిలీ సంతకాల ఆధారంగా రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అతనికి రెండు వేర్వేరు ఓట్లను సష్టించిందా? అతనికి రెండు వేర్వేరు నోటీసులు అందు కుంటారా లేదా ఈ నియమాలు ప్రతిపక్ష నాయకులకు మాత్రమేనా?' అని తేజస్వి నిలదీశారు. తన వద్ద రెండు ఎపిక్ నంబర్ లు ఉన్నాయనే ఆరోపణలకు స్పందించమని ఈసీ కోరడంపై ఆర్‌జేడీ నాయకుడు మాట్లాడుతూ 'నేను ఈసీకి సమాధానం ఇచ్చాను. దీనికి నేను ఎందుకు వివరణ ఇవ్వాలి?' అని అన్నారు. ఇటీవల తన సొంత అధికారులు చేసిన తప్పును ఈసీ తనపై రుద్దడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

# భారత్ అభివృద్ధి నచ్చడం లేదు

### ట్రంప్‌పై రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్ష వ్యాఖ్యలు

**భోపాల్:** భారత్ వేగంగా అభివద్ధి చెందడాన్ని కొన్ని దేశాల నేతలు చూడలేకపోతున్నారని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అందరికీ మేమే బాస్ అనుకునే వాళ్లకు భారత్ వద్ధి నచ్చడం లేదన్నారు. తమతో సమానంగా భారత్ ఎదగకూడదనే అహంకారంతో మన దేశాభివద్ధి కుంటుపడేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఆ దేశాల ఉత్పత్తుల కంటే భారత వస్తువులు, ఉత్పత్తులు మరింత ఖరీదయ్యేలా చేయడానికి అధిక సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివద్ధిని ఎవరూ ఆపలేరని అన్నారు. భారత్ అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుందని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు.



మన దేశాన్ని తయారీ, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన 'మేకిన్ ఇండియా' వల్ల వివిధ రంగాల్లో స్వదేశీ ఉత్పత్తులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశ రక్షణ ఎగుమతులు రూ.24వేల కోట్లు దాటాయని, ఇవి రక్షణ రంగ బలాన్ని, అభివద్ధిని సూచిస్తున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రాజ్‌నాథ్ సింగ్ రైలు, మెట్రో కోచ్ తయారీ యూనిట్ 'గ్రీన్‌ఫీల్డ్ రైల్ కోచ్ తయారీ కేంద్రం'కు శంకుస్థాపన చేశారు. 60హెక్టార్లకు పైగా విస్తరించి ఉన్న ఈ ఫ్యాక్టరీ మెట్రో రైళ్లు, వందే భారత్ రైళ్లకు కోచ్‌లను తయారు చేస్తుంది. రూ.1,800 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు మొదటి దశ 2026లో పూర్తయ్యే అవకాశం ఉంది. అనంతరం ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

# న్యాయవాదులకు నైతికత ప్రధానం

### మాజీ సిజెఐ చంద్రచూడ్



**ఛత్రపతి శంభాజీనగర్:** న్యాయవాదులు నైతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. ప్రత్యర్థుల నుంచి అవమానాలను పట్టించుకోవద్దని, అది కేసు గెలవడానికి సహాయపడదని, పదవీ విరమణ తర్వాత కూడా ఈసూత్రాన్ని అనుసరిస్తున్నానని చెప్పారు. 'న్యాయవాద వృతి వర్తమానంభవిష్యత్తు: అవకాశాలు, సవాళ్లులోపాలు' అనే అంశంపై విష్ణుపంత్ అడ్వాంట్ ఉపన్యాస శ్రేణి సందర్భంగా ఇక్కడ న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. న్యాయవాద వత్తి అనేది ఒత్తిడితో కూడినదని, న్యాయవాదుల మానసిక, ఆరోగ్య సమస్యలను క్రమపద్ధతిలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. న్యాయవాదులు తమ గుర్తింపును 'అన్నిటికంటే ముందు న్యాయాన్ని అందించే సులభతరం చేసేవారు' గా తమ గుర్తింపును మార్చుకోవాలన్నారు. విజయానికి సత్వర మార్గం లేదని, న్యాయ విద్యార్థులు జీవితాంతం నేర్చుకునేవారని, స్వతంత్ర ఆలోచనాపరులుగా ఉండాలని తెలిపారు. ఎల్లప్పుడూ వారి అభిప్రాయాలతో నిజాయితీగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. 'స్పోర్టింగ్ చాంప్ సిండ్రోమ్'ను నివారించాలన్నారు. చట్టం 'ఒక ఆట కాదు' అని అన్నారు. 'మీ చట్టాన్ని, వాస్తవాలను లోతుగా తెలుసుకోండి. మీ కేసును పాత తీర్పులలోకి ఇముడ్చుకునే ప్రయత్నంలో తప్పిపోకుండా జాగ్రత్త వహించండి' అని సూచించారు. 'మీ ప్రత్యర్థి అవమానాలు చేస్తే, వాటిని విస్మరించండి అనే ఫాలి నారిమన్ సూత్రాన్ని నేను పాటించాను. నా పదవీ విరమణలో కూడా నేను దానిని మోస్తున్నాను. నన్ను అవమానించే వ్యక్తులకు, నా దగ్గర ఒకే ఒక సమాధానం ఉంది. అది మిమ్మల్ని సంతోషపెడితే, అలాగే ఉండండి' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. న్యాయ రంగంలో మహిళలు మరింత మంది చేరాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు

# 'ఆపరేషన్ సిందూర్' చదరంగం లాంటిదే

### శత్రు కదలిక తెలియని సంప్రదాయేతర యుద్ధం

### సైనికదళాల అధిపతి ఉపేంద్ర ద్వివేది

**చెన్నై:** 'ఆపరేషన్ సిందూర్'సైనిక చర్య శత్రు కదలికల జాడ గురించి ఎంతమాత్రం తెలియని గతం కంటే భిన్నమైన సంప్రదాయేతర యుద్ధం అని భారత సైనిక దళాల అధిపతి జనరల ఉపేంద్ర ద్వివేది చెప్పారు. అర్థమయ్యేలా చెప్పాలంటే ఈ సైనికచర్య మనం ఆడే 'చదరంగం ఆట'లో ఎత్తుగడల లాంటిదేనన్నారు. ''ఒక అసందిగ్ధస్థితిలో మనం చదరంగపు ఎత్తుగడలు వేశాం, శత్రుపక్షం కూడా అలాంటి ఎత్తుగడలే వేసింది'' అన్నారు. ఎదుటిపక్షం ఆటగాడి తదుపరి ఎత్తుగడ ఏమిటో కూడా మనకు తెలియని ఒక చదరంగం ఆటతో 'ఆపరేషన్ సిందూర్' సమానమైనదని, ఇది ఎంత మాతంకం గతంలో మనం చేసిన సంప్రదాయ యుద్ధం లాంటిది కాదన్నారు. ''మే నెలలో ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంలో భారత వైమానిక దళం లక్ష్యాన్ని గురిచూసింది. పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న కశ్మీరు ప్రాంతంలో ఉన్న ఉగ్రవాద గ్రూపుల బహుముఖ లక్ష్యాలను మాత్రమే గురిచూసి దాడులు చేసింది, ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం, ప్రధానంగా పహల్గామ్‌లో చేసిన దాడులకు ప్రతీకారం తీర్చుకున్నాం'' అని చెప్పారు. ఐఐటి–మద్రాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపేంద్ర ద్వివేది మాట్లాడారు. గడచిన మే నెలలో ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారతదేశ సైనికచర్య సందర్భంగా ఎదురైన చిక్కులను ఈ సందర్భంగా ఆయన పునరావలోకనం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ సమీపంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు మన పర్యాటకులను కాల్చిచంపినందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆపరేషన్ సిందూర్ గురించి వివరంగా చెప్పడంకోసం ఆయన చదరంగం ఆటను సభలో ప్రేక్షకులకు ఉదాహరణగా చెప్పారు. ''మనం చదరంగం ఆటలో ఆడేదే ఆపరేషన్ సిందూర్ సైనికచర్య విషయంలో కూడా చేశాం, ప్రత్యర్థి తదుపరి ఎత్తుగడ



ఏమిటో మనకు తెలియదు, మన కళ్ళకు ఏమీ కనిపించదు, శత్రువు ఏం చేస్తాడో తెలియదు, అలాంటప్పుడు మనం ఏం చేయాలి? యుద్ధానికి, శాంతికీ మధ్య ఊగిసలాడే ఒక అసందిగ్ధమైనస్థితిగా మనం పిలవాలి. ఇలాంటి అసందిగ్ధస్థితి అంటే, మనం సంప్రదాయ యుద్ధానికి వెళ్ళినట్టు కాదు, మనం ఏదో ఒకటి చేయాలి, సంప్రదాయ యుద్ధం అంటే మన దగ్గర ఉన్న ఆయుధాలు, ఉన్న వనరులన్నింటినీ తీసుకువెళతాం, కావాలంటే మధ్యలో ఒకచోట ఆగుతాం, మళ్ళీ వెనక్కి తిరిగి రాగలుగుతాం, లేనిపక్షంలో అక్కడే ఉండిపోతాం. దీనినే సంప్రదాయ యుద్ధ వైఖరి అంటాం, కానీ ఇక్కడ యుద్ధానికీ–శాంతికీ మధ్య ఒక అస్పష్టమైన స్థితి ఉంటుంది, అంటే అన్ని విధాలుగానూ, అన్ని మార్గాలలోనూ ఏదో ఒక కార్యాచరణ జరుగుతుంది, ఇలాంటి విషయం గురించే మనం మాట్లాడుకుంటున్నాం, 'ఆపరేషన్ సిందూర్' అనేది యుద్ధానికీ–శాంతికీ మధ్య ఉన్న అస్పష్టమైన అసందిగ్ధస్థితి, దీనినే ఆపరేషన్ సిందూర్ మనకు పాఠంగా నేర్పింది'' అన్నారు. ''ఆ విధంగా మనం చదరంగం తరహాలో ఎత్తుగడలు వేశాం, శత్రువు కూడా చదరంగపు ఎత్తుగడలే వేశాడు, ఈ ఎత్తుగడల మార్గంలో ఎక్కడో అక్కడ మనం శత్రువు ఆట కట్టిస్తాం, ఎక్కడో అక్కడ మనం మృత్యువుని ఎదుర్కోవలసి వస్తుంది, మనల్ని మనం కోల్పోయే ప్రమాదం కూడా ఉన్నప్పటికీ కూడా మనం చంపడానికి, శత్రువు ఆటకట్టించడానికే వెళ్ళాం, ఒక ప్రయోజనం నెరవేర్చే మార్గం అది, జీవితం కూడా అలాంటిదే'' అని జనరల్ ఉపేంద్ర ద్వివేదీ అన్నారు.

### మహారాష్ట్రలో ప్రతిపాదిత శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వేకు వ్యతిరేకంగా...

# ఆగస్టు 15న 'నిరసన జెండా'

### పొలాల్లో ప్రభావిత 12 జిల్లాల రైతులు త్రివర్ణపతాకాల ఎగురవేత

### శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే విరోధి సంఘర్ష్ సమితి ఆన్‌లైన్ మీటింగ్‌లో నిర్ణయం

**ముంబయి :** మహారాష్ట్రలో రాష్ట్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రైతులు నిరసన శంఖారావం పూరించారు. సారవంతమైన వ్యవసాయ భూమిని నాశనం చేసే 'ప్రతిపాదిత శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే' కు వ్యతిరేకంగా స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 15) నాడు మహారాష్ట్రలోని 12 జిల్లాలకు చెందిన రైతులు వారి పంట పొలాల్లో జాతీయ పతాకాలను ఎగురవేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఆగస్టు 15న జరిగే ఈ నిరసన ప్రచారంలో 'మా పొలంలో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది' మా వ్యవసాయ భూమిలో శక్తిపీఠ్‌కు స్థానం లేదనే నినాదం ఉంటుందని రాష్ట్రప్రభుత్వానికి ఒకగట్టి సందేశం పంపిస్తున్నాం' అని కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ సతేజ్ పాటిల్ చెప్పారు. శనివారం 'శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే విరోధి సంఘర్ష్ సమితి' ఆన్‌లైన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పాటిల్ చెప్పారు. ఈ సమావేశానికి ప్రభావిత జిల్లాల నుంచి రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన మహారాష్ట్ర కేబినెట్ సమావేశం తూర్పు మహారాష్ట్రను దక్షిణ కొంకణ్‌తో అనుసంధానిస్తూ 12జిల్లాల గుండా వెళ్లే ప్రతిష్ఠాత్మక మహారాష్ట్ర శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే కోసం రూ.20,787 కోట్ల కేటాయింపును ఆమోదించింది. 802 కి.మీ.ల ఈ ఎక్స్‌ప్రెస్ వే నాగ్‌పూర్, గోవా మధ్య ప్రయాణ సమయాన్ని ప్రస్తుతం 18గంటల నుండి 8 గంటలకు తగ్గిస్తుందని అధికారులు తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఆర్‌డిసి) ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తుందని, దాదాపు 7,500 హెక్టార్ల భూమిని సేకరించడానికి హుడ్కో రూ.12,000కోట్లు మంజూరు చేసిందని అధికారులు గతంలో చెప్పిన విషయం విదితమే. రాష్ట్రంలోని అన్ని శక్తిపీఠాలను అనుసంధానించడం, పర్యాటకం, కనెక్టివిటీ ద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడం మహారాష్ట్ర శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే లక్ష్యం అని వారు తెలియజేశారు. ఈ హైస్పీడ్ కారిడార్ వార్ధా, యావత్మల్, హింగోలి, నాందేడ్, పర్భని, బీడ్, లాతూర్, ధారాశివ్, సోలాపూర్, సాంగ్లీ, కొల్హాపూర్, సింధుదుర్గ్‌ల గుండా వెళ్లనుంది. 'ఈ నిరసన చర్యల ప్రాజెక్ట్ నుండి విముక్తి కోసం రైతుల డిమాండ్‌కు ప్రతీక' అని పాటిల్ చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వే ఖర్చు రూ.86,000 కోట్ల నుంచి రూ.1.06కోట్లకు పెరిగిందని సతేజ్ పాటిల్ ఆరోపించారు. దీనికి బదులుగా అభివృద్ధి చెందని ప్రాంతాలలో నిర్మాణం, రైతులకు రుణమాఫీపై దృష్టి పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. రైతునాయకుడు, మాజీ ఎంపి రాజు శెట్టి మాట్లాడుతూ దేశంలో సాగు భూమి విస్తీర్ణం తగ్గిపోతున్న తరుణంలో భూమిని విడిపించడం ఈ నిరసనల లక్ష్యం అన్నారు. శివసేన (యుబిటి) నాయకుడు వినాయక్‌రౌత్ మాట్లాడుతూ ఈ శక్తి పీఠ్ ఎక్స్‌ప్రెస్ వే కేవలం కాంట్రాక్టర్లు, రాజకీయనాయకులకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. ఎమ్మెల్యే కైలాస్ పాటిల్ ముఖ్యమంత్రిపై విమర్శలు గుప్పిస్తూ ఈ ప్రాజెక్ట్ ఆయనకు 'డ్రీమ్' ప్రాజెక్ట్ ఏమో కానీ 'క్రీమ్' ప్రాజెక్ట్‌గా ఉండొచ్చని ఎద్దేవా చేశారు. ఆగస్టు 15న ఎగ్రామసభల్లో ఎక్స్‌ప్రెస్ వే వ్యతిరేక తీర్మానాలు ఆమోదించాలని మాజీ ఎమ్మెల్యేరుత్‌రాజ్ పాటిల్ చెప్పారు. ఆగస్టు 13న కొల్హాపూర్‌లోని బిందు చౌక్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నిర్వహించే నిరసన కార్యక్రమంలో ప్రభావిత జిల్లాలకు చెందిన రైతులు పాల్గొనవచ్చని భావిస్తున్నామని సతేజ్ పాటిల్ చెప్పారు.

# ప్రజల ముంగిటకు న్యాయం

### సిజెఐ బిఆర్.గవాయ్

**ఇటానగర్ :** న్యాయ వ్యవస్థ, శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ ప్రజలకు సేవచేయడానికి, న్యాయం త్వరగా, తక్కువ ఖర్చుతో అందేలా చూసుకోవడానికి మాత్రమే ఉన్నాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ కొత్తగా నిర్మించిన గౌహతి హైకోర్టు, ఇటానగర్ శాశ్వత బెంచ్ భవనాన్ని ప్రారంభించిన తర్వాత ప్రసంగి స్తూ, 'నేను ఎల్లప్పుడూ వికేంద్రీకరణకు గట్టి మద్దతుదారుడిని. న్యాయం ప్రజల ముంగిటకు చేరాలి. కోర్టులు, న్యాయ వ్యవస్థ లేదా చట్టసభలు రాజ కుటుంబం, న్యాయమూర్తులు లేదా కార్యనిర్వాహక సభ్యుల కోసం లేవు. మనమందరం ప్రజలకు న్యాయం అందించడానికి ఉన్నాము' అన్నారు. న్యాయాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేసినందుకు గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను గవాయ్ ప్రశంసించారు. అరుణాచల్ ప్రదేశ్ భిన్నత్వంలో ఏకత్వాన్ని సీజేఐ ప్రశంసిస్తూ... రాష్ట్రంలో 26ప్రధాన తెగలు, 100 కంటే ఎక్కువ ఉప తెగలు ఉన్నాయి. ప్రతి తెగ సంప్రదాయాలు, సంస్కతిని కాపాడటానికి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. దేశం అభివద్ధి చెందాలి. కానీ మన సంస్కతీసంప్రదాయాలను పణంగా పెట్టి కాదు. వాటిని



పరిరక్షించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక కర్తవ్యాలలో ఒకటి' అన్నారు. గత రెండు సంవత్సరాలలో అనేక ఈశాన్య రాష్ట్రాలకు తాను చేసిన పర్యటనలను గవాయ్ గుర్తుచేసుకుంటూ... శక్తివంతమైన గిరిజన సంస్కతిని చూసి 'ఆకర్షితుడయ్యానని' అన్నారు. కలహాలతో నిండిన మణిపూర్‌లోని ఆశ్రయ గహాలను ఇటీవల తాను సందర్శించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, 'అక్కడ ఒక మహిళ 'మీ ఇంటికి స్వాగతం' అని నాతో చెప్పింది. అది నా హదయాన్ని తాకింది ఎందుకంటే మనందరికీ భారతదేశం ఒక్కటే. భారతీయులందరికీ భారతదేశం వారి ఇల్లు' అని అన్నారు. బీఆర్ అంబేద్కర్‌ను ఉటంకిస్తూ ఆయన ఇలా అన్నారు : 'బాబా సాహెబ్ భారతదేశ ఐక్యతకు గట్టి మద్దతుదారు. ఆయన ఎల్లప్పుడూ 'భారతదేశం మొదట, భారతదేశం చివరిది' అని అన్నారు. 75 సంవత్సరాల తర్వాత కూడా మనం చూసిన శాంతి, యుద్ధ సమయాల్లో మన రాజ్యాంగం భారతదేశాన్ని ఐక్యంగా, బలంగా ఉంచుతుందని ఆయన హామీ ఇచ్చారు' అని తెలిపారు. 'ప్రతి మతానికి దాని స్వంత 'ధర్మ గ్రంథం' (మత గ్రంథం) ఉంటుంది. కానీ ప్రతి భారతీయుడికి రాజ్యాంగం గొప్ప 'గ్రంథం'. మన మొదటి విధేయత దానికి ఉండాలి' అన్నారు. పౌరులు పత్రాన్ని చదవాలని కోరారు. 'ఆర్థిక, సామాజిక సమానత్వం లేకుండా రాజకీయ సమానత్వానికి విలువ లేదు' అని అంబేద్కర్ గుర్తు చేసిన విషయాన్ని కూడా గవాయ్ ఉదహరించారు. ఈశాన్య గిరిజన వర్గాల సంస్కతి, సంప్రదాయాలను రక్షించడానికి షెడ్యూల్ 5,6కింద రాజ్యాంగ నిబంధనల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. తొలుత గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అశుతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ కొత్త భవనం భౌగోళిక అడ్డంకులు లేకుండా న్యాయం రాజ్యాంగ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తుందన్నారు. 'అరుణాచల్ మొదటి సూర్యోదయాన్ని చూసినట్లే, ఆలస్యం లేకుండా న్యాయం మొదట వచ్చే ప్రదేశంగా ఉండాలి' అని అన్నారు. కోర్టు భవనాలు కేవలం మౌలిక సదుపాయాలు మాత్రమే కాదని, అవి రాజ్యాంగ నైతికతకు దేవాలయాలన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఉజ్జల్ భూయాన్, ఎన్.కోటీశ్వర్ సింగ్, సందీప్ మెహతా, విజయ్ బిష్ణోయ్ కూడా ఈ సందర్భంగా మాట్లాడారు.

## అమెరికాపై ప్రతీకార సుంకాలు?

### భారత్ యోచన

**న్యూఢిల్లీ:** నిన్నమొన్నటిదాకా మంచి స్నేహ సంబంధాలు ఉన్న అమెరికా–భారత్ మధ్య సుంకాల యుద్ధం నడుస్తోంది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాన్ని ట్రంప్ వి ధించారు. ఇది ఆగస్టు 7 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంతలోనే మరో బాంబ్ పేల్చారు. రష్యాతో సంబంధం పెట్టుకున్నందుకు మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. మొత్తంగా ఆసియా దేశాల్లో అత్యధికంగా భారత్‌పైనే సుంకం వి ధించారు. ఈ పరిణామం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ పరిమాణంపై ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ... తమకు అన్నదాతలే ముఖ్యమని, ఎంత టారిఫ్‌లైనా భరిస్తామంటూ తెలిపారు. రైతుల కోసం ఎక్కడా రాజీపడబోమని తేల్చి చెప్పారు. అయితే తాజాగా అమెరికాపై ప్రతీకార సుంకాలకు భారత్ సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈనెలలోనే తొలి ప్రతీకార చర్య ఉండొచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఎంపిక చేసిన అమెరికా వస్తువులపై సుంకాలు విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే సుంకాలపై తేలే వరకు భారత్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ట్రంప్ తేల్చి చెప్పారు. చర్చలకు వాషింగ్టన్ ముందుకు రాకపోవడంతో ప్రతీకారం తీర్చుకోవడమే ముందున్న మార్గమని, మరొక మార్గం లేదని విషయాలు తెలిసిన వ్యక్తి ఓ జాతీయ మీడియాతో పేర్కొన్నారు.ఆసియా దేశాలపై అమెరికా సుంకాల విషయాన్ని పరిశీలిస్తే... భారత్‌పై 50 శాతం ఉండగా, సిరియా41 శాతం, మైన్మార్40 శాతం, లావోస్40 శాతం, ఇరాక్ 35 శాతం, చైనా 30 శాతం, కజికిస్థాన్25 శాతం, వియత్నాం 20 శాతం, శ్రీలంక20 శాతం, పాకిస్థాన్‌పై 19 శాతం టారిఫ్ విధించారు.

## కుల్‌గామ్‌లో పదో రోజుకు చేరిన ఉగ్రవాద నిర్మూలన చర్య

**శ్రీనగర్:** జమ్మూ కశ్మీరు కుల్‌గామ్ జిల్లాలో ఉగ్రవాదులను నిర్మూలించేందుకు చేపట్టిన సాయుధ చర్య ఆదివారంనాటికి పదోరోజుకు చేరింది. ఉగ్రవాదులను చుట్టుముట్టి వారిని ఎటు కదలకుండా అష్టదిగ్బంధనం చేసి హతమార్చే కార్యక్రమాన్ని భద్రతా దళాలు కొనసాగిస్తున్నాయని సంబంధిత అధికారులు చెప్పారు. ''భద్రతాబలగాలు చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముందుకు కొనసాగుతోంది, ఉగ్రవాదులు రహస్యంగా తలదాచుకున్న ప్రాంతాలను చుట్టుముట్టి వారిని కదలకుండా చేసి వారికి చేరువయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నాం'' అని చెప్పారు. ఉగ్రవాదులు చాలా కఠోరమైన శిక్షణ తీసుకుని ఉగ్రవాద చర్యలకు బయలుదేరినట్లు కనిపిస్తోందని, అటవీయుద్ధంలో వారు బాగా శిక్షణ పొందినట్లు కనిపిస్తోందని, దట్టంగా అల్లుకుపోయిన దండకారణ్య ప్రాంతా న్ని ఆసరాగా చేసుకుని డ్రోన్ల కదలికలకు కనిపించకుండా వారు తప్పించుకుంటున్నారని చెప్పారు. కుల్‌గామ్‌లోని అఖల్ ఆటవీ ప్రాంతంలో ఆగస్టు ఒకటో తేదీన ఎదురుకాల్పులు ప్రారంభమైనప్పటినుండీ, ఉగ్రవాదులు పొంచి ఉండి చేసిన దాడుల్లో ఇద్దరు సైనికులు మరణించగా, మరో తొమ్మిదిమంది గాయపడ్డారు. ఇటీవలి సంవత్సరాలలో కశ్మీరులోయలో ఉగ్రవాదులను హతమార్చడంకోసం చేసిన అతి సుదీర్ఘమైన సైనికచర్య అని ఆ అధికారి చెప్పారు. ఇప్పటివరకూ ఈ ఉగ్రవాదుల జాడ తెలియలేదని, ఈ ఉగ్రవాదులు ఏ సంస్థకు చెందినవారో తెలియరాలేదని, వారికి ఎవరితో అనుబంధం ఉందన్న విషయం కూడా తెలియరాలేదని చెప్పారు. జమ్మూ కశ్మీరు పోలీసు ప్రధానాధిపతి నలిన్ ప్రభాత్ సహా ఇతర సీనియర్ పోలీసు లు, సైనిక అధికారులు, సైన్యంలో ఉత్తర కమాండర్ లెఫ్టినెంట్ జనరల ప్రతీక్‌శర్మ తదితరులు ఈ కుల్‌గామ్‌జిల్లాలో ఉగ్రవాదుల గాలింపు కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఇరవైనాలుగు గంటలూ పరిస్థితిని వారు సమీక్షిస్తున్నారని సంబంధిత అధికారి చెప్పారు.



భద్రతా దళా లు, డ్రోన్లను, హెలికాప్టర్లను రంగంలోకి దించా యి. పారా కమాండోలు కూడా భద్రతా దళాలకు సహాయం చేస్తున్నాయి.

**కిస్త్వార్‌జిల్లాలో ఎన్‌కౌంటర్...** జమ్మూ కశ్మీరులోని కిస్త్వార్‌జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య ఆదివారం ఎన్‌కౌంటర్ జరిగిందని ఆదివారం జమ్మూలో అధికారు లు చెప్పారు. కిస్త్వార్ పర్వతజిల్లాలోని ధూల్ ప్రాంతంలో భద్రతాదళాలు గాలింపు చర్యలు ప్రా రంభించినప్పుడు ఉగ్రవాదులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతాదళాలు గాలింపు చర్యలు చేస్తున్నాయన్న విషయాన్ని గుర్తించగానే రహస్యంగా దాక్కున్న ఇద్దరు ఉగ్రవాదులు కాల్పు లు ప్రారంభించారు. తర్వాత ఇది పరస్పర ఎదురుకాల్పులకు దారితీసింది. ఆర్మీకి చెం దిన వైట్ నైట్ బలగాలు ఎక్స్ వేదికగా ఈ విషయా న్ని ధృవీకరించాయి. ఈఘటనతో బలగాలను అ ప్రమత్తం చేశారు. గూఢచారి సమాచారం ఆధారంగా ఈ గాలింపు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఉగ్రవాదుల కదలికలు బయటపడ్డాయి.

## బిజెపి అనుబంధ సంస్థ ఇసి

### సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబి

**తిరువనంతపురం:** భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) రాజ్యాంగ సంస్థగా తన స్థానాన్ని గుర్తించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుబంధ సంస్థలా వ్యవహరిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఆరోపించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం ప్రచురించిన ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కొన్ని 'సంచలనాలు బహిర్గతం' చేశారని ఆయన అన్నారు. సుప్రీం కోర్టు సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా బీజేపీ ప్రభుత్వం తమకు విధేయులైన వారిని ఎన్నికల కమిషన్‌లో నియమించిందని, వారు ఇప్పుడు 'దుష్ప్రవర్తనకు పాల్పడుతున్నారు' అని ఆయన విమర్శించారు. 'ఒక వైపు వారు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముసుగులో నిజమైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారు. మరోవైపు రెండు రోజులకు పైగా ఒకే చోట కనిపించని ఓటర్లను వారు జోడిస్తున్నారు' అని బేబి ఆరోపించారు. ఒక నియోజకవర్గంలో ఓటు హక్కు పొందడానికి కనీసం ఆరు నెలల పాటు ఒక వ్యక్తి ఆ ప్రదేశంలో నివాసి అయి ఉండాలనే నిబంధనను పాటించడం లేదని ఆయన అన్నారు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు కేరళలోని త్రిస్సూర్ నియోజకవర్గంలో బీజేపీ ఓటర్ల జాబితాలో సుమారు 30 వేలు 'నకిలీ ఓటర్లు' చేరినట్లు తనకు సమాచారం అందిందని బేబీ చెప్పారు. త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో సమీప ప్రాంతాల నుంచి అనేక మంది ఓటర్ల జాబితాలో చేర్చబడ్డారని, ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని ఆయన అన్నారు. కేంద్ర మంత్రి సురేష్ గోపి 2024లో ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు బీజేపీ తొలి విజయం సాధించడం ఇదే మొదటిసారి.


# సాహితీ విహారి

# బహుముఖ ప్రజ్ఞా యశస్వి.. డాక్టర్ ఎస్వీ..



ఎస్వి సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

సమాజాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం... ఉజ్వల భవిష్యత్తును నిర్మించగల మార్గాలను నిర్దేశించే దార్శనికత కేవలం ఇద్దరిలో మాత్రమే ఉంటుంది. ఒకరు గురువు.. మరొకరు రచయిత. సమాజంలో కుళ్లును కడిగేయాలన్నా.. రాబోయే రోజులకు రూపురేఖలు దిద్దాల న్నా... వీరిద్దరికే సాధ్యం. అలాంటి గురువు, రచయిత ఒకరే అయితే, వారి గళం నుంచి వచ్చే ప్రతి శబ్దం.. కలం నుంచి జాలువారే ప్రతిపదం.. ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. భావి తరాలకు మార్గదర్శకమవుతుంది. అ టు అధ్యాపక వృత్తికి, ఇటు రచనా ప్రవృత్తికి న్యాయం చేసిన బహుముఖ ప్రజ్ఞా యశస్వి డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ. ఆయన జీవితం ఓ తెరచిన పుస్తకం. ఆయన సాహి త్యం సమాజానికి దారిచూపే వెలుగు దీపం. ఎస్వీ సాహి తీ ప్రస్థానంలో ప్రతి దశ ఒక కొత్త ఆలోచనను ఆవిష్కరిస్తుంది. ప్రశ్నిస్తుంది. సమాజంలో ఉన్న లోపాలను, అసమానతలను, మూఢనమ్మకాలను, అన్యాయాన్నీ కళ్ళముందు ఉంచుతుంది. వాటిని సరిచేయాలనే తపన గల ఆలోచనాభరితుడైన ఎస్వీ, అభ్యుదయ భావాలు పుణికిపుచ్చుకున్నారని ఆయద రచనలే స్పష్టం చేస్తాయి. ఆయన సాహిత్యం అభ్యుదయ భావజాలాన్ని, ప్రగతిశీల దృక్పథాన్నీ మేళవించిన ఉద్యమ ఝరి. సమానత్వం, సార్వత్రిక మానవత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను గాఢంగా నాటడమే ఎస్వీ విధానం. ఏ కవైనా, కథాకారుడైనా, నాటకరచయితైనా.. తమ కాలంలో నూతన బాట లు వేసి, పాఠకుల మనోగతాలను మార్చాలి. సాహిత్యా న్ని ప్రజల చేరువకు తీసుకెళ్లాలి. మూర్ఖ సంప్రదాయాల పై నిరసన గళం వినిపించాలి. అణచివేతపాలైన వర్గాల హృదయాల్లో స్వేచ్ఛా స్ఫూర్తి నింపాలి. ఈ బాధ్యతలను చిన్నతనంలోనే ఎస్వీ స్వీకరించారు. వివిధ రచనా ప్రక్రియలను అనుసరించారు. నేడు ఎంతో మంది ఆయనను అనుకరిస్తున్నారు. 'ఉద్యమం'పై కవితలు లేదా పుస్తక సంకలనాలు అనగానే ముందుగా గుర్తుకొచ్చే పేరు ఎస్వీ. పాత చీకటి నుండి కొత్త వెలుగుకు, మూఢనమ్మకాల నుండి విజ్ఞానానికి, అసమానతల నుండి సమానత్వానికి తీసుకెళ్ళే ప్రయాణానికి మార్గదర్శకుడు ఎస్వీ అన్నది జయమెరిగిన సత్యం. సామాన్య ప్రజలు ముందుకు రావడం కోసం.. సామాజిక న్యాయం సాధించుకోవడం కోసం.. మహిళా సమానత్వం కోసం.. కుల, మత, లింగ వివక్షలకు వ్యతిరేక ఉద్యమాల కోసం ఆయన పరితపిస్తారు. సాధారణంగా సమకాలీన వ్యవస్థలోని లోపాలకు వ్యతిరేకంగా అతి కొద్దిమంది రచయితలు మాత్రమే స్పందిస్తారు. మార్పును కోరుకుంటారు. అన్యాయాలను ఎదిస్తారు. అణచివేతను ధిక్కరిస్తారు. అలాంటి కొద్దిమం ది రచయితల జాబితాలో ఎస్వీ ముందు వరుసలోనే నిలుస్తారు. సామాజిక సమానత్వం పట్ల అంకితభావం ఆయ న రచనల్లో కనిపిస్తుంది. ప్రగతిశీల భావజాలం లేని స మాజం స్థిరత్వం ఉన్నట్టే కనిపించినా, అది ముందుకు నడవదు. దానిని ముందు నడిపించే శక్తి కలానికి ఉంటే, ఆ కలం బలం తెలిసిన యోధుడు ఎస్వీ. ఆయన అనుసరిస్తున్నది ఒక పద్ధతి కాదు.. ఒక సిద్ధాంతం. ఒక దిశ. బలవంతుడి ఆధిపత్యాన్ని సహించలేని వ్యక్తిత్వం. బలహీనుడి దుస్థితికి కారణమైన సామాజిక పోకడలు.. వేళ్లూనుకున్న అంధ విశ్వాసాలను ఎండగట్టే నైజం. అందుకే ఎస్వీ కలం అన్యాయానికి వ్యతిరేకంగా ఒక ఆయుధంలా మారుతుంది. ప్రస్తుత సమస్యలను మాత్రమే గాక, భవిష్యత్తు తరాల కోసం సమానత్వం, శ్రేయస్సు కలిగిన సమాజాన్ని ఊహించి, దానిని సాధించే మార్గాన్ని చూపించడం ఆయన ప్రత్యేకత. సామాన్యుడి కష్టాలు, కన్నీళ్లను, బాధలను, సమస్యలను ఏకరువుపెట్టడం పెట్టే కవిత్వం వల్ల ప్రయోజనం







ఉండదు. కవి సమాజానికి కేవలం అద్దంగా మారితే ఉపయోగం లేదు. దారిదీపంగా రూపం సంతరించుకొని, వెలుగులు చిమ్మితేనే సమాజికి మేలు. ఆ వాస్తవాన్ని ఆయన ఏనాడో గ్రహించారన్న విషయాన్ని ఆయన రచనలే చెప్తున్నాయి. ఎస్వీ సంపాదకత్వంలో వచ్చిన పుస్తకాలు కూడా ఆయన ఆలోచనలకు అద్దం పడతాయి. 'స్త్రీవాద వివాదాలు', 'దళితవాద వివాదాలు' పుస్తకాలలో చేర్చివ వ్యాసాలు ప్రస్తుత సమాజానికి ప్రతిబింబాలు. స్త్రీవాదం.. దళితవాదం లేని ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఊహించడం కష్టమేకాదు.. అసాధ్యం కూడా. ఈ రెండు పదునైనా అంశాలపై ఒకొక్కరూ ఒక్కో రీతిలో స్పందిస్తారు. కొందరు సుతిమెత్తగా చెప్తే.. మరికొందరు ఉప్పెనలా విరుచుకుపడతారు. వారి వ్యాసాలు, రచనలను సేకరించి, ప్రచురించడం అనుకున్నంత సులభం కాదు. సంయమనం పాటించకపోతే, విమర్శలు వెల్లువెత్తుతాయి. ఆ కార్యాన్ని ఎస్వీ ఎంత లాఘవంగా నిర్వహించారో, ఆ రెండు పుస్తకాలు చదివితే స్పష్టమవుతుంది. దళితవాదానికి అభ్యుదయ వాదం శత్రు శిబిరం కాదంటూ రాసిన వ్యాసమే ఆయన నిబద్ధతకు, పారదర్శకతకు కొలమానం. 'అభ్యుదయ సాహిత్యానికీ, దళిత సాహిత్యానికీ మధ్య ఉన్నది మిత్రవైరుధ్యమేకానీ, శత్రువైరుధ్యం కాదు. దళితులు, దళిత సాహితీవేత్తలు నేడు లేవదీస్తున్న ప్రశ్నలను స్నేహపూర్వకంగా అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికీ అభ్యుదయ సాహిత్యోద్యమం ప్రయత్నిస్తున్నదేతప్ప, ఉదీసీనత వహించడంగానీ, కొట్టిపారేయడంగానీ చేయట్లేదు అనడానికి అనేక తార్కాణాలు న్నాయి' అంటరాయన. ఎన్నో చర్చలకు, మెరెన్నో వాదోపవాదాలకు తెరదించారు. స్త్రీవాదంపై వస్తున్న కుహనా విమర్శకులను 'అంత సబ్జెక్టివ్‌గా తీసుకుంటారేమిటి?' అని ప్రశ్నిస్తారు. 'గట్టిగా అరవడం వల్ల అబద్ధాన్ని నిజం చేయలేరు. నోరు పారేసుకోవడం వల్ల విమర్శకుల నోళ్లు నొక్కేయలేరు. సాహిత్య రంగంలో ఒక పథకం ప్రకారం ప్రచారమవుతున్న అనారోగ్యకర ధోరణులను ఎండగట్టవలసిన అవసరం లేదా?' అంటూ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొడతారు. రచయిత్రులు తక్కువ కాబట్టి వారేం చేసినా భరించాలా? అంటూ కొంత మంది చేసే వితండ వాదానికి ఎస్వీ తన వ్యాసంలో దీటైన సమాధానమే ఇస్తారు. దీనిపై 'ప్రజాపక్షం'లో చర్చలు జరిగాయి కూడా. ఆయన ఆలోచనా సరిళిని ఉటంకించడానికి మాత్రమే 'దళితవాద వివాదాలు', 'స్త్రీవాద వివాదాలు' ప్రస్తావన. ఆయన అభ్యుదయ భావాలకు, ఎంచుకున్న మార్గాలకు అవే సర్వస్వం కానేకావు. ఆయన కేవలం పుస్తకపు పేజీల సరిహద్దుల్లోనే జీవించరు. పాఠకుడి మస్తిష్కంలో ఆలోచనా విత్తనం వేసి.. అది ఒక భావజాల మొక్కగా పెరిగి, సామాజిక మార్పును నిర్దేశిస్తారు. అందుకే అక్షర సేద్యగాడయ్యారు. పాఠకుల ఆలోచనల్లో వెలుగులు నింపినప్పుడే రచయిత తపనకు అర్థమంతమవుతుంది. సమస్యల మూలాలు తెలుసుకొని, సమాధానాలను అన్వేషించగలిగితే రచనలకు సార్థకత చేకూరుతుంది. సామాజిక సంస్కరణలకు మార్గదర్శకం అవుతుంది. ఈ లక్షణాలన్నీ ఎస్వీ రచనల్లో దర్శనమిస్తాయి. జ్ఞాన దివ్వేలు వెలిగిస్తూ ఎస్వీ సాహితీ ప్రయాణం నిరాటంగా కొనసాగుతునే ఉంది. ఆయన స్వయంగా రచనలు చేస్తారు. ఇతర రచనలకు సంపాదకత్వం వహిస్తారు. బహుముఖ ప్రతిభతో, అభ్యుదయ భావాలను వెదజల్లుతూ.. అలుపులేని ప్రయాణాన్ని సాగిస్తునే ఉంటారు. వృత్తి రీత్యా గురువు కాబట్టే ఆయన నిత్యవిద్యార్థి అయ్యారు. ప్రవృత్తి రీత్యా ఆసక్తి ఉంది కాబట్టే, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ ఉంటారు. ఆయన నిశిత దృష్టిని తప్పించుకున్న సమస్య లేదు. ఆయన అక్షరాల అస్త్రాలను ఎదుర్కోని సామాజిక రుగ్మత అసలే లేదు. కవితలు లేదా గీతాలు... వ్యాసాలు లేదా ఉపన్యాసాలు.. అన్ని రూపాల్లోనూ ఎస్వీ తన ఆలోచనల కిరణాలను వెదజల్లుతునే ఉన్నారు. అయితే, అవి చంద్రకాంతి పుంజాల్లా చల్లగా ఉండవు. లావా మాదిరి ఉప్పొంగుతాయి. నిప్పుకణికలై రగులుతాయి. 1969 నుంచి రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్న ఎస్వీ ప్రయాణం అనితర సాధ్యం. లెక్కలేనన్ని సన్మానాలు... పురస్కారాలతో, తెలుగు సాహితీ శిఖరాగ్ర ఆశీనుడైనప్పటికీ, ఆయన 'అందనివాడు'కాడు.. 'అందరివాడు'. ఈనెల 16న 72వ జన్మదినోత్సవం జరుపుకొంటున్న నిత్యయవ్వనుడు, సాహిత్యపిపాసి, భావితరాల మార్గదర్శి ఎస్వీ ప్రస్థానం మరెన్నో దశాబ్దాలు కొనసాగాలని కోరుకుందాం.

– సత్యశ్రీ

> డాక్టర్ ఎస్వి సత్యనారాయణ హైదరాబాద్ పాతబస్తీలో 1954, ఆగస్టు 16వ తేదీన జన్మించారు. అబ్బూరి రామకృష్ణారావు రచనలపై పరిశోధించి ఎం.ఫిల్. పట్టా పొందారు. 'తెలుగులో ఉద్యమగీతాలు' అనే అంశంపై పరిశోధించి పిహెచ్.డి. సాధించారు. 'ఆధునిక తెలుగు సాహిత్యధోరణులు' అన్న అంశంపై డి.లిట్ డిగ్రీ కోసం మద్రాసు విశ్వవిద్యాలయానికి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ ఆచార్యునిగా, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులుగా పనిచేసి 2014లో పదవీ విరమణ చేశారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘంలోను, భారతీయ అభ్యుదయ రచయితల సంఘంలోను క్రియాశీలక పాత్ర పోషించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఒక పర్యాయం ఉన్నారు. ఒక వ్యక్తిగా, వక్తగా, అధ్యాపకుడిగా, సాహితీవేత్తగా వీరు సాగించిన ప్రయాణాన్ని గురువులు, సహచరులు, శిష్యులు విశ్లేషించిన గ్రంథం ఆత్మీయం', ఎస్వీ సాహిత్యాన్ని విశ్లేషించిన గ్రంథం 'సాహితీ యశస్వి' వెలువడినాయి. ఇప్పటి వరకు వీరు జీవజ్వాల, యుద్ధం జరుగుతూనే ఉంది, జీవితం ఒక ఉద్యమం, ఉద్యమం ఉద్యమమే కవితా సంపుటులు, తెలుగులో ఉద్యమగీతాలు (సిద్ధాంత గ్రంథం), ఆలోచన, దృక్పథాలు, విశ్లేషణ, సత్యానుశీలన, తెలుగులో అభ్యుదయ సాహిత్యం మొదలైన విమర్శ గ్రంథాలతో పాటు, ఇరవై ఎనిమిది సాహిత్య గ్రంథాలు ప్రచురించారు. దళితవాద వివాదాలు, స్త్రీవాద వివాదాలు, కవితాద శాబ్ది, దశాబ్ది కవిత మొదలైన మ్ఫు మూడు సంకలనాలకు సంపాదక బాధ్యతలు వహించారు.

## చదవాల్సిన పుస్తకం

### సామాజిక చైతన్యానికి ప్రతీక 'జీవితం ఒక ఉద్యమం'

ప్రముఖ రచయిత, అధ్యాపకుడు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ రచనల్లో 'జీవితం ఒక ఉద్యమం' సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తున్నది. ఈ పుస్తకంలోని 50 కవితల్లో ప్రతి ఒక్కటీ పాఠకుడిని ఆలోచింప చేస్తుంది. మొట్టమొదటి కవిత 'చరితార్థుడు'లో ప్రాణాలు కోల్పోయిన ఒక ఉద్యమకారుడి గురించి చెప్తూ, 'అతడు సామాజిక యోధుడా?




**ఉద్యమ శూరుడా?**
**కలం కార్మికుడా?**
**అతడి కోసం**
**చౌరస్తా ఒక సంతాప సంకేతంగా**
**స్తంభించిపోయింది..**
**నిజానికి..**
చౌరస్తా అందరికీ కన్నీళ్లు కార్చదు'
అంటారు. అదే విధంగా..
'నాగిరికత రోడ్డు మీద అనుబంధాల యాక్సిడెంట్లను
దిగమించుకోలేక కుమిలిపోయిన
పిచ్చితల్లి' అని ఓ 'అమ్మ' కోసం

ఆవేదన చెందుతారు. ఈ కవితా సంపుటి గురించి ఆచార్య సి. నారాయణ రెడ్డి మాటల్లో చెప్పాలంటే, 'కవితలు ప్రయోజనకరంగా, ప్రగతిశీలకంగా ఉన్నాయి'. పుస్తకాన్ని డాక్టర్ ఎన్. గోపి విశ్లేషిస్తూ, 'ఎస్వీ వేదికల మీద వక్త కాబట్టి, కవిత్వంలో కూడా అతనిది వక్తృత్వ శైలే. అయితే, కవిత్వంలో మాటలతోపాటు మౌనం కూడా ఉంటుంది' అంటారు. ఇంతవరకూ వ్యక్తం కాని ఆంతరిక కోణాలను ఆవిష్కరించిన ఈ సంపుటికి సంతోషిస్తున్నానని కితాబునిస్తారు. సాహితీ పరిశోధకుడు, రచయిత, విశ్లేషకుడు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ ఈ పుస్తకంపై అభిప్రాయం వెల్లడిస్తూ, ప్రజాస్వామ్యాన్ని రాజకీయ కీచకులు శీలహరణం చేస్తున వైనాన్ని దుయ్యబట్టారంటూ ప్రశంసించారు. 'ఇవాళటి గాలి' కవిత ఎస్వీ దార్శనికతకు నిదర్శనం.

**'నీళ్లు లేని చోట ఎత్తిపోతలు**
**నీళ్లు రాలని చోట చెక్‌డ్యాంలు**
**బుర్రలో ఒక ఆలోచన మెరిసాక**
**కాంట్రాక్టర్లను పెట్టడానికి ఆలస్యమెందుకు**
**అనుమతులొస్తే వస్తాయ్**
**పోతే పోతాయ్**' అంటూ సాగే ఈ కవితలో ప్రస్తావించిన అంశం మరొకి కావచ్చు. కానీ, నేటికీ సజీవంగా ఉంది. ఆలోచింప చేస్తున్నది. 'సాక్షి' కవితలో
ప్రజల నిరంతర అసంతృప్తి మీద
పాలకులుచల్లే పెద్ద 'సమస్యల' నీళ్లు' అంటూ రాజకీయ చదరంగాన్ని ఎండగడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇందులోని ప్రతి కవితా ఒక గొప్ప స్ఫూర్తినిస్తుంది. సామాజిక పరిస్థితులను కళ్లకు కడుతుంది. ఏం చేయాలో కర్తవ్యబోధ చేస్తుంది. అందుకే, ఇది తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేరుతుంది.

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).


## ఇది నిజం కాదా ! ఆలోచింతురు గాక

భాష ఏర్పడడానికి లిపి ఏర్పడడానికి అనేక వందల సంవత్సరాలు పట్టి ఉంటుంది అటువంటి భాషను పట్టించుకోకుండా వదిలేసినట్లయితే భావితరాలకు ఆ భాష , ఆ భాష మనుగడ, భాషతో ముడిపడి ఉన్న ఆ జాతి కూడా మరుగున పడుతుంది. చరిత్రలో అలా జరిగిన సందర్భాలు ఎన్నో మన కళ్ళ ముందు కనబడుతూనే ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలనలో వారి సామ్రాజ్య అధిపత్యంలో పరిపాలించబడిన అనేక రాజ్యాలలో ఇంగ్లీషు భాష ప్రభావం వలన అక్కడ ఉన్న సంస్కృతి వారి సాంప్రదాయాలు చాలా వరకు మరుగునపడి, ఇంగ్లీష్ వారి సంస్కృతి సాంప్రదాయాలు అలవడినాయి ఆనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఏ దేశ సంస్కృతి అయినా, అది ఆ దేశపు మాతృభాషను ఆవరించు కొని ఉంటుంది. అందువల్ల ఆ దేశపు సంస్కృతిని దెబ్బ తీయాలంటే మొట్టమొదటి వేటు ఆ దేశపు 'మాతృభాషల' మీద పడాలి. మాతృభాషల స్థానంలో ఇంగ్లీషును నింపాలి. తమ మాతృభాషను తమ ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను, తిండి తీర్థాలను, ఆదేశ ప్రజలు తక్కువగా చూసేలా, వాళ్ల మనస్తత్వాన్ని మార్చాలి. ఇందుకు మార్కెట్ భాష అయిన ఇంగ్లీష్‌ను మాతృభాషల స్థానంలో ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం ద్వారా ఈ పని జరిపించాలి. విద్యారంగంలో మొట్టమొదట ఈ పనిని ప్రారంభింప చేయాలి. చాలా జాగ్రత్తగా గమనిస్తే ఈ పని, దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాతనే మొదలుపెట్టారు అని మనకు అర్థమవుతుంది. అంత వరకూ ఇంగ్లీషు మాధ్యమం స్థానంలో మాతృభాషా మాధ్యమాన్ని అమలు పరుస్తున్న ప్రభుత్వాలు అకస్మాత్తుగా మాతృభాషా మాధ్యమం స్థానంలో ఇంగ్లీషును బలవంతంగా రుద్దటానికి గల కారణం ఆర్థిక విధానాలలో చోటుచేసుకున్న మార్పులే, మాతృభాషా మాధ్యమాన్ని నీరసపరిచి, ఆంగ్లభాషా మాధ్యమాన్ని ప్రోత్సహించే కుట్రలో భాగంగానే, వేలాది ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు ప్రభుత్వం ఉదారంగా 'లైసెన్స్'లు ఇచ్చేసింది! ఇంగ్లీషు భాష ఒక్కటే గొప్పభాష అనీ, అది నేర్వని వాడు వెధవైపోతాడనీ, ఏ ఉద్యోగానికైనా, ఇంగ్లీషు తప్పక వచ్చి ఉండాలని, ఒక మిథ్యావాదనను, క్రమంగా ఈ పాతికేళ్లలో ప్రచారం చేసి ప్రజల మెదళ్ళలోకి బలవంతంగా చొప్పించింది. ఆ కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులే, తమ పిల్లలను, ప్రైవేట్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదివిస్తున్నారంటే ఇక సాధారణ ప్రజలగురించి చెప్పాల్సిన పనిలేదు. దీన్ని నిలువరిస్తే తప్ప దేశీయమైన సంస్కృతి బతకదు అన్ని ఉపాధ్యాయ సంఘాలూ, విద్యార్థి సంఘాలూ, ప్రజా సంఘాలూ, ప్రజలమేలుకోరే రాజకీయపార్టీలూ, సంఘటితమై ఒక త్రాటి మీద కొచ్చి పోరాటం చేసినప్పుడే, మాతృభాషా మాధ్యమాన్ని బతికించుకో గలుగుతాము. ప్రపంచీకరణ కుట్రను భగ్నం చేయగలుగుతాము. అయితే అందుకు సంసిద్ధంకాకుండా మనకెందుకులే అని, మాతృభాషపై అంతగా అభిమానం లేని మన తెలుగుప్రజలు మొద్దు నిద్రపోతున్నారు. ఆ మొద్దు నిద్ర వదిలేది ఎప్పుడు, మన తెలుగు ముద్దు అని తెలిసేది ఎప్పుడు.

**రాఘవ మాస్టారు కేదారి**
**జాతీయ తెలుగు పరిరక్షణ సమితి అధ్యక్షుడు**


## ప్రాచీన తెలుగు సాహిత్యంలో సామాజిక న్యాయ ప్రస్తావన

ఎక్కడైనా, ఎప్పుడైనా సామాజిక న్యాయానికి వారధి సాహిత్యమే. అందుకే, సాహిత్యాన్ని సమాజంలో నైతిక విలువలు, సమానత్వం, న్యాయం వంటి భావనలను ప్రజల్లోకి చేర్చే శక్తివంతమైన సాధనంగా పేర్కొంటారు. కానీ, దురదృష్టవశాత్తు తెలుగు సాహిత్యంలో సామాజిక న్యాయం స్పృహ ప్రారంభంలో అంతగా లేదనే చెప్పాలి. ఇటీవల కాలంలో క్రమంగా పెరుగుతున్న సామాజిక న్యాయ దృక్పథం ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించ లేదు. అసలు అలాంటి రచనలు లేనేలేవని చెప్పలేంగానీ, మిగతా వాటితో పోలిస్తే వాటి సంఖ్య చాలా తక్కువ. అరుదుగా కనిపించిన ఆ రచనల్లో ధర్మం, న్యాయం, సర్వ సమభావన వంటి సూత్రాలను ప్రధానంగా చర్చించారు. అందరికీ సమాన న్యాయం, సమాజంలో ఉన్నవారి బాధ్యతలు, పేదల పట్ల కరుణ, ధర్మబద్ధమైన జీవనం వంటి అంశాలను ప్రాచీన కావ్యాలు, శతకాలు, కథలు ప్రోత్సహించాయి. అయితే, ఈ భావజాలం ఎక్కువగా సిద్ధాంత స్థాయిలోనే ఉండిపోయింది. కులవ్యవస్థ, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలను ప్రత్యక్షంగా ప్రశ్నించడంలో ప్రాచీన సాహిత్యం పరిమితంగానే స్పందించింది. మానవతా దృక్పథం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి భావనలు ఉన్నప్పటికీ, అవి వాస్తవికంగా సమాజంలో మార్పుకు దారితీసేలా తీవ్రంగా ప్రతిఫలించ లేదు. సూక్ష్మంగా చెప్పాలంటే, ప్రాచీన తెలుగు సాహిత్యం సామాజిక న్యాయాన్ని ఆదర్శంగా ప్రతిపాదించినా, వాస్తవిక సమస్యలపై గాఢమైన విమర్శ, మార్పు కోసం స్పష్టమైన ఉద్యమం మాత్రం ఆ కాలంలో కనిపించదు. చాలా భాషల్లో తెలుగు కంటే ముందుగానే ఈ దృక్పథం కనిపించింది. ప్రముఖ రచయితలు, వారి రచనల ద్వారా సామాజిక అసమానతలు, అన్యాయాలను ప్రశ్నిస్తూ, సమానత్వం, న్యాయాన్ని ప్రోత్సహించారు. ఉదాహరణకు, లియో టాల్స్టాయ్ రచనలు సామాజిక న్యాయం, సమానత్వం కోసం మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన రచనలు బాలలు, యువతపై ప్రభావం చూపి, సమాజాన్ని మార్చాలనే కోరికను కలిగించాయి. సాహిత్యం ద్వారా పిల్లలకు, యువతకు సమానత్వం, సహాయ సహకారం, సామాజిక స్పృహ వంటి విలువలు బోధించవచ్చు. ఇది వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో సహాయపడుతుంది. అందుకే, సామాజిక న్యాయానికి సాహిత్యం అవసరం. సమాజంలో అసమానతలు, వివక్షలు తొలగించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సాహిత్యం వారధిగా పనిచేస్తుంది. సాహిత్యంలో ప్రతిబింబించే సామాజిక సమస్యలు, మార్పు కోసం ప్రజలను ప్రేరేపిస్తాయి. శాంతి, న్యాయం, సమానత్వం వంటి విలువలను బలపరిచే రచనలు సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. ఇంతటి ప్రభావవంతమైనది కాబట్టే, సామాజిక న్యాయానికి సాహిత్యం ప్రధాన మాధ్యమంగా ఉపయోగపడుతుంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో అంతగా ప్రస్తావనకు రాని ఈ అంశంపై ఇప్పుడిప్పుడే ఆశాజనకమైన మార్పు కనిపిస్తున్నది. సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించే సాహిత్యం విస్తృతమవుతుందని ఆశిద్దాం.



## ప్రతీకారేచ్ఛ పర్యవసానం...






నిత్యం ప్రతీకార జ్వాలల్లో రగిలిపోయేవారు చివరికి తమ వినాశనానికి తామే కారణమవుతారు. ఈ సూత్రమే 'మొబీడిక్' ప్రధాన ఇతివృత్తం. హెర్మన్ నెల్విల్లే రాసిన ఈ పుస్తకం ప్రపంచ సాహిత్యంలో అత్యంత ప్రభావమంతమైన రచనల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 1851లో విడుదలపై 'మొబీడిక్' నవల్లో కథను ఇస్మాయేల్ అనే నావికుడి పాత్ర పాఠకులకు వివరిస్తుంది. కథలోకి వెళితే, కెప్టెన్ అహాబ్ నేతృత్వంలోని 'పెక్వాడ' అనే తిమింగలం వేట నౌకలో ఇస్మాయిల్ కూడా వెళతాడు. 'మొబీడిక్' అనే పేరు గల తెల్ల తిమింగలం కారణంగా తన కాలు పోయిందన్న ఆగ్రహంతో, ఎట్టి పరిస్థితలోనూ దానిని చంపాలని కంకణం కట్టుకుంటాడు. ప్రతీకారంతో రగిరిపోతూ, అనేకానేక రకాలుగా ప్రయత్నిస్తాడు. హార్ప్వనర్ క్వీక్వేగ్, ఫస్ట్‌మేట్ స్టార్బక్, కథను వివరించే ఇస్మాయేల్ ఇందులో కీలక పాత్రలు. 'మొబీడిక్' తిమింగలాన్ని కెప్టెన్ అహాబ్ మూడు రోజులపాటు వెంటాడతాడు. చివరికి పెక్వాడ నౌకను తిమింగలం ధ్వంసం చేస్తుంది. ఇస్మాయేల్ మినహా, అహాబ్‌సహా మొత్తం సిబ్బంది మొత్తం చనిపోతారు. కీక్వేగ్ శవాన్ని ఆధారంగా చేసుకొని ఇస్మాయేల్ ప్రమాదం నుంచి బయటపడతాడు. మానవ స్వభావంలోని మత్తు, ప్రతీకారం, ప్రకృతి శక్తి, మానవ పరిమితులు, జీవనార్థం వంటి అంశాలను ఈ నవల లోతుగా విశ్లేషిస్తుంది. మార్కెట్‌లోకి వచ్చిన కొత్తల్లో ఈ నవలకు పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ తరువాత ఇది అమెరికన్ సాహిత్యంలో గొప్ప నవలగా గుర్తింపు పొందింది.

ఈ వారం కవితలు

## వాచ్ మెన్

రేయి పగలు రెండింటి సంగమంలో
మిళితమైపోతూ జీవనం సాగాలి
గంట గంటకు పర్యవేక్షణ దిశలో
క్షణం క్షణం చూపుకు సానబెట్టాలి
ఎదురు చూపుల ఆత్రుతలతో
ప్రతి నిమిషం నిరీక్షించాలి

భవబంధాల వలలో ఇరుక్కుపోతూ
ఉక్కపోతనైనా భరిస్తూ జీవించాలి
చీకటితో చెలిమి చేస్తూ
నక్షత్రాలతో పలకరిస్తూ
కీటక శబ్దాల మధ్య కూర్చోవాలి

చోరులొస్తారనే దిగుల్ని మీదేసుకుని
మాటిమాటికీ తల పంకిస్తూ వుండాలి
చూపులకు పదును పెడుతూ
ఒంటరిగా కాలంతో జత కట్టాలి
గ్రామ సింహాలతో కరచాలనం చేస్తూ
దోమల గుంపుతో యుద్ధం చేయాలి

దారికి కాపాలా కాస్తూ
కార్ఖానాల గోడ నీడల కింద
మేడల పునాది రాళ్ళకు అనుకుని
కుర్చీని కౌగిలించుకుని
కాలాన్ని మరిచి కాపలా కాయాలి
పొద్దు పొడుపు సంధ్యాసమయం
రెండింటి మధ్యలో కూర్చోవాలి

గాలి దుమారానికి ఒదిగిపోతూ
చినుకు పొటుకులకు కరిగిపోతూ



చలి ఒణుకుతో పులకించిపోతూ
అన్ని రుతువులతో చేయి కలిపి నడవాలి
వాచ్ మెన్ కాపలాదారి
తాను మేల్కొంటూ
మనకు రక్షణ కల్పించే రక్షక దేవుడు

– నరెద్దుల రాజారెడ్డి
9666016636


## కరుణ లేని వరుణుడు

ఉత్తరాఖండ్ జల ప్రళయ బీభత్సం
జన ప్రాణాల రుచి మరిగిన
భయంకర జల ఖడ్గం

హిమాచల్ ప్రదేశ్ వరద బురదలో
అతలా కుతలం
కొండ చరియలు విరిగి పడి
నివాస భవనాలు నేలమట్టం

అరుపుల రోధనలతో
భయానక దృశ్యం
ప్రకృతినే కబళిస్తున్న
వరుణుడి రణరంగం

ప్రతి వత్సరం పునరావృతమే



ప్రత్యామ్నాయం శుష్కప్రియం
ఏలికల సహాయ సానుభూతులనేకము
కర్మకు వదలిన నాయక సంస్కారం

వర్షాలు వరదలు వస్తాయని తెలుసు
పామరులకు ఈ విలయమే వలయం
దేవ భూమిలో దేవుళ్ళకు కొదువలేదు
ప్రజలపై కరుణలేని పాషాణ త్రయం

– నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470

## భయం.. భయం!

మందుల విందులో చావక తప్పదని
మచ్చిమిరప నుండి పాలకూరవరకు,
ప్రతి ఆకు, ప్రతి కాయపై వలె పురుగు
విష ద్రావణ మందుల విందులో.
చావక తప్పదని పురుగుకు భయం.!

తెగులు పురుగు రైతు గుండె అల్లకల్లోలం
పురుగు తింటే పంట పండదని
విషం చల్లకుంటే కడుపు నిండదని
చల్లక తప్పదు రసాయన మందు
ప్రజలకు అందించు విషపు విందు
విషం లేకపోతే పంట నిగనిగలాడక
విషం లేకపోతే గిట్టుబాటే
ఉండదేమోనని రైతు భయం..!

విషపు అని తెలిసినా,
పట్టించుకోని మనిషి ఎందుకంటే,
మార్కెట్లో ఇంకేం దొరుకుతుంది?
విషం ఎక్కువ ఉన్న కూరగాయలకి,
విషం తక్కువ ఉన్న కూరగాయలకి,
బేరం ఆడి తక్కువకె కొన్న ఆనందం
తిన్నాక రోగాల భయం..!

విషం లేక, జబ్బులు రాకపోతే,
ఆస్పత్రులు, క్లినిక్‌లు, మందుల షాపులు
కూలిపోతాయని విషం తిని ప్రజలు
రోగాల పాలవుతుంటే,
రోగం నుండి కాపాడాలని
వైద్యులకు భయమే...!
భయం! భయం..!బ్రతుకంతా
భయమే..!

– దుప్పటి మొగిలి

## అర్హులకు సంక్షేమ పథకాలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహా అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలో అర్హులైన 42 మంది లబ్దిదారులకు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహా కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. విధంగా గ్రామంలో రేషన్ కార్డులలో తమ కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న 153 కుటుంబాలకు రేషన్ కార్డు ప్రొసీడింగ్స్ అందించడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డును మంజూరు చేయలేదని తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ప్రతి లబ్దిదారునికి రేషన్ కార్డుల మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండ్ల బాలకిష్టయ్య, దాస రాజు కర్రన్న, బాల వెంకటయ్య, పోచమోని వెంకటయ్య, చింత దయాకర్ , రంగాపురం తిరుపతయ్య, మండ్ల రాముడు, పోచమోని ఆంజనేయులు , యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి పనులు ఆలస్యంతో.. రాకపోకలకు తీవ్ర అంతరాయం




**ప్రనజాపక్షం/కొత్తపల్లి :** మండల పరిదిలోని మద్దూర్ నిడ్జింత రోడ్డులో గల వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం అవుతుండడంతో బ్రిడ్జి నిర్మాణం ప్రక్కల ప్రయాణికులు పోవడానికి వేసిన మోరం మట్టి రోడ్డు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాత్రి నుంచి ఆదివారం ఉదయం బస్సులు, ఇతర వాహనాలు పోవడానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పుర్తవుతుందో అని అందోళనలో ప్రయాణికులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చికిత్స పొందుతూ లైన్‌మెన్ మృతి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** గతవారంరోజుల క్రితం మండలంలోని మంగనూరు గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రాము(45) బైక్‌పై మహబూబ్‌నగర్ వెళుతుండగా వెల్కిచర్లతండా సమీపంలో ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి బాలకిష్టయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్‌మెన్ రాము మృతిపట్ల విద్యుత్ ఏఈ వెంకటేష్, సహచర ఉద్యోగులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## అమాయకులపై 'మల్టీ లెవల్' ఆకర్షణ వల



**ప్రజాపక్షం/పెబ్బేరు :** తెలంగాణలో పట్టణాల నుంచి పల్లెల వరకు చాప కింద నీరులా విస్తరిస్తున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీలు యువత, గృహిణులు, ఉద్యోగ విరమణ చేసిన వారు ఇలా అన్ని వర్గాల వారిని ఆకర్షిస్తున్నాయి. చిన్న పెట్టుబడి ... పెద్ద లాభం అనే వాక్యం మీద నమ్మకం ఉంచిన వారు రూ. లక్షల్లో పెట్టి , చివరికి నిరాశలో మునిగిపోతున్నారు. ఎంఎల్ఎం స్కీంలు నీవు ప్రాడక్టు కొనాలి, మరొకరిని సభ్యునిగా చేరదీయాలి అనే విధానంతో పని చేస్తాయి. ప్రతి కొత్త సభ్యుడుతీసుకువచ్చిన మరో సభ్యుని నుంచి వచ్చే లాభాల్లో ముందున్న సభ్యుడికి ముడిపడి ఉండే కమిషన్ వస్తుంది. దీనినే పిరమిడ్ స్ట్రీక్చర్ అంటారు. ఇది కొంత వరకు చట్ట బద్దంగా కనిపించినా దాని లోతుల్లోకి వెళ్లి చూస్తే ఇది పిరమిడ్ మోసం తరహాలోకి వెళ్తుంది.

**ఆకర్షణకు బలయ్యే అమాయకులు ....**

జాబ్ కోసం ఎదురు చూస్తున్న యువత, ఆదాయం కోసం తాపత్రయపడుతున్న గృహిణులు వీరు ఎంఎల్ఎం మాయలో పడటం ఎక్కువ. నెలకు రూ. 1 లక్ష వస్తోంది. సెలబ్రిటిలతో మీటింగ్‌లు, దేశీయ విదేశీయ యాత్రలు అంటూ మధ్య తరగతి వ్యక్తులను టార్గెట్ చేస్తూ ఆకర్షిస్తారు. వారిని మభ్య పెడతారు. అయితే లాభం పొందేది పైస్థాయిలో ఉన్న కొద్దిమందే.

**చట్టపరమైన అంశాలు ....**

ఇండియన్ రిజర్వ్ బ్యాంక్ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, కస్టమర్ ప్రొటెక్షన్ అథారిటీస్ ఇటువంటి ఎంఎల్ఎం మోడళ్లపై తరచూ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. 2019లో వచ్చిన అన్ రెగ్యులేటెడ్ డిపాజిట్స్ నిషేధ చట్టం ప్రకారం తగిన అనుమతులు లేకుండా డిపాజిట్లు సేకరించే కంపెనీలలు శిక్షార్హం.

**వాస్తవంగా కొన్ని కంపెనీలు ...**

ఈ రంగంలో ప్రముఖంగా వినిపించే కొన్ని పేర్లు ప్రజల విశ్వాసాన్ని పొందాయి. కొద్ది నెలలకే అవి గాలిలో కలిసిపోయాయి. సెక్యూరిటీ, డిజిటల్ ప్రాడక్ట్స్ ఆరోగ్య సంబంధిత ఉత్పత్తుల పేరుతో ప్రారంభమైన కంపెనీలు చివరికి సభ్యులే లేక మూసుకుపోయాయి. హై రిటర్న్స్ హామీలు ఇచ్చే స్కీముల్ని నిర్ధారణ లేకుండా నమ్మవద్దు. చట్టబద్దమైన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలి. పిరమిడ్ స్ట్రక్చర్ ఉన్నదేనా అని స్వీయ నిర్ధారణ చేసుకోవాలి. ఆదాయం ఉత్పత్తుల అమ్మకాలపైనే ఆధారపడి ఉందా లేక సభ్యులు తీసుకురావడంపైనే ఆధారపడి ఉందా? అనే కీలకమైన విషయాన్ని సభ్యులు ముందస్తుగా తెలుసుకోవాలి. ఎలాంటి పెట్టుబడికైనా ముందుగా పూర్తిగా సమాచారం సేకరించడం అత్యంత ముఖ్యం ఒకరిని తీసుకొమ్మంటారు.. వాళ్ల వల్ల నీకు డబ్బొస్తుందంటారు అనే మాటలు వినిపించిన వెంటనే ఆ వ్యవస్థపై సందేహం పెట్టుకోవడమే ఉత్తమం. చిన్న ఆశలు... పెద్ద మోసాలకు బలయ్యే పరిస్థితి ఉండకూడదు. ప్రజలను మభ్య పెట్టే ఇలాంటి మోసపూరిత మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలను పోలీసులు ముందస్తుగా తమ ఇంటలిజెన్స్‌తో పసిగట్టి నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు... తస్మాత్ జాగ్రత్త

### జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక లాభాల కోసం ఆశపడి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టకండి ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో యాడ్స్ చూసి మోసపోకండి, మీరు పెట్టుబడి పెట్టండి, మీ బంధుమిత్రులతో పెట్టుబడి పెట్టించి అధిక లాభాలు పొందండి అంటూ ఆశ చూపించే చైన్ ఇన్వెస్ట్మెంట్ మోసపూరితమైనదని గ్రహించండి. ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మకండి అది సైబర్ మోసం అని గ్రహించండి. పార్ట్ టైం జాబ్ ఇస్తామని, లాటరీ వచ్చింది అనో, గిఫ్ట్ వచ్చిందనో, కేవైసి అప్డేట్ చేయాలని చెప్పి సైబర్ నేరగాళ్లు పర్సనల్ డీటెయిల్స్ తీసుకోని డబ్బు కాజేస్తున్నారు. ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల మోసాల్లో పడకుండా అప్రమత్తంగా ఉండడం అవశ్యకం అని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు అదేశాలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ తెలిపారు. ప్రజలు మీరు జాగ్రత్తగా ఉండండి తోటి వారిని సైబర్ నేరాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించండి అని ఎస్పీ కోరారు.

## బిసిల రిజర్వేషన్లకు ఆరాధ్యుడు శివశంకర్

### బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** బీసీల రిజర్వేషన్ల ఆరాధ్యుడు, ఆదివారం దేశవ్యాప్తంగా బీసీలు రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నారంటే దానికి ప్రధాన కారకుడు భారత సామాజిక న్యాయ శిఖరం, బీసీల ముద్దు బిడ్డ పి. శివ శంకర్ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శివశంకర్ చిత్రపటానికి వివిధ కుల సంఘ పెద్దలు, బీసీ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి శ్రీనివాస్ సాగర్ ఘనంగా నివాళులుఅర్పించారు. మండల కమిషన్ రిపోర్టును సుప్రీంకోర్టులో వీగిపోకుండా అమలు అయ్యేవిధంగా కృషి చేసిన గొప్ప న్యాయనిపుణుడు శివశంకర్ అని, పార్టీ పిరాయింపుల చట్టం ఈరోజు అమలు అవుతుందంటే అది శివ శంకర్ పుణ్యమే అని శ్రీనివాస్ సాగర్ కొనియాడారు. చిన్నతనంలో చాలా కష్టాలు పడి ఉన్నత చదువులు చదువుకొని దేశానికే న్యాశాఖ మంత్రిగా ఎదిగిన శివ శంకర్ బీసీలకు ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీ కాంత్, జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, నాయి బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు కె. శివ, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ సాగర్, పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి సుకుమార్, బీసీ విద్యార్థి సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్, మహబూబ్ నగర్ వనజీవి రామానంద్, పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘ అధ్యక్షుడు తాయప్ప, నాయకులు వేణు గౌడ్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



## అవినీతిలో పోటీపడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్

### రాష్ట్రంలో అభివృద్ధి అంతా కేంద్రం నిధులతోనే : ఎంపి డికె అరుణ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాష్ట్రంలో అవినీతిలో పోటీపడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రజలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం నాడు జడ్చర్ల పట్టణంలోని ప్రేమరంగ గార్డెన్‌లో నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజలు నిలువుగా మోసం చేస్తూ దోచుకుని తింటున్నాయని ఆమె మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న ఎందుకు ముఖ్య కారణం కేంద్రం నిధులేనని ఆమె మరో సారి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత ముఖ్యమంత్రి కేసిఆర్‌లు తమ పదవులను కాపాడుకునేందుకు నానా యాదన పడుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎలాంటి అవినీతి మచ్చలు లేకుండా ముందుకు సాగుతున్న భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బిజెపిని అభివృద్ధిలో గెలిపించి రాష్ట్ర ప్రభుత్వానికి , టిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్లు బిసిలకు అమలు చేసి బీసీలపై తమ ప్రేమ చాటుకోవాలని ఆమె సూచించారు. ప్రతి గడపకు వెళ్లి కేంద్రం నుంచి వస్తున్న నిధులను వివరించాలని ఆమె కార్యకర్తలకు నాయకులకు సూచించారు. అంతకుముందు డికె అరుణకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికి పూలమాలలు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా రాష్ట్ర నాయకులు కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వల్లూరులో బిఆర్ఎస్‌కు షాక్



కాంగ్రెస్‌లో చేరిన మాజీ వార్డు సభ్యులు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పథకాలు వేగంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో, బిఆర్ఎస్ కు మరొక పెద్ద షాక్ తగిలింది. వల్లూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ వార్డ్ సభ్యులు గొడుగు చెన్నయ్య, రాందాస్, శ్రీకాంత్‌తో పాటు సీనియర్ నాయకులు సైదులు, భాస్కర్ నాయక్, కనకయ్య ఆదివారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల పట్ల ఎమ్మెల్యే కట్టుబాటు మాకు ప్రేరణ ఇచ్చాయి. ప్రజల మేలు కోసం పని చేసే కాంగ్రెస్ లో చేరడం పట్ల గర్వంగా ఉంది అని అన్నారు. జడ్చర్ల లో కాంగ్రెస్ శక్తి రోజు రోజుకు పెరుగుతుండగా, బిఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## పోలీసుల ముందస్తు భద్రత తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఎస్పీ ఆదేశాల మేరకు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్స్‌పెక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, వినాయక చవితి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలలో భాగంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. క్లాక్ టావర్, పుట్నాల బట్టి, రామ్ మందిర్, పాన్ చౌరస్తా, తూర్పు కమాన్, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో గల హోటళ్లు, టీ స్టాళ్లు, పాన్ షాపులలో స్పెషల్ పార్టీ బృందాలు, డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, ప్రజలు భద్రతా నియమాలను పాటించి శాంతి భద్రతలకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు బైకుల పై పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ర్యాలీ చేసిన చట్టరీత్య చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్యతో పాటు ఎస్సైలు సీనయ్య, రషీద్, సిబ్బంది, స్పెషల్ పార్టీ సభ్యులు , రుద్ర డాగ్ హాజరయ్యారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన మండలంలోని గోళ్లబాలయ్య అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కార్మికసంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్‌ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు పోతనపల్లి కృష్ణయ్య, బండిలక్ష్మయ్య, నాగేంద్రం, మాధవరెడ్డి, వెంకటేష్, పరుషరాములు, జంగయ్య, మల్లేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ డిక్లరేషన్‌పై బిజెపి స్పష్టత ఇవ్వాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బిసి డిక్లరేషన్ ఆర్డినెన్స్‌పై బిజెపిపార్టీ ప్రధానమంత్రి నరేంద్రమోడి స్పష్టత ఇవ్వాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ పేర్కొన్నారు. ఆదివారం తాడూరు మండలం అంతారం గ్రామంలో దళితహక్కుల పోరాటసమితి గ్రామకమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసి డిక్లరేషన్‌పై బిజెపి కేంద్రంలో ఉన్న మోడిసర్కార్ స్పష్టత ఇవ్వడంలేదని మోకాలు అడ్డుపెట్టి అడ్డుకుంటుందని విమర్శించారు. దేశం, రాష్ట్రంలో బిసిజనాభా అత్యధికంగా 56శాతం ఉన్నారు, వారి పట్ల బిజెపికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. ఓట్లకోసం దేవాలయాలు, మతం, కులాలు అడ్డుపెట్టుకోవడం తప్ప బిజెపి నైజం అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులు, మైనార్టీలు, మహిళలపై, చిన్నబాలికలపై అత్యాచారాలు దాడులు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వాలన్నారు. డిహెచ్‌పిఎస్ నాయకులు అనిల్, కుర్మయ్య, బంగారయ్య, సుల్తాన్, అరవింద్, వినయ్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్‌పి గెలుపే లక్ష్యంగా పని చేయాలి



బిఎస్‌పి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పట్టణంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జి గువ్వల తిరుపతి అధ్యక్షతన నారాయణపేట జిల్లా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్ పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా, పని చేయాలని నాయకులు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీలను ఎన్నికల ఓటు బ్యాంకు కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓటమి భయంతో కాంగ్రెస్ బిజెపి పార్టీలు బీసీ సమాజాన్ని మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నాయని అన్నారు. 55 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీకి బీసీల రిజర్వేషన్లు గురించి ఆలోచన ఎందుకు రాలేదన్నారు. బిజెపి ఎందుకు అడ్డు పడుతోందని తెలపాలన్నారు. మీ యొక్క కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రజలే మీకు బుద్ధి చెప్తారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని ప్రజలు ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్, మక్తల్ నియోజకవర్గ ఇంచార్జి పాలెం వెంకటయ్య, నియోజకవర్గ అధ్యక్షులు కేవీ నరసింహ, ఉపాధ్యక్షులు పరుశురాం, ప్రధాన కార్యదర్శి మల్‌రెడ్డి, కోశాధికారి మల్లికార్జున్, పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, చంద్రప్ప, వెంకటేశ్ పాల్గొన్నారు.

## దళితవాడలో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రభుత్వాలు ఎన్ని మారిన దళితవాడలలో అభివృద్ధి మాత్రం శూన్యంగా ఉన్నదని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ అన్నారు. ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ దళితవాడలు అంటేనే అటు ప్రభుత్వ అధికారులకు ఇటు నాయకులకు చులకనగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డ్రైనేజి, సిసి రోడ్లులేని గ్రామాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికి ఇవ్వకపోవడంతో కొన్ని కుటుంబాలు పూరిగుడిసెలు, కమ్యూనిటిహాళ్లలో ఉంటున్నారని అన్నారు. అధికారులుకూడా పౌరహక్కుల దినాన్ని జరిపించడం లేదన్నారు. దళితకాలనీల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కేతపల్లి సత్యానారాయణ, ఆంజనేయులు, అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

## ప్రతి స్త్రీని తల్లి, సోదరిగా భావించాలి




**ప్రజాపక్షం/వనపర్తి :** ప్రతి స్త్రీని తల్లి, సోదరిగా భావించాలని, అప్పుడే మహిళా నేరాలు తగ్గుతాయని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు పి.కళావతమ్మ, జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి అన్నారు. ఆదివారం వనపర్తి ఆఫీస్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో రాఖీ పండుగను జరుపుకున్నారు. మహిళా నేతలు, సిపిఐ నేతలు, కార్యకర్తలకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృష్ణవేణి అధ్యక్షతన సమావేశం జరిగింది. మాట్లాడుతూ స్త్రీని ఆట, విలాస వస్తువుగా చూసే దుస్థితి సమాజంలో నెలకొందని ఈ పోకడ మారాలన్నారు. స్త్రీని మాతృమూర్తిగా సోదరిగా చూసే సంస్కారం మగ పిల్లలకు రావాలన్నారు. అది కుటుంబం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలన్నారు. ఆశ్లీల చిత్రాలను , పోస్టర్లను ప్రభుత్వం నిషేదించాలన్నారు. యువత మత్తులో అత్యాచారాలకు పాలల్పడుతున్నారన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాల్ అన్నారు. మహిళా నేరాలు తగ్గాలంటే శిక్షలు వేయటం ఒక్కటే సరిపోవటం లేదని, ససమాజంలో నైతిక విలువలు పెంచాలన్నారు. కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలి పుణ్యక్షేత్రంకు వెళ్లిన మహిళలు బాలికలను అపహరించి అత్యాచారం చేసి హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని మహిళా నేతలు డిమాండ్ చేశారు. 1995 నుంచి 2014 వరకు సుమారు 500 మందిని చంపి ఉంటారనే ప్రచారం జరుగుతోందన్నారు. ఒక కార్మికుడి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ సాగిస్తోందన్నారు. ఈ దారుణాలను ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ దారుణాలకు బాధ్యులు ఎంతటి వారైనా పేక్షించవద్దని పారదర్శకంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పుణ్యక్షేత్రాలు వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మహిళా నేతలు వెంకటమ్మ జ్యోతి విద్యార్థి స్పందన, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నేత కళావతమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాం, సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ , సహయ కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బీమా ప్రసన్నలక్ష్మి

**ప్రజాపక్షం/కొత్తకోట :** జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలుగా కొత్తకోటకు చెందిన బీమా ప్రసన్న లక్ష్మి బంగారయ్య ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. ఆర్యవైశ్య మహసభ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఇటుకూరి బుచ్చయ్య అధ్యక్షతన శనివారం జిల్లా ఆర్యవైశ్య మహసభ అధ్యక్షురాలి ఎన్నిక జరగగా కొత్తకోటకు చెందిన భీమా ప్రసన్న లక్ష్మి బంగారయ్య మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య మహసభ అధ్యక్షులతో పాటు, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య మహసభ మహిళా ప్రతినిధులు తమపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష పదవి అప్పజెప్పినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమర్ధవంతంగా బాధ్యతలు చేపట్టి ఆర్యవైశ్య సమాజం, జిల్లాలోని ఆర్యవైశ్య మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్యవైశ్య మహసభ ముందు పెట్టి ప్రభుత్వంతో పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కొత్త పట్టాదార్ రైతులు ఈ నెల 13 వరకు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 వరకు పట్టాదారు పాస్ బుక్ వచ్చిన గతంలో రైతు బీమా చేసుకొని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బీమా చేయించుకోవడానికి దరఖాస్తు ఫారం పట్టాదారు పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని వ్యవసాయ అధికారి తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మాగనూరు:** నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో జిల్లా ఇంచార్జి నర్సింహా మాదిగ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా పండుగ సాయన్నను ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడుగా కావాలి మొగులప్పను, ప్రధాన కార్యదర్శిగా టి.వాబయ్యను గ్రామం ఇంచార్జులుగా దొబ్బలి గోవిందును, దయాల్ వెంకటప్ప, గడ్డేమొల్ల వెంకటప్ప, సందపోల్లా అంజప్ప, మ్యాకలి సాయన్న, కావాలి మారెప్ప, మాజీ సర్పంచ్, సందపోల్లా సురేష్, దొబ్బలి సందప్ప, కావాలి గోపాల్, సందపోల్లా రాజు, యూ.అంజప్ప, టీ.తాయప్ప, ఉలిగ్యమోళ్ల నర్సింహా, బండారి కరెప్పను, గ్రామ సలహదారులుగా బండారి ఎల్లప్ప, మైత్రి వాబయ్యను, గ్రామ కార్యదర్శులుగా సందపోల్లా వేణు, మ్యాకలి నరేష్, సుదీముక్కు శివకుమార్, జి.రమేష్, సందపోల్లా నరేష్, కడచూర్ శంకర్, సుతారి వెంకటప్ప, దొబ్బలి మల్లప్ప మొదలగు సభ్యులను ఎన్నుకున్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/కోదాడ: యువత తాము ఎంచుకున్న క్రీడలల్లో రాణించి జాతీయస్థాయిలో కోదాడ ప్రాంతానికి మంచి పేరు తీసుకరావాలని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో దికోదాడ వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్, వేనేపల్లి శ్రీనివాసరావు, మహేంద్రకుమార్, రెవిన్యూ అధికారి జానకిరామ్‌రెడ్డి, అధ్యాపకులు మందా శ్రీనివాస రావు, ఈదుల కృష్ణయ్య, ఎక్సైజ్ అధికారి ఎండి ఖలీల్, పిడి విశ్వజ్ఞచారి, పంది కళ్యాణ్ పాల్గొన్నారు.

## స్వార్థ సేవల అవార్డు ప్రదానం



ప్రజా పక్షం/నల్లగొండ టౌన్: కాలిఫోర్నియాలో జరిగిన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టిడిఫ్) యూఎస్ఎ రజతోత్సవ వేడుకల సందర్భంగా,టిడిఫ్ యూఎస్ఎ ప్రతినిధులు ఎం వి గోన రెడ్డికి స్వార్థ సేవల అవార్డు ను ప్రదానం చేశారు. గోనా రెడ్డి తరపున, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా వనితా చేయూత చైర్‌పర్సన్ వాణి ఈ అవార్డును అందుకున్నారు.గోనా రెడ్డి ప్రిన్సిపాల్ పదవి నుండి పదవీ విరమణ చేసిన తర్వాత గత 10 సంవత్సరాలుగా రెండు ప్రముఖ ఎన్‌జిఓ సంస్థలలైన కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓగా,టిడిఫ్ ఇండియా ఛైర్మన్‌గా స్వచ్ఛంద సేవలను అందిస్తున్నారు.ఈ రెండు సంస్థల ద్వారా విద్య,వ్యవసాయం, యువత మహిళా సాధికారత,నైపుణ్యాభివృద్ధి రంగాలలో గణనీయంగా కృషి చేస్తున్నారు. ఈ అంకితభావంతో కూడిన సేవలకు గుర్తింపుగా,ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.

## జంతువులను పరీక్షించిన తర్వాతే మాంసం విక్రయించాలి

ప్రజాపక్షం/కోదాడ: పశువైద్యాధికారులు పరీక్షించిన తర్వాతే జంతువులను కోసి మాంసం విక్రయించాలని కోదాడ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య అన్నారు. ఆదివారం కోదాడలో మున్సిపల్ అధికారులతో కలిసి మాంసం విక్రయ కేంద్రాలను పరిశీలించారు. జంతువులను పశువధశాలలోనే వైద్యుల సమక్షంలో కోసిన తర్వాత మెండెంపై ముద్దర వేసిన తర్వాత మాత్రమే విశాలమైన విక్రయ ప్రదేశాలలో విక్రయించాలని కోరారు. పట్టణంలో ఇది వరకు ఉన్న రెండు పశువధశాలల భవనాలు శిధిలమైపోవడంతో పట్టణంలో 35చోట్ల గొర్రెపోతులు, మేకపోతులను వారి వారి ఇండ్లలో లేదా రోడ్ల వెంబడి కట్ చేసి రోడ్లపైనే మాంసం విక్రయం చేస్తున్నారని, కేవలం ఒక్క మటన్ దుకాణంలో మాత్రమే మటన్ కటింగ్, విక్రయాలు జరుగుతున్నాయని, 9 సెంటర్లలో పశు మాంసం, 5 కేంద్రాలలో పంది మాంసం విక్రయాలు, 9 కేంద్రాలలో చేపల విక్రయాలు జరుగుతుండగా, చాల వరకు రోడ్ల వెంబడే మాంసం అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తించారు. తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య అధికారులు రాజయ్య, బాబురావు, ఆనందరావు, సిబ్బంది, జవాన్ పాల్గొన్నారు.

## నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే అయిలయ్య శంకుస్థాపన

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య పాల్గొని శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 6 గంటలకు మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొని, ఉదయం 9 గంటలకు కస్తూర్బా పాఠశాల కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన కార్యక్రమం, ఉదయం 10 గంటలకు ఎస్సీ కాలనీలో సిసి రోడ్డుకు శంకుస్థాపన, ఉదయం 11 గంటలకు మాసాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు, గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, మధ్యాహ్నం 12 గంటలకు మరిపడిగ గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, మధ్యాహ్నం 1 గంటలకు సీతారామపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డుకు నిర్మాణానికి శంకుస్థాపన, 2 గంటలకు వెల్మజాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు, గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన, 3 గంటలకు అనంతారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన , 4 గంటలకు సుద్దాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 5 గంటలకు బ్రహ్మణపల్లి గ్రామంలోలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు గుండాల మండల పార్టీ అధ్యక్షులు ఏలూరి రాంరెడ్డి తెలిపారు. మండలంలో ఎంఎల్ఏ పర్యటనను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

## కాకతీయ సేవా సమితి అండ



ప్రజాపక్షం/కోదాడ: ప్రతిభ కలిగి పేదరికంలో ఉన్న నిరుపేద విద్యార్థులకు కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో సహకారం అందించి అండగా ఉంటున్నామని సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం వద్ద నిరుపేద కుటుంబాలకు సమాజంలో వెనుకబడిన వర్గాలకు కుల, మతాలకు అతీతంగా ప్రతిభ కలిగి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మి నారాయణ ధర్మపత్ని వీరేపల్లి సత్యావతి స్మారకార్థం మూడు లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేసి మాట్లాడారు. కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కులాలకు మతాలకు అతీతంగా సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలను ఆదుకునేందుకు తమవంతు సహయ సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో కూడా ఎంతోమందికి సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థికంగా సహకారం అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెదనాటి వెంకటేశ్వరరావు, వేమూరి సురేష్, రావెళ్ల సీతరామయ్య, వీరేపల్లి సుబ్బారావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, ముత్తవరపు పాండురంగారావు, రామారావు, గంటా సత్యనారాయణ, కొత్త బ్రహ్మయ్య, వీరేపల్లి నాగేశ్వరరావు, కొత్త రాంబాబు పాల్గొన్నారు.

## కోదాడ అభివృద్ధే ఉత్తమ్ దంపతుల ధ్యేయం




ప్రజాపక్షం/మునగాల: కోదాడ కేంద్రానికి జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయడం అభినందనీయమని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల కృషి ఫలితంగానే జవహర్ నవోదయ స్కూల్‌కి 50 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోప్రతిభ ఉండి వెనుకబడిపోతున్న నియోజకవర్గానికి జవహర్ నవోదయ స్కూల్‌ని మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోట ప్రవీణ్, జిల్లేపల్లి నాగి, జె.నరేష్, వినయ్ పాల్గొన్నారు.

## రుణాల పేరిట మోసగాళ్లతో అప్రమత్తం

ప్రజాపక్షం/ మానవపాడు: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు ప్రాముఖ్యమైన సమాచారం మన మానవపాడు మండల పోలీస్ అధికారి ఎస్సై చంద్రకాంత్ హెచ్చరికలు ఈ విధంగా జారిచేశారు. మీ గ్రామంలో లేదా మీరు ఉన్న చోట కేంద్ర ప్రభుత్వ పథకాలలో సబ్సిడీ లోన్లను ఆసరాగా చేసుకుని కొందరు మోసగాళ్ళు, నేరస్థులు ఎదో బ్యాంకు లోగో తో ఐడి కార్డులతో గ్రామాలలో సంచరిస్తూ ఎస్‌బిఐ బ్యాంక్ లో 10 లక్షల రూపాయలు లోన్ ఇప్పిస్తాం, 30 % వరకు సబ్సిడీ వస్తుంది అని ముందుగాల 10 వేల రూపాయలు కట్టండి 25 రోజుల్లో మీ అకౌంట్లలో 10 లక్షలు పడతాయి అంటూ బుజ్జగింపు మాటలు చెప్పి మీ యొక్క ఆధారాలు ఈ విధంగా సేకరిస్తుంటారు. మొదటగా మీ అధార్ కార్డులు, పాన్ కార్డు ఇవ్వాలని అలాగే మీ మొబైల్ నెంబర్ ఓటీపీ వస్తుంది, ఓటీపీ నెంబర్ చెప్పాలని అడుగుతుంటారు. ఇలాంటి వ్యక్తుల చెప్పే మాటలు ఎట్టి పరిస్థితిలో నమ్మకండి ఇలాంటి 10 లక్షల లోన్ల నిజమా కాదా అని తెలుసుకోవడానికి లోన్ల వివరాలకు మీ గ్రామంలో లేదా మీ మండలం లొ ఉన్న లేదా దగ్గర్లోని బ్యాంకుల ద్వారా సమాచారం తెలుసుకోండి. ఇతరులకు మీ వివరాలను, డబ్బులను ఇచ్చి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాం. ఎవరైనా ఇలాంటి ప్రచారం చేస్తూ మీ ఊర్లలో మీకు ఎదురుపడితే పోలీసుల ఫోన్ 8712670288 నంబర్ కి లేదా ఏదైనా మోసానికి గురి అయితే 1930 వెంటనే ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా కాల్ చెయ్యండి అంటున్నారు.

## సాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద...

# తెరుచుకున్న గేట్లు...



### 8 గేట్ల ద్వారా నీటి విడుదల

### ఇన్ ఫ్లో 65842 అవుట్ ఫ్లో 109952 క్యూసెక్కులు

ప్రజాపక్షం/నందికొండ: జులై 29న తెరుచుకున్న సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు రెండు వారాల విరామం తర్వాతప్రాజెక్టు గేట్లు రెండో సారి తెరుచుకున్నాయి. ఆగస్టు 3న రిజర్వాయర్ నీటిమట్టం 586.80 అడుగుల వ ద్ద మూసివేసిన గేట్లు శ్రీశైలం నుంచి వరద ప్రవాహం పెరగి నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్టమటన్ని దాటడంతో మళ్లీ తిరిగి ఆదివారం ఉదయం ప్రాజెక్టు అధికారులు గేట్లను తెరిచారు. మొదట ఉదయం 2 గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించిన అధికారులు ఆ తర్వాత మధ్యాహ్నం 4 గేట్ల ద్వారా, తర్వాత సాయంత్రం 8 గేట్ల ద్వారా 64800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద ప్రవాహాన్ని బట్టి ఇంకా ఎక్కువ గేట్లను తరిచే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు 590 అడుగులుగా ఉండి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 312.0450 టిఎంసీలుగా ఉన్నది. కుడి ఎడమ కాలువలో ద్వారా నేటి విడుదలను కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ కు ఇన్ ఫ్లో గా 65842 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉండగా 109952 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదల చేస్తున్నారు.

### సాగర్‌లో పర్యాటకుల సందడి...

ఆదివారం సాగర్ లో పర్యాటకుల సందడి నెలకొంది వరసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరెందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో విద్యార్థులుపర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు.నాగార్జునకొండకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని వ్యక్తపరిచారు.







## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరితహారం

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం అధ్యక్షుడు ఎన్ విటి సభ్యులతో కలిసి ఆపిల్ ఫ్రూట్ మొక్కను నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉన్నాయని, చెట్లు పెంచడం ద్వారా పర్యావరణానికి, ప్రజలకు, జంతువులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని ఆయన సూచించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం ఆవరణలో దాదాపు 100 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, పంతులాల్, వెంకన్న, భాస్కర్‌రెడ్డి, సురేష్, జగదీశ్వర్, జమీర్, సురేష్, చైతన్య, రమేష్, ఏడుకొండలు, లక్ష్మణ్, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

# దొడ్డ పద్మ ఆశయాలు సాధించాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు): మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య సతీమణి, తెలంగాణ సాయుధపోరాట యోధురాలు దొడ్డ పద్మ ఆశయాలను సాధించాలని సిపిఐ నాయకులు, ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం చిలుకూరులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు దొడ్డ పద్మ సంతాప సభలో మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా సేవలు అందించిన ఘనత దొడ్డ పద్మ అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో తన భర్త దొడ్డ నర్సయ్యతో కలిసి నల్లమల్ల అడవుల్లో మూడేళ్లపాటు అజ్ఞతవాసం చేసిన మహోన్నత వ్యక్తి పద్మ అన్నారు. సిపిఐ పార్టీ నాయకులు దొడ్డ పద్మను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఆమె మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటు అన్నారు. ఈ ప్రాంతంలో దొడ్డ పద్మ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం ముందు సిపిఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య విగ్రహంకు పూలమాలాలు వేసి నివాళులు అర్పించారు. అలాగే స్వాంతంత్ర్య సమరయోధులు దొడ్డ నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కోదాడ ప్రాంత ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో డాక్టర్ అందె సత్యం, సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు వక్కంతుల కోటేశ్వరరావు, సిపిఐ పార్టీ ఎపి రాష్ట్ర నాయకులు చలసాని రాఘవేంద్రరావు, చలసాని రామారావు, కాట్రగడ్డ స్వరూపరాణి, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి, సహయ కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాయిబెల్లి, జిల్లా, మండల నాయకులు మేకల శ్రీనివాసరావు, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, దేవరం మల్లేశ్వరి, చేపూరి కొండలు, చిలువేరు ఆంజనేయులు, సుల్తాని వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, సిరాపురపు బిక్షం, రాంబాబు, అనంతుల రాము, కస్తూరి సైదులు, కొండలు, లక్ష్యయ్య పాల్గొన్నారు.





## దక్షిణ భారత సాహిత్య సమ్మేళనానికి ఎన్‌జి కళాశాల అధ్యాపకుడు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్ ఈ నెల 8,9,10 తేదీలలో బెంగళూర్ లో జరిగిన బుక్ బ్రహ్మ దక్షిణ భారత సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సాహిత్య సమ్మేళనంలో తెలుగు సాహిత్యం తెలంగాణ ప్రత్యేకతలు అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొని తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ చర్చా కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు డాక్టర్ కె. శ్రీనివాస్, సాహిత్య చరిత్రకారులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, వాద రచయిత్రి డాక్టర్ షాజహానతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ కథ, నవల ప్రక్రియల్లోని ప్రత్యేకతలను గురించి శ్రీధర్ మాట్లాడుతూ భాష, సంస్కృతి, తెలంగాణ జీవితాన్ని ఇక్కడి కథకులు ఎంతో ప్రత్యేకంగా చిత్రించారని అన్నారు. ఆంధ్రా ప్రాంతంతో పోల్చినపుడు తెలంగాణలో అంత బలమైన మధ్యతరగతి లేకపోయినా పూర్తిగా ఏమి లేకుండా లేదని అయితే దాన్ని విమర్శకులు పట్టించుకోవాలసినంత పట్టించుకోలేదని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, దరణికోట శ్రీనివాసులు, నందగిరి వెంకటరావు లాంటివారి కథల్లో మధ్యతరగతి జీవితం అద్భుతంగా చిత్రించంబడిందని అన్నారు. పెద్దింటి అశోక్ కుమార్, బియస్ రాములు, కాలువ మల్లయ్య, బెజ్జరపు రవీందర్ లాంటి వాళ్ళు తరువాత కాలంలో మధ్యతరగతి జీవితాలను కథలుగా మలిచారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవి కుమార్, ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి బత్తిని నాగరాజు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ: నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. ఆదివారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసియు,సర్జికల్ వార్డు, మెడికల్ వార్డ్, రేడియాలజీ,తదితర విభాగాలను తనిఖీ చేసి డాక్టర్లు, నర్సులతో మాట్లాడి ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల పై ఆరా తీశారు. ఐసీయూ,రేడియాలజీ, తదితర విభాగాలలో ఎంత మంది పేషెంట్స్ ఉన్నారని ఐసిలో ఎన్ని బెడ్లు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ప్రధాన ఆస్పత్రికి వస్తున్న వారి వివరాలను సైతం జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.రేడియాలజీ విభాగం ద్వారా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రేడియాలజీ విభాగం దూరంగా ఉన్నందున నడవలేని పేషెంట్లకు మొబైల్ ఎక్స్ రే యూనిట్ ద్వారా ఎక్స్ రే తీయించడం జరుగుతుందని, నడవగలిగే వారిని వీల్ చైర్ మీద రేడియాలజీ కి తీసుకెళ్తున్నట్లు డాక్టర్లు తెలిపారు .అన్ని విభాగాలు పరిశీలించిన తర్వాత మందులు, వైద్య సేవలు, టెస్టులు, ఇతర పరీక్షల పై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో అవసరమైన అన్ని వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ప్రత్యేకించి నిరంతర వర్షాల వలన సీజనల్ వ్యాధులతో ఎక్కువమంది ఆసుపత్రికి వస్తున్నారని, వారందరికీ తగిన వైద్య చికిత్సలు అందించేలా డాక్టర్లు ,సిబ్బంది, నర్సులు అందుబాటులో ఉండాలని, మందులు ఇతర ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో సైతం ఎలాంటి నిర్లక్ష్యం,ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీకాంత్ వర్మ, అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ ఈశ్వర్ ,ఆర్ ఎం ఓ కిరణ్ కుమార్, టి ఎస్ ఎం ఐడిసి రాజశేఖర్, జితేందర్ ఉన్నారు.

## ఉపేంద్రాచారికి 'స్వరకిరిటీ' జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాపక్షం/ చివ్వెంల : సూర్యాపేట మున్సిపల్ బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న 5వ వార్డు దురాజుపల్లికి చెందిన గుండెపురి ఉపేంద్రాచారికి స్వరకిరిటీ జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూర్‌లోని మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సింగర్ ఫీస్ట్ 2025 లో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండవ ప్రతాప్ కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయనకు పూలమాలలు, శాలువాలతో పురస్కారాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను సహ ఉద్యోగులు, బంధువులు, మిత్రులు వేరు వేరు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు బొకెలు అందజేసి శాలువాలతో సత్కరించారు.





## గుంతలతో రోడ్డు బురదమయం

### ప్రజల నరకయాతన

### పట్టించుకోని అధికారులు..



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఇటీవల కురిసిన వర్షానికి నల్లగొండ మండలం నర్సింగ్ బట్ల గ్రామం నుండి ముత్యాలమ్మ గూడెం వెళ్లే రహదారి బురదమయమై, గుంతలతో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు . వర్షం పడకపోయినా కూడా ఇంతకుముందు కురిసిన వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల పాదచారులు, వాహనా దారులు అనేక అవస్థలు పడుతున్నారు. నిత్యం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు, రైతులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ప్రయాణించాలంటే ప్రాణాలు నా అరచేతులో పెట్టుకొని వెళ్ళవలసిస్తుందని ఎక్కడ గుంటలు ఉన్నాయో ఎక్కడ పడిపోతామన్న భయంతో వణికి పోతున్నామని ఆ గ్రామాల ప్రజలు బిక్కు బిక్కు మంటున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. తక్షణమే రహదారి మరమ్మత్తులు చేపట్టాలని నర్సింగ్ బట్ల, ముత్యాలమ్మ గూడెం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నల్లగొండ బస్టాండ్‌లో 'జనసంద్రం'

### సరిపడా బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు..

### పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు..



ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు వారి వారి ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సులలో పెద్ద ఎత్తున ప్రయాణం చేశారు. తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆదివారం నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్ మహిళలతో కిక్కిరిసిపోయింది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతానికి వెళ్లేవారు సమయానికి చేరుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఒక వైపు వర్షం కురుస్తుండడంతో మరోవైపు బస్సుల కొరత ఏర్పడి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు ,అసహనం వ్యక్త పరిచారు. బస్సుల కోసం టికెట్ కౌంటర్ వద్ద కుస్తీలు పడుతూ బారులు తీరారు. ఒక్కసారిగా వందలాది ప్రయాణికులు టికెట్ కోసం లైన్ కట్టారు. కౌంటర్ లో మాత్రం ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండడం గమనార్హం.నిమ్మకు నీరెత్తినట్లుగా ఆర్టీసీ వ్యవహరిస్తుందని ప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రికార్డు స్థాయిలో రూ.42.64 లక్షల ఆదాయం**

ఉద్యోగులందరికీ మన డిపోకి రాఖీ పౌర్ణమి సందర్భంగా గతంలో ఎన్నడూ లేని విధంగా టిజిఎస్‌ఆర్‌టిసి నల్లగొండ డిపో రికార్డ్ స్థాయిలో 132 ఓఆర్ తో అత్యధిక కంగా 53 వేల పైగా కిలోమీటర్లు ఆపరేట్ చేసి, రికార్డ్ స్థాయిలో 42,64,320 లక్షల రూపాయల ఆదాయాన్ని తెచ్చి రీజియన్‌లోనే అత్యధిక ఈపికె 48.48 ఓఆర్ 80 తెచ్చి మొదటి స్థానంలో నిలిపింది.

# క్రీడ

## వార్నర్ 16 ఏళ్ల రికార్డు బ్రేక్!

### టీ20లో టిమ్ డేవిడ్ అత్యధిక సిక్సర్లు..



పొట్టి క్రికెట్‌లో సంచలనం నమోదైంది. టిమ్ డేవిడ్ మరో రికార్డు బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియా తరఫున పొట్టి ఫార్మాట్‌లో వేగవంతమైన సెంచరీ రికార్డు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు ఈసారి డేవిడ్ వార్నర్‌ను అధిగమించాడు. 16 ఏళ్లుగా డేవిడ్ భాయ్ పేరిట ఉన్న అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టాడు డేవిడ్ ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో ఈ యంగ్‌స్టర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. మూడు టీ20ల సిరీస్ ఆరంభ పోరులో టిమ్ డేవిడ్ తన ఉగ్రరూపం చూపించాడు. డార్విన్‌లోని మర్రార క్రికెట్ మైదానంలో కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవడమే కాదు రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. 7.4 ఓవర్లకే ఆరు వికెట్లు పడిన వేళ సఫారీ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 52 బంతుల్లోనే 83 రన్స్ బాదాడు డేవిడ్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోర్ బోర్డును ఉరికించిన ఈ యంగ్‌స్టర్ ఏకంగా ఎనిమిది సిక్సర్లు కొట్టాడు. దాంతో, ఆసీస్ పోరాడగలిగే స్కోర్ చేయగా.. ప్రొటీస్ జట్టుపై 2009లో ఆరు సిక్సర్లతో వార్నర్ నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది. డేవిడ్ హస్సీ, మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్‌లు సైతం ఆరేసి సిక్సర్లతో వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. హస్సీ 2009లో మెల్‌బోర్న్ మైదానంలో .. 2023లో డర్బన్‌లో జరిగిన టీ20లో మార్ష్ ఈ ఘనత సాధించగా.. రెండు రోజుల్లోనే హెడ్ ఆరు సిక్సర్లతో 91 రన్స్‌తో రికార్డు సమం చేశాడు.

**37 బంతుల్లోనే..** ఐపీఎల్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించిన టిమ్ డేవిడ్ జూలై 26న టీ20ల్లో తొలి శతకంతో గర్జించాడు. వెస్టిండీస్ బౌలర్లను ఊచకోత కోసిన ఈ చిచ్చరపిడుగు ఆసీస్ తరఫున వేగవంతమైన సెంచరీ బాదేశాడు. మూడో టీ20లో కరీబియన్లు నిర్దేశించిన భారీ ఛేదనలో డేవిడ్ కేవలం 37 బంతుల్లోనే ఈ మూడంకెల స్కోర్‌ను చేరుకున్నాడు. డేవిడ్ విధ్వంసంతో 2023లో స్కాట్లాండ్‌పై 43 బంతుల్లో జోష్ ఇంగ్లిస్ నెలకొల్పిన వేగవంతమైన శతకం రికార్డు బద్దలైంది.

## ఐదు రోజుల్లో డైమండ్ లీగ్

### నీరజ్, నదీమ్ పోరు లేనట్టేనా!



పారిస్ ఒలింపిక్స్ తర్వాత భారత బడిసె వీరుడు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ ఎదురుపడింది లేదు. త్వరలోనే సెలెసియా డైమండ్ లీగ్‌లో దాయాది అథ్లెట్లు 'నువ్వానేనా' అన్నట్టు జావెలిన్‌ను విసురుతారని అభిమానులు అనుకున్నారు. కానీ, నిర్వాహకులు ప్రకటించిన తొలి జాబితాలో ఇద్దరి పేర్లు లేకపోవడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. ఆగస్టు 16న సెలిసియా డైమండ్ లీగ్ మొదలవ్వనుంది. టోర్నీకి మరో ఐదు రోజులే ఉండడంతో ఆదివారం నిర్వాహకులు అథ్లెట్ల జాబితాను వెల్లడించారు. అందులో నీరజ్, అర్షద్‌ల పేర్లు మాత్రం లేవు. జులియన్ వెబర్, జులియస్ ఎగో, అండర్సన్ పీటర్స్ వంటి స్టార్లు బరిలో ఉన్నట్టు ఆర్గనైజర్స్ తెలిపారు. అయితే.. జూలైలోనే ఈ లీగ్ షెడ్యూల్ వచ్చింది. దాంతో.. యూరప్‌లో జరుగబోయే ఈ టోర్నీలో నీరజ్, నదీమ్ మధ్య హోరాహోరీ బడిసె ఫైట్ ఉంటుందని భావించారంతా. కానీ, అధికారిక జాబితాలో చోప్రా పేరు లేకపోవడంతో అతడు ఈ టోర్నీలో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. పాక్ అథ్లెట్ నదీమ్ ఈమధ్య లండన్‌లో కాలి కండరాలకు సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం కోలుకుంటున్న అతడు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మీద దృష్టిసారించాడని అతడి కోచ్ సల్మాన్ భట్ వెల్లడించాడు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా 'నీరజ్ చోప్రా క్లాసిక్'లో నదీమ్ పోటీపడలేదు. ఆ తర్వాత 90 మీటర్ల మార్క్ అందుకొని చోప్రా విజేతగా నిలిచిన జరిగిన 'దోహా డైమండ్ లీగ్'లోనూ నదీమ్ పాల్గొనలేదు.

**తలపడేది వీళ్లే..** జులియన్ వెబర్ (జర్మనీ), జులియస్ ఎగో(కెన్యా), రాడెక్ జెన్నీ డీన్ (జపాన్), ఆండ్రియాన్ మర్డరే(మాల్డోవా), సిప్రియన్ మిర్జిగ్లోడ్ (పోలాండ్), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), కెశోర్న్ వాల్కాట్(ట్రినిడాడ్‌టొబాగో).

## డకెట్ సవాల్‌ను స్వీకరించా..

### అందుకే అలా వీడ్కోలు పలికా: ఆకాశ్




అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ప్రవర్తనపై దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను ఔట్ చేసిన తర్వాత.. అతడి భుజంపై చేయి వేసి మాట్లాడినందుకు భారత పేసర్‌పై నిషేధం విధించాలని డకెట్ కోచ్ డిమాండ్ చేస్తున్నాడు. ఈ ప్రవర్తన వివాదాస్పదం కావడంపై ఆదివారం ఆకాశ్ దీప్ స్పందించాడు. ఓవల్ టెస్టులో డకెట్ సవాల్ విసరడం వల్లనే తాను అలా వీడ్కోలు పలకానని.. అంతే తప్ప అందులో వేరే ఉద్దేశమేది లేదని ఆకాశ్ తెలిపాడు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించిన ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ఓవర్లో డకెట్ బౌండరీలతో చెలరేగాడు. బజ్‌బాల్ ఆటతో చెలరేగుతూ స్కోర్ బోర్డును ఉరికించాడు. 'నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని అనడంతో ఆకాశ్ అవునా.. 'ఔట్ చేసి తీరుతాను' అనుకున్నాడు. హాఫ్ సెంచరీతో విరుచుకుపడిన అతడిని ఔట్ చేసి ఇంగ్లాండ్‌కు షాకిచ్చాడు భారత పేసర్. 'నాకు డకెట్‌పై మంచి రికార్డు ఉంది. అతడిని పలుమార్లు ఔట్ చేశాను. లీడ్స్ హెడింగ్లీలో వెనక్కి పంపడం అంటే నాకిష్టం. డకెట్ ఏమీ ప్రత్యేకం కాదు. కానీ, ఆ రోజు మాత్రం అతడు నా లైన్ అండ్ లెంగ్త్‌ను దెబ్బతీశాడు. సహజమైన షాట్లకు బదులు రివర్స్ స్వీప్, స్వీప్ షాట్లతో నాపై పైచేయి సాధించాడు. అంతే కాదు 'ఈ రోజు నాది. నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని నాతో అన్నాడు. అతడి మాటలు విన్నాక నాలో మరింత కసి పెరిగింది. అలానా అయితే చూద్దాం అనుకున్నా. 'నువ్వు మిస్ అయితే నేను వికెట్లు పడగొడతా' అని డకెట్‌తో చెప్పాను. అలా చెప్పినట్లే.. అతడి వికెట్ తీశాను. ఇంగ్లిష్ ఓపెనర్ నిరాశగా పెవిలియన్ వెళ్తుంటే అతడి భుజంపై చేయి వేసి.. ప్రతిసారి నువ్వు విజయం సాధించలేవు. ఈసారి నేను గెలిచాను అని సరదాగా అన్నాను. నా మాటల్ని డకెట్ కూడా స్పోర్టివ్‌గానే తీసుకున్నాడు' అని తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను ఆకాశ్ వెల్లడించాడు.

# ఆరోగ్యం

## ఫోకస్

## జునోటిక్ వ్యాధులకు కారణాలెన్నో




ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేటిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్తపడాలి.
- పచ్చి పాలు తాగడం మానేయాలి.
- ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి.
- వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి.
- చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి.
- జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి.
- అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు.
- పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.
- వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి.
- జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి.
- త్రాగే నీటిని మరిగించి వాడాలి.
- గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం. జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం.

## హెచ్‌టిఎల్‌వి1ని ఎదుర్కోవడానికి హెచ్ఐవి యాంటీవైరల్స్!

అత్యంత ప్రమాదకరమైన హ్యూమన్ టిలింఫోట్రోపిక్ వైరస్ టైప్ 1 (హెచ్‌టిఎల్‌వి1)ను ఎదుర్కోవడానికి హెచ్ఐవి యాంటీవైరల్స్‌ను ఉపయోగించే అవకాశాన్ని పరిశోధకులు అన్వేషిస్తున్నారు.. ఇటీవలి అధ్యయనంలో కొన్ని హెచ్ఐవి మందులు ఎలుకలలో వైరస్‌ను సమర్థవంతంగా అణచివేయగలవని, భవిష్యత్తులో నివారణకు సంభావ్య మార్గాన్ని కూడా అందించే అవకాశాలు లేకపోలేదని పరిశోధకులు ధీమా వ్యక్తం చేస్తున్నా. హెచ్ఐవి లాంటి రెట్రోవైరస్ అయిన హెచ్‌టిఎల్‌వి1కి ప్రస్తుతానికి చికిత్సగానీ, నివారణగానీ లేదు.




ఈ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్నది. అలాంటి పరిస్థితుల్లో హెచ్‌టిఎల్‌వి1ను సమర్థంగా ఎదుర్కొనే అవకాశాలు హెచ్ఐవి యాంటీవైరల్ మందుల్లో ఉందన్న వార్త కోట్లాది మందికి ఊరటనిస్తున్న అంశం. వాణిజ్యపరంగా లభించే రెండు హెచ్ఐవి యాంటీవైరల్స్, టెనోఫోవిర్, డోలుటెగ్రావిర్ తదితరాలతో ఎలుకలపై చేసిన ప్రయోగంలో, అవి హెచ్‌టిఎల్‌వి1 వ్యాప్తిని అణచివేయగలవని పరిశోధకులు కనుగొన్నారు. ఈ హెచ్ఐవి ఔషధాలను కణ మరణాన్ని ప్రేరేపించే సమ్మేళనం (ఎంసిఎల్1 నిరోధం)తో కలిపినప్పుడు, అవి హెచ్‌టిఎల్‌వి1 సోకిన కణాలను హతమార్చగలవని ఈ అధ్యయనం నిరూపించింది. ఎంసిఎల్1 నిరోధంతో యాంటీవైరల్ థెరపీని కలపడం ద్వారా హెచ్‌టిఎల్‌వి1 కోసం సంభావ్య నివారణ వ్యూహాన్ని ఈ పరిశోధన సూచిస్తుంది. పైన పేర్కొన్న హెచ్ఐవి మందులు ఇప్పటికే ఆమోదం పొందాయి. లక్షలాది మంది రోగులు వీటిని ఉపయోగిస్తున్నారు. కాబట్టి, పరిశోధనా బృందం వారి పరిశోధనలు మానవ క్లినికల్ ట్రయల్స్‌లోకి వేగంగా మారగలవని విశ్వసిస్తుంది. హెచ్ఐవి ప్రోటీజ్‌ని పోలి ఉండే హెచ్‌టిఎల్‌వి1 ప్రోటీజ్‌ని నిరోధించడం ఒక ఆచరణీయ యాంటీవైరల్ లక్ష్యంగా ఉంటుందని పరిశోధన గుర్తించింది. ఇది హెచ్‌టిఎల్‌వి1 ప్రోటీజ్‌కి వ్యతిరేకంగా మెరుగైన శక్తిని చూపించిన సీసం సమ్మేళనం, పియు6 అభివృద్ధికి దారి తీసింది. హెచ్‌టిఎల్‌వి1 అనేది హెచ్ఐవి తో పోలిస్తే కొంతవరకు ఎవరూ పట్టించుకోని రెట్రోవైరస్. కానీ ఇది ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 మిలియన్ల మందిని వేధిస్తున్నదని అంచనా. ఇలా నిర్లక్ష్యం చేసిన వ్యాధిని చివరకు పరిష్కరించడానికి ఈ పరిశోధన ఒక ఆశాజనకమైన మార్గాన్ని అందిస్తున్నది. కొత్త ప్రయోగం మానవులపై కూడా సరైన ఫలితాలనిస్తే, హెచ్‌టిఎల్‌వి1 కూడా నివారించతగినదే అని రుజువవుతుంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ఇఎస్ఐ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలి

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల రూరల్ :** మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు కల్పించడంతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు ఇఎస్ఐ కార్డుల్లో నమోదు చేయాలని సదర్ కాంట్రాక్టర్ కృష్ణ కన్స్ట్రక్షన్‌ను కోరుతున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తెలిపారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదం లేదా అనారోగ్యం వచ్చినప్పుడు కార్మికుల కుటుంబ సభ్యులు కూడా కార్పొరేట్ వైద్యం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, రాయమల్లు, సువర్ణ, భాగ్యలక్ష్మి , సుమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు

### ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కార్యదర్శి రఘురాం మాట్లాడారు. ఎఐఎస్ఎఫ్ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో జిల్లాలో బెనారస్ యూనివర్సిటీలో ఆవిర్భవించి బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఈ దేశం నుండి తరిమికొట్టడంలో కీలకపాత్ర పోషించిన సంఘం ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అన్నారు. విద్యారంగ సమస్యలపై ఎనలేని పోరాటాలు చేస్తూ విద్యార్థుల పక్షాన నిలబడిన ఏకైక సంఘం ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అన్నారు. 90 సంవత్సరాల వార్షికోత్సవాలు 12 నుండి 30 వరకు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంజయ్, కుశాల్, నవీన్, కృష్ణ, సుభోద్, అబ్దుల్ రహమాన్, కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




**నిర్మల్ రూరల్ :** విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడిందని తెలిపారు. ఈ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కైలాష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవి కాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు అప్లామ్ కూడా పాల్గొన్నారు.

# ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి విఘాతం

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఓటర్ల జాబితా నుంచి ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ మండల సమితి సమావేశం అలవాల రాజు అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా భిక్షపతి హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగించడం మరియు కొత్త ఓటర్లను సృష్టించడం రాజ్యాంగ వ్యతిరేకమని, ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమన్నారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల20 నుంచి 22వరకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరగనున్నాయని, ఈమహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, మండల కార్యదర్శి ఎన్ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శులు దామెర సుదర్శన్, గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాంగోపాల్ చారి, కట్కూరి కృష్ణ, పూజారి అమృతయ్య, రోంటాల రమేష్ దేవా, కోడెపాక బాబు, పొక్కుల సదానందం,దేవరకొండ రమేష్, జూకంటి పద్మ, మలోతు మంగ, పొన్నాల హరిక్రిష్ణ పాల్గొన్నారు.



మంచిర్యాల...

### డూప్లికేట్ ఓట్ల దొంగ బిజెపి

**మంచిర్యాల :** డూప్లికేట్ ఓట్ల దొంగ బిజెపి అని బహిర్గతమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. మేడ్చల్‌లో ఈనెల 20 నుంచి 22 వరకు జరగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పలుమార్లు అధికారంలోకి రావడానికి ఈ దొంగ ఓట్లు సృష్టించిందని, కేంద్ర ఎన్నికల కమీషన్ కనుసన్నల్లోనే ఈ రాజకీయ మాయాజాలం సాగిందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, మిరాయల రాజేశ్వర్ రావు, కొట్టే కిషన్ రావు, దుర్గా రాజు, దేవీ పోచన్న, మొగిలి లక్ష్మణ్, సాంబయ్య, మామిడి గోపి, ఎగుడ మొండి, బాకం శంకర్, ఆంజనేయులు, దినేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

**వరంగల్ :** పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల రవి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని గొర్రె కుంటలో మేడ్చల్‌లో సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ మహాసభలలో భవిష్యత్ పోరాటాలను పేద ప్రజలకు అండగా సిపిఐ పోరాటాలు కొనసాగిస్తాదన్నారు. జిల్లా వ్యాప్తంగా నిలువ నీడలేని ప్రజలు వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, కాకతీయ టెక్స్టైల్ పార్క్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ గీసుకొండ మండల కార్యదర్శి చంద్రకళ, సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి గుండె భద్రి, జిల్లా సమితి సభ్యులు ఎండి అక్బర్ పాషా, గీసుకొండ మండల సహాయ కార్యదర్శులు పాషా, స్వేత, బాణాల మహేష్, చిలువేరు రాజేష్, ఉషశ్రీ, బిక్షపతి, రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** ఆగస్టు 20,21, తేదీలలో జరుగు సిపిఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీర్ల ప్రకాశ్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ సలాలుద్దీన్ కోరారు. సంగారెడ్డిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రహమాన్ తాజుద్దీన్, షఫి ఆనంద్, నర్సింలు, మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ...



వరంగల్...



సంగారెడ్డి...

## ప్రైవేటు విద్యావ్యవస్థను జాతీయం చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ్మా



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రైవేటు విద్యా వ్యవస్థను రద్దు చేసి ప్రైవేటు విద్యను జాతీయం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ్మా డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ 90వ వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకుని ఎఐఎస్ఎఫ్ ఉద్యమ యాదిలో గాయని రచయిత శ్యామల రూపొందించిన ఆడియో, వీడియో ఆల్బమ్ ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్‌లో బాలనర్సింహ్మా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలనర్సింహ్మా మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని, విద్యా వ్యాపార పనిలో పేదలకు విద్య అందని ద్రాక్షల మారిందన్నారు. శాస్త్రీయ విద్యా విధానంతోనే అంద మూఢవిశ్వాసాలు తొలుగుతాయన్నారు. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, ఆనాటి నుండి నేటి వరకు దేశ సమగ్రతకు, విద్యారంగ పెను సవాళ్లపై, విద్యార్థుల హక్కుల సాధనకు నిర్విరామంగా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి, ఉద్దంసింగ్ లాంటి ఎందరో అమరవీరుల విప్లవ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని దేశం కోసం అనేకమంది విద్యార్థి నేతలను బలిదానం చేసిన గొప్ప త్యాగాల చరిత్ర ఎఐఎస్ఎఫ్ దన్నారు. గాయని శ్యామల రూపొందించిన ఆల్బమ్ విద్యార్థులలో చైతన్యం రగిలించే దిశగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి పి.సురేష్, నాయకులు శేఖర్, వనపర్తి రమేష్, వంశి, రాంసింగ్, ఆర్ఎన్.కుమార్, శివ, అరుణ్ పాల్గొన్నారు.

## కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి

### సీతారామయ్య డిమాండ్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొరిమి రాజకుమార్ డిమాండ్ చేశారు, ఆదివారం పట్టణంలోని శేషగిరిభవన్‌లో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎండి, డైరెక్టర్ల స్ట్రక్చర్ సమావేశంలో ఒప్పుకున్న కార్మికుల సమస్యలపై సర్కులర్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్నారు. 200 గజాల స్థలంతో పాటు నివాసగృహం నిర్మించుకొనుటకు 30 లక్షల రూపాయలు వడ్డీలేని రుణం సింగరేణి కార్మికులకు అందజేయాలని కోరారు. గడిచిన వార్షిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన లాభాలు వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటాలు 35 వెంటనే చెల్లించాలని కోరారు. క్లారికల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ పోస్టులపై కోర్టుకు వెళ్లిన వారిని మినహాయించి మిగతా పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీకి ఆలోచన చేయాలని కోరారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ



**ప్రజాపక్షం/దుండిగల్** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో రాఖీ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ, మాజీ కౌన్సిలర్ నర్సింగం భరత్ కుమార్ కు రాఖీ కట్టిన దుండిగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుంకరి కృష్ణ వేణి కృష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల నడుమ అనురాగ బంధానికి ప్రత్యేకగా నిలిచి ఈ రాఖీ పండుగ సందర్భంగా మహిళలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహాసభల గోడ పత్రికల విడుదల



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఈ నెల జరుగనున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలకు సంబంధించి గోడ పత్రికలను మేడ్చల్ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మహాసభల గౌరవాధ్యక్షుడు డి.జి.సాయిల్ గౌడ్, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు కె.రవిచంద్రన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, కర్షక, హక్కులకోసం నిరంతరం పోరాటం చేసే సిపిఐపార్టీకి ప్రజలు ఎప్పటిలాగే ఆదరించాలని కోరారు. ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా పార్టీ అన్నివేళలా ముందుంటుందన్నారు. పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి నారెడ్డి శశిధరరెడ్డి, ఆల్వాల్ మండల కార్యదర్శి ఏ.బాబు, శామీర్‌పేట మండల కార్యదర్శి డి.జి, నరేందర్ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అందుబాటులో నాణ్యమైన వస్త్రాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పోటీ ప్రపంచంలో నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో వినియోగదారులకు అందిస్తేనే రాణించగలుగుతారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8 ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాంచీపురం కామాక్షి వెడ్డింగ్ సిల్క్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యజమాని ఆనంద్, ఆగిరెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ శ్రేణులు అరుణ్, మురళి, గణేష్, రాజు, రమేష్ నాయక్, ప్రశాంత్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధనలక్ష్మి విద్యా సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/కాప్రా:** నిస్వార్థంగా సేవా నిరతితో గత నాలుగున్నరేళ్ల కాలంగా తన విద్యా సంస్థ ద్వారా అందిస్తున్న మంగాపురంలోని హోలీమేరి కోఎడ్యుకేషన్ హైస్కూల్ వ్యవస్థాపకులు ఎన్.ధనలక్ష్మి సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, గుండారపు శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన శాలువాతో సన్మానించారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

అనంతనగర్ కాలనీవాసుల మొర

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్‌లోని అనంతనగర్ కాలనీలో పట్టించుకోకుండా పోయిన డ్రైనేజి సమస్యను ఇకనైనా పరిష్కరించాలంటూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ప్రమోద్‌కుమార్, నరేష్, యాదగిరి, జయప్రకాష్, వినయ్‌కుమార్, దేవేందర్, యూనస్, ఆకాష్, సుకేష్, నవీన్‌లు ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి సమస్యలను వివరించారు. తమ కాలనీలో చాలా రోజుల నుండి డ్రైనేజి పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని, దీని వల్ల ఈ మార్గంలో వెళ్లాలంటేనే నానా ఇబ్బందిగా ఉందని తెలిపారు.

## మరో మార్గం లేదు... ఆక్రమించాల్సిందే

గాజాపై నిర్ణయాన్ని సమర్థించుకున్న నెతన్యాహూ

**జెరూసలెం:** మరో మార్గంలేదు, గాజాను ఆక్రమించాల్సిందే అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ అన్నారు. ఆదివారం రాత్రి పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, జెరూసలెంలో రెండు రోజులక్రితం జరిగిన సెక్యూరిటీ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. గాజా విషయంపై ఐక్యరాజ్యసమితి ఒకవైపు న్యూయార్క్‌లో అత్యవసర సమావేశం నిర్వహిస్తుండగా సమితి పూర్తి ప్రకటన వెలువడకముందే నెతన్యాహూ ఈ పునరుద్ఘాటన చేశారు. గాజాలో ఆకలి చావులు హమాస్ ఉగ్రవాద సంస్థ కల్పితసృష్టి నని ఆయన కొట్టిపారేశారు. మరోవైపు ఆదివారంనాడు గాజాలో పోషకాహారంలేక ఆకలితో మరో 11 మంది పిల్లలు మరణించడంతో ఇప్పటివరకూ ఆకలి చావులసంఖ్య 217కు పెరిగింది. వీరిలో 98 మంది పిల్లలు ఉన్నారు. ‘‘యుద్ధాన్ని ముగించడానికి, గాజాలో హమాస్ వద్ద ఉండిపోయిన బందీలను విడిపించి తీసుకురావాలంటే ఇదే అత్యుత్తమమైన మార్గం’’ అన్నారు. ఎంతో ఆశావాద దృక్పథ భావోద్వేగంతో కనిపించిన నెతన్యాహూ, గాజా ఆక్రమణ సైనిక చర్యను ఎప్పుడు ప్రారంభిస్తామో తెలియదన్నారు. దానికి ఒక గడువుతేదీ అంటూ లేదన్నారు. ఇదెంతో అపాయంతో కూడుకున్న పని అనీ, అత్యంత ప్రమాదకరమైన విషయమని, అంతర్జాతీయ చట్టాలన్నింటినీ ఉల్లంఘించినట్లే అవుతుందని యూరోపియన్ దేశాలన్నీ హెచ్చరిక చేస్తున్నాయి. గాజాలో ఏం జరుగుతోందో స్థానిక జర్నలిస్టులద్వారానో, ఆసుపత్రి వైద్యుల ద్వారానో తెలుసుకోవడం మినహా అంతర్జాతీయ మీడియా సంస్థలను గాజాలోకి ఇజ్రాయెల్ అనుమతించడంలేదు. దీంతో అక్కడి వాస్తవము ఖచిత్రం వార్తల్లో వస్తున్నదానికంటే చాలా దుర్భరంగా ఉండి ఉంటుందని అందరూ అంచనావేస్తున్నారు. చివరకు ట్రంప్ కూడా గాజాలో బక్కచిక్కిపోయి, ఎముకలగూళ్ళు బయటకు కనిపించే పిల్లల చిత్రాలు చూసి చలించిపోయారు. గాజా ఆక్రమణ చేయాలా? వద్దా? అనే విషయం నెతన్యాహూకే వదిలిపెట్టినట్లు ట్రంప్ లౌక్యంగా మాట్లాడినప్పటికీ, గాజాలో అమెరికా–ఇజ్రాయెల్ లక్ష్యసాధన ఒకటేనని కొద్ది గంటలక్రితమే అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ బ్రిటన్ పర్యటన సందర్భంగా ప్రకటించారు.

**గాజాలో ఘోర పరిస్థితి : ఐరాసలో చైనా దౌత్యవేత్త**

గాజాలో అత్యంత ఘోరమైన, ప్రమాదకర పరిస్థితులు నెలకుని ఉన్నాయని ఐక్యరాజ్యసమితిలో చైనా దౌత్యవేత్త ఫూ కాంగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులు మార్పులేకుండా మితిమీరుతున్నాయన్నారు. గాజాను ఆక్రమించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చాలా గట్టిగా ప్రతిఘటించాలని అన్నారు. గాజాను సైనికంగా ఆక్రమించడం ఈ సమస్యకు పరిష్కారం కాదని ఆయన అన్నారు. గాజాలో ప్రజలను సామూహికంగా శిక్షించి ఆకలి చావులకు గురిచేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదనీ, గాజాలోకి ఆహారం సరఫరా చేసేందుకు ఉన్న అన్ని మార్గాలనూ తెరచి ప్రజలకు పుష్కలంగా ఆహారం, ఇతర సహాయం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# బస్‌ఫుల్.. నో స్టాప్

ప్రయాణికులను దోచుకుంటున్న ఆర్‌టిసి

ఆర్‌డినరి కాదు.. ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూళ్లు





**ప్రజాపక్షం / కొడంగల్ :** ఆర్‌టిసి నిబంధనల ప్రకారం ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్స్‌ప్రెస్‌లాగా.. ఆర్డినరి బస్సులు ఆర్డినరీ లాగా నడవాలి కాని ఇక్కడ మాత్రం ఎక్స్‌ప్రెస్‌లు సూపర్ లగ్జరీలు అవుతున్నాయి.. ఆర్డినరీ బస్సులు ఎక్స్‌ప్రెస్ అవుతు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే కొడంగల్ ఆర్టీసి బస్టాండ్ నుంచి నిత్యం వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే రేవంత్‌రెడ్డి గతంలో కోస్గి పట్టణంలో ఆర్‌టిసి బస్ డిపో కొరకు 5 ఎకరాల సొంత భూమిని ఆర్‌టిసికి అందించి డిపో ఏర్పాటుకు కృషి చేయడం జరిగింది. కోస్గి ఆర్‌టిసి డిపోకు నారాయణపేట నుంచి కాలం చెల్లిన కొన్ని డొక్కు ఆర్డినరి బస్సులను అందించి వాటితో కాలం వెళదీస్తున్నారు. ఒకటి లేదా రెండు బస్సులు ఎక్స్‌ప్రెస్ కోస్గి నుంచి కొడంగల్ మీదుగా హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇందిరమ్మ పేరుతో ఆడబిడ్డలకు చేయుత పథకంలో భాగంగా ఆర్‌టిసి బస్సులు రావడంతో ఇక్కడి డిపో అధికారులు మాత్రం ఆర్డినరి బస్సులను ఎక్స్‌ప్రెస్‌గా బోర్డులు మార్చి ప్రయాణికులకు నష్టం వాటిల్లే విధంగా తమ ఆగడాలు సాగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కోస్గి నుంచి కొడంగల్‌కు వెళ్లలంటే మధ్యలో ఎక్కడ ఆగదు అంటు అధికారులు ప్రయాణికులపై హుకూం జారీ చేస్తున్నారు. మరోపక్క ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ అప్‌డేట్ చేయలేదు అందుకు టికెట్ తీసుకోవాల్సిందే అంటు టికెట్‌లు ఇస్తున్నారు. దీనిపై సదరు కండక్టర్‌లను నిలదీస్తే మా ఇష్టం టికెట్ బరా బర్ ఇస్తాం.. ఎవ్వరికీ చెప్పుకుంటారో చెప్పుకోండి.. ఎక్కడ బడితే అక్కడ బస్సులు ఆగడానికి మీ ఇంటి బస్సులా ఏమైనా అని ఆర్‌టిసి సిబ్బంది ప్రయాణికులతో వాగ్వివాదాలకు దిగుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. కోస్గి ఆర్‌టిసి డిపోలో మొత్తం 18 బస్సులు నడుస్తుండగా అందులో ఆర్డినరి బస్సులు 16, ఎక్స్‌ప్రెస్ బస్సులు 2 మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. కాని నారాయణపేట డిపో అధికారుల ఇష్టారాజ్యమో, లేక ఆర్‌టిసి అధికారుల ఆదేశాల మేరకు సాగుతున్నాయో కాని ఆర్డినరి బస్సులే కాని ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించుకుని ఏకంగా నాన్‌స్టాప్ అంటు కోస్గి, కొడంగల్, పరిగి, మన్నెగూడ, చేవెళ్ల, మొయినాబాద్, లంగర్‌హౌస్, మెహిదిపట్నం హైదరాబాద్ మాత్రమే మధ్యలో ఎక్కడ ఆగదు అంటు ప్రయాణికులకు ముందే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీనిపై సంబందిత నారాయణపేట డిపో మెనెజర్‌కు ఫోన్ చేసి వివరణ అడిగేందుకు ప్రయత్నం చేయగా వారు స్పందించకపోవడం విడ్డురంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌కు ఆర్‌టిసి అధికారులు పలు రకాల సర్వీస్‌లను కొనసాగించాలి. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉన్న ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌లను తగ్గించి ఆర్డినరి బస్సులనే ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ప్రయాణికులను భారీగా మోసం చేస్తున్నారనడంలో అతిశయోత్తి లేదు. కొడంగల్ బస్టాండ్ నుంచి నిత్యం దాదాపు ఆర్డినరి బస్సులు హైదరాబాద్‌కు 10 బస్సుల మేరకు ఆర్డినరిలే కాని ఎక్స్‌ప్రెస్ పేరుతో రవాణా సాగుతున్న అధికారులలో ఎలాంటి చలనం లేక పోలేదు. దీనిపై తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు





- నాలుగేళ్లుగా పూర్తికాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, అన్ని మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి
- తాగునీటికీ తప్పని అవస్థలు పట్టించుకోని వ్యవసాయ మార్కెట్ అధికారులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలోని మున్సిపాటీల్లో ఉన్న రైతు బజార్లలో సమస్యలు తీష్టవేశాయి. కనీసం తాగడానికి మంచినీటి సౌకర్యం లేక , ఇతర వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే అన్నదాతలు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. సంతలు మార్కెట్లు మరీ అధ్వానంగా మారాయి. అయా గ్రామాల నుంచి తెల్లవారు జామునే అన్నదతలు పంట ఉత్పత్తులతో మార్కెట్లోకు చేరుకుంటారు. రైతులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు తప్పడం లేదు, జిల్లా కేంద్రంలో ఉన్న కూరగాయల మార్కెట్ రైతు బజార్‌లలో తాగునీరు, ముత్రశాలలు , మరుగుదోడ్లు లేక ఇక్కట్ల పాలవుతున్నారు. పరిగి, తాండూర్ కొండగల్‌లోను అదేపరిస్థితి ఉంది. పేరుకే రైతు బజార్లు అక్కడ షెడ్లు కూడా లేవని అన్నదతులు అంటున్నారు. రోజంత ఎండలోనే కూరగాయాలు విక్రయించాల్సి వస్తోంది అని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఒక్కో మున్సిపాలిటీలో రూ.3కోట్ల నుంచి రూ.6కోట్లు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలని భావించింది. కొండగల్ ,పరిగి మున్సిపాలిటీలో రెండెకరాల విస్తర్ణంలో మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. వికారాబాద్, తాండూర్ పట్టణాల్లో జనాభా ,అవసరాలను బట్టి ఐదు నుంచి ఆరు ఎకరాల్లో నిర్మించేలా ప్లాన్ చేశారు. నాలుగేళ్ల క్రితం స్థలాలను పరిశీలించి 2021లో టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు ప్రారంభమైనా నత్తనడకనే సాగాయి. ఎక్కడా పిల్లర్లు, స్లాబ్ దశ దాటలేదు. మరో చోట చేసిన పనులకు బిల్లులు రాక వచ్చిన డబ్బులతో తమకూ వాటా కావాలని ప్రజాప్రతినిధుల పేచీ పెట్టడంతో కాంట్రాక్టర్ పనులు అపేసి పారిపోయాడు. వికారాబాద్ పట్టణంలో పిల్లర్ దశలోనే అగిపోయాయి. ప్రస్తుతం వానలో కూరగాయలు విక్రయిస్తున్నారు. పరిగిలో స్లాబ్ వేసి వదిలేశారు. తాండూర్‌లో పనులు ప్రారంభించి మిన్నకుండిపోయారు, కొడంగల్‌లో ప్రారంభించాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను పూర్తి చేయాలని అయా ప్రాంతాల రైతులు ,ప్రజలు కోరుతున్నారు.



‘నేడు’ ఇండియా కూటమి ఎంపీలకు...

## కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విందు

‘ఎన్నికల మోసం’పై పార్లమెంట్ నుండి ఈసి ఆఫీస్ వరకూ ‘కూటమి’ నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ :** బిహార్‌లో పోల్ రిగ్గింగ్, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సంఘటితంగా దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం విందు ఇవ్వనున్నారు. ప్రతిపక్షనాయకులు, ఎంపీలు సోమవారం నాడు ఢిల్లీలో పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ‘ఎన్నికల మోసం’ అంశంపై నిరసన ప్రదర్శన చేపడుతున్నారు. అదే రోజు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడైన మల్లికార్జున్ ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు చాణక్యపురిలోని హోటల్ తాజ్ ప్యాలెస్‌లో డిన్నర్ ఇవ్వనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. బిహార్ ఎన్నికల జాబి తా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమి అగ్రశ్రేణి నాయకులు కాం గ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ నివాసంలో విందు సమావేశంలో పాల్గొని ఐక్యతను ప్రదర్శించిన కొద్దిరోజుల తర్వాత ఇది తెరపైకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే 2024జూన్‌లోమల్లికార్జున్ ఖర్గే నివాసం లో చివరిసారిగా సమావేశం అయిన తర్వాత ప్రతిపక్ష కూటమి అగ్రనేత ల మొదటి భౌతిక సమావేశం ఇది. మల్లికార్జున్ ఖర్గే సహా 25పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ కీలకనేత సోనియాగాంధీ, ఎన్‌సిపిఎస్‌పి చీఫ్ శరద్‌పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ సుప్రీమ్ ఫరూఖ్ అబ్దుల్లా, పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వా దీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్, ఆర్‌జెడికి చెంది న తేజస్వీయాదవ్, తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన అభిషేక్ బెనర్జీ, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే, డిఎంకెకు చెందిన తిరుచి శివ, టిఆర్.బాలు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ,సిపిఐ (ఎంఎల్)కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, ఎంఎన్ఎం చీఫ్ కమల్ హాసన్ ఉన్నారు. సమావేశ సమయంలో రాహుల్‌గాంధీ ‘ఓట్ చోరీ మోడల్’పై ఒక ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల సంఘం, బిజెపి కుమ్మక్కై ఎన్నికల మోసానికి ఎలా పాల్పడ్డారనే విషయాన్ని ఆయన వివరించారు.

## తెలంగాణ కబడ్డీ లీగ్‌తో తెలుగు రాష్ట్రాల సత్తాను ప్రపంచానికి చాటాలి

తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** తెలంగాణ కబడ్డీ లీగ్‌తో తెలుగు రాష్ట్రాల సత్తాను ప్రపంచానికి చాటాలని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని కాసాని కృష్ణ ముదిరాజ్ కబడ్డీ అకాడమిలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్ ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సెలక్షన్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 220 కబడ్డీ క్రీడాకారులు పాల్గొనగా ఈ కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం అన్ని విభాగాల నుండి ఎనిమిది జట్లను అసోసియేషన్ ఎంపిక చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జట్లతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కబడ్డీ క్రీడాకారులను ఎంపిక చేసి వీరి మధ్య పోటీ నిర్వహించిన అనంతరం అత్యున్నతంగా ఆడే ఆటగాళ్ల జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆ తరువాత తెలుగు కబడ్డీ లీగ్ అనే పేరుతో ప్రపంచానికి తెలుగు కబడ్డీ ఆటగాళ్ల సత్తాను చాటిచేప్పే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వీరేశ్ పేర్కొన్నారు. కబడ్డీ క్రీడని ప్రపంచ దేశాలకు చాటిచెప్పడమే ధ్యేయమని ఆయన అన్నారు. తెలంగాణ కబడ్డీ లీగ్ ఆగస్టు 28 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజీజ్ ఖాన్, సెలక్షన్ కమిటీ సభ్యులు, టెక్నికల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్‌లో జరిగిన బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో కాసాని వీరేశ్ ముదిరాజ్ పాల్గొని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరేశ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు.



## ముష్ఠిఘాతాలతో తలకు గాయాలై ఇద్దరు జపాన్ బాక్సర్లు మృతి

**టోక్యో:** బాక్సింగ్ పోటీల సందర్భంగా తలకు గాయాలు తగలడంతో ఇద్దరు బాక్సర్లు మరణించిన సంఘటనలు జపాన్‌లో జరిగాయి. వేరు వేరు పోటీల సందర్భంగా ఈ ఇద్దరు బాక్సర్ల తలలకు గాయాలై మరణించారు. టోక్యోలోని కొరాకుయెన్ హాలులో ఈ పోటీలు జరిగాయి. ఆగస్టు రెండో తేదీన ఓరియంటల్ ఫసిఫిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఈ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో జూనియర్ లైట్ వెయిట్ ఛాంపియన్ యమటో హటాతో షిగటోషి కొటారీ (28) 12 రౌండ్లలో పోరాటం చేశాడు. ఈ పోరాటంతో తలకు గాయాలైన కొటారీ 12 రౌండ్ల డ్రా పూర్తయిన కొద్ది సేపటికే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి బ్రెయిన్ సర్జరీ చేశారు. కానీ శుక్రవారంనాడు కొటారీ బ్లడ్ క్లాట్ కారణంగా మరణించాడు. ఈ సందర్భంగా వరల్డ్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ కొటారీకి నివాళులు అర్పించింది. అతడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించింది. అతడి మృతికి యావత్ బాక్సింగ్ ప్రపంచం మౌనం పాటించి నివాళులు అర్పించింది. రింగ్‌లో అతడు గొప్ప పోరాటయోధుడని కీర్తించింది. అదేవిధంగా శనివారం నాడు బాక్సింగ్ రింగ్‌లో జరిగిన పోటీల్లో హిరోమాసా ఉరాకావా (28) అనే మరో బాక్సర్ కూడా అదేవిధంగా తలకు ముష్ఠిఘాతాలు తగిలి కుప్పకూలి మరణించాడని బాక్సింగ్ ఆర్గనైజేషన్ తెలియజేసింది. నాకౌట్ సమయంలో యోజి సైటో చేతిలో అతడికి తీవ్ర ముష్ఠిఘాతాలు తగిలాయి. చాలా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారి కుటుంబాలకు బాక్సింగ్ ప్రపంచం ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

# కేరళలో పిల్లల మనోవ్యధ గ్రహించేందుకు స్కూళ్లల్లో లెటర్ బాక్సుల ఏర్పాటు

- ఆత్మవిశ్వాసం పెంచేందుకు జీరో అవర్ క్లాసులు
- విద్యార్థుల భద్రత కోసం టీచర్లకు శిక్షణ
- వేధించే నేరస్థులపై కఠినచర్యలు మంత్రి శివకుట్టి హెచ్చరిక

**తిరువనంతపురం:** కేరళలో ఇంటా బయటా స్కూలు పిల్లలకు సంపూర్ణ భద్రత, మంచి విద్య నేర్పేందు కు సమూల మార్పులు తీసుకురానున్నారు. ఇంటా బయటా పిల్లలు ఎదుర్కొనే సమస్యలు, వారి మనోవ్యధలను లేఖల రూపంలో తీసుకుని, పరిష్కరించేందుకు స్కూళ్ళల్లో లెటర్ బాక్సులు ఏర్పాటు చేస్తారు. పాఠ్యేతర అంశాల బోధనకు ‘పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు జీరో అవర్’ క్లాసులు నిర్వహిస్తారు. స్కూలు పిల్లల భద్రత, వారి మానసిక–శారీక ఆరోగ్యం గురించి బోధనలో అధిక ప్రాధాన్యత ఇస్తామని కేరళ సార్వత్రిక విద్యాశాఖామంత్రి వి.శివకుట్టి ప్రతిజ్ఞ చేశారు. సంబంధించిన బోధన చేయడంకో సం ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కేరళ అలప్పుఝ జిల్లాలో తండ్రి, సవతితల్లి నాలుగో తరగతి చదివే ఒక బాలికపై ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డారన్న వార్త వ చ్చిన మరునాడే మంత్రి పైవిధంగా ప్రకటన చేయ డం ప్రాధాన్యత సంతరించుకుంది. చిత్రహింసకు గు రైన బాలిక శరీరంపై ఉన్న వాతలు, తన బాధను పుస్తకంలో రాసుకున్న ఆ లేఖను ప్రైవేటు స్కూలు టీచర్లు చూసి చదివిన తర్వాత బాలికపై వేధింపుల ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మంత్రి శివకుట్టి ఫేస్‌బుక్‌లో భావోద్వేగాత్మకమైన ప్రకటన చేశారు. ఉపాధ్యాయులు, స్కూలు యాజమాన్యాల తో చాలా దగ్గర సంబంధాలు కొనసాగించి సమస్య లు ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని మంత్రి చె ప్పారు. ఈ ఘటనలో తప్పుచేసినవారిపై కఠిన చర్య లు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఆయ న ప్రకటన తర్వాత బాలిక తండ్రిని, సవతి తల్లిని అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనే కొల్లాలో కూడా జరిగింది. ఒక సవతి తండ్రి ఇస్త్రీపెట్టెతో మూడోతరగతి పిల్లాడి కాళ్ళపై వాతలు పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాంతో ఆ తండ్రిని కూడా అరెస్టు చేశారు. పిల్లలు తమ బాధతలను, ఆవేదనను పైకి అందరికీ చెప్పుకునేవిధంగా వారికి అవకాశం ఇవ్వాలని, అందుకు తగినవిధంగా వారిని తీర్చిదిద్దుతామని మంత్రి చెప్పారు. స్కూళ్ళల్లో పాఠాలు బోధించని సమయాల్లో కాకుండా విడిగా జీరో అవర్ పేరుతో కొంత సమయం కేటాయించి స్కూలు విద్యార్థులకు ఈ ప్రత్యేక అంశాలపై శిక్షణ ఇస్తామని మంత్రి చెప్పారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు తీసుకువచ్చేందుకు తగి న మార్పులను గుర్తించి అందుకు తగిన బోధన విధానాలకు నిర్వచనం ఇవ్వడంపైనే ప్రధానదృష్టి కేంద్రీకరిస్తామన్నారు. కేరళరాష్ట్రంలో స్కూలు పిల్లలపై హింస, దోపిడీ కొనసాగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో మంత్రి పైవిధంగా చెప్పారు. విద్యాపరమైన చొరవ తీసుకుంటూనే స్కూలు పిల్లలను దోపిడీచేసి, హింసాత్మక చర్యల ద్వారా వారికి అన్నివిధాలుగా నష్టం చేయాలనుకునే నేరస్థులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఇంటా బయటా పిల్లలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు. పిటిఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా విద్యాపరమైన పాఠ్యాంశాలను నేర్పుతూనే స్కూలు పిల్లల మానసిక ఆరోగ్యం, వారి ఆలోచనల్లో స్థిరత్వం తెచ్చేందుకు, వారికి భద్రత కల్పించేందుకు కూడా బోధనాపరమైన చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఇస్తామన్నారు. విద్యార్థులకు సంబంధించిన మానసిక, శారీరక సమస్యల పరిష్కారానికి వీలుగా విద్యాశాఖ ఉపాధ్యాయులకు కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. విద్యార్థులు ఎలాంటి దోపిడీకి, మోసాలకు గురికాకుండా వారి స్వీయ భద్రతకోసం తగిన శిక్షణ ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పిల్లలతో కలుపుగోలుగా ఉంటూ వారి ప్రవర్తనను గుర్తించి, వారిలో మార్పులు తీసుకువచ్చేందుకు వీలుగా ఉపాధ్యాయులను ఆ చరణాత్మక పద్ధతులలో బోధనకు ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థుల మంచి చెడ్డలను పట్టించుకుని మార్పులు తెచ్చేవిధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు

హయత్ నగర్ సిఐ నాగరాజ్ గౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో హయత్ నగర్ ప్రజలు ట్రాఫిక్ జామ్‌తో ఎలాంటి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నట్లు హయత్ నగర్ సిఐ పల్స నాగరాజ్ గౌడ్ తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో హైవేపై అర్ధరాత్రి వరకు అన్ని చర్యలు తీసుకొని ఆస్తి నష్టం, ప్రజలకు ఇబ్బంది కలగ కుండా అన్నీ జాగ్రత్తలు తీసుకున్నామని సిఐ నాగరాజ్ గౌడ్ తెలిపారు.

## యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** ప్రభుత్వం అందించే ప్రోత్సాహాల కోసం ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీ లో నూతనంగా నెలకొల్పిన ఎస్ఎస్ఆర్ పెయింట్స్ అండ్ హార్డ్వేర్ షాప్‌ను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మల్లీశ్వరి, అనిల్ కుమార్, నిర్వాహకులు సరికొండ సరస్వతి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం ఉంటనే బయటకు రావాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని మహాక్ష్మి కాలనీలో వర్షాపు నీరు కాలనీల్లో రోడ్లపై నిల్వకావడంతో కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ భారీవర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రతలు తీసుకోవాలని, అత్యవసరం ఉంటే సంబంధిత అధికారులకు, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని, కాలనీ ప్రజలు వర్షాలతో రోడ్లపై నీరు నిల్వ ఉంటే హైడ్రా సిబ్బందికి, జిహెచ్ఎంసి వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యాదయ్య, రాజు, హరి, హైడ్రా సూపర్వైజర్ సతీష్, శంకరయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి

జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి తెలిపానే. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ప్రాంతంలోని వీరభద్ర నగర్ కాలనీలో శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా డివిజన్లోని ట్రంక్ లైన్ కుంగిపోవడంతో వీరభద్ర నగర్ కాలనీ కి డైవర్ట్ అయిన డ్రైనేజీ మురుగునీరు కాలనీ రోడ్లపై చెరువుల తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డికి తెలియజేయడంతో పొంగుతున్న డ్రైనేజ్ మాన్ హోల్స్ వద్దకు వెళ్లి హెచ్ఎం డబ్ల్యూ ఎస్అండ్ ఎస్‌బిజిహెచ్ ఎంసితోపాటు హైడ్రా అధికారుల సమన్వయంతో వారి యంత్రాంగాన్ని రప్పించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన నిర్లక్ష్యంతో హయత్ నగర్ డివిజన్‌లో దాదాపు 20 కాలనీలకు సంబంధించిన వాటర్ స్టాగ్నేషన్ డ్రైవ్ లైన్‌ను హయత్‌నగర్‌లో ఉన్న చెరువులకు మళ్లించే విధంగా చర్యలు తీసుకుంటే ఇలాంటి సమస్య తలెత్తకుండా ఉండేదన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు విజయేందర్ రెడ్డి, గాలయ్య, నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, భరతయ్య చారి, విఠల్, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, స్వామి, భారత్, సందీప్, జలమండలి డిజిఎం రాజ్‌గోపాల్, ఎఇ రాజు, హైడ్రా వేణు, మన్సూన్ టీం, వివిధ శాఖ ల అధికారులు, పాల్గొన్నారు.

## బుడోఖాన్ కరాటేలో రాణించిన విద్యార్థులు




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అంతర్జాతీయ స్థాయిలో యాదవ బూడోఖాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం కర్ణాటకలోని షిమోగ్గా నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మౌలే షోటోఖాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 6వ అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిఫ్ పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన యాదవ బుడోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కరాటే క్లబ్ పోటీల్లో 7బంగారు పథకాలు, 1వెండి, 5రజత పథకాలను సాధించినట్లు యాదవ బూడోఖాన్ కరాటే క్లబ్ డిప్యూటి గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్ తెలిపారు. ఈ కరాటే పోటీల్లో బద్రి నారాయణ, వియన్, హరిష్, గోకుల్‌నందన్, రిషికేష్, వెదన్స్, దేవ్ మదేశ్, ఇమ్మానుల్, హరికృష్ణలు ఉత్తమ ప్రతిభ కనబరిచిమెడల్స్ సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ విరయ్‌కుమార్‌తోపాటు హర్షికలు పాల్గొన్నారు.

## వర్షాకాల సమస్యలకు సమన్వయంతో

# ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాలు, వరదలు నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో వర్షాలు, వరదలపై ప్రజలకు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా అలర్ట్ ఇస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సూచించారు. భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ మహా నగరంలో ఏర్పడిన సమస్యలపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వర్షాకాల సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించడానికి సమన్వయం చాలా ముఖ్యమని, ఈ విషయంలో జిహెచ్ఎంసి ప్రధానపాత్ర పోషించాలని ఆయన సూచించారు. వర్షాకాలం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సెలవులు రద్దు చేసుకోవాలని ఆయన చెప్పారు. సంక్షోభ పరిస్థితులు లేదా క్లిష్టమైన సమస్యలు ఎదురైనప్పుడు అన్ని విభాగాలు కలిసికట్టుగా, నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని మంత్రి అన్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు తాను 24గంటలూ అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ జోక్యం అవసరమైతే తనదృష్టికి తీసుకురావచ్చని మంత్రి అధికారులకు తెలిపారు. చెరువులు, కుంటలు, కాలువల్లో నిర్మాణ వ్యర్థాలను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజల జీవితానికి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ప్రభుత్వ ముందుచూపు వల్ల ఈ సీజన్‌లో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగలేదన్నారు. కొన్ని చోట్ల తక్కువ సమయంలో కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు, ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతున్నాయని, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఓఆర్ఆర్ లోపల వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు.

**ఒక్కరోజులో ఏర్పడిన సమస్యలు కావు..** వరదలు, ఇబ్బందులు అనేవి ఇవ్వాళ ఒక్క రోజులో ఏర్పడిన సమస్యలు కావని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 1931 జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన వ్యవస్థ నేటికి పని చేస్తుందన్నారు. దశాబ్దాల కాలం నాటి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో తాగు నీరు, డ్రైనేజ్ వ్యవస్థపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. జిహెచ్ఎంసి, రెవెన్యూ, విద్యుత్, హైడ్రా, జలమండలి, ట్రాఫిక్ పోలీస్ తదితర శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో 84 పూర్తయ్యాయన్నారు. మిగిలిన పాయింట్స్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో కబ్జా, అస్తుల మీద స్పెషల్ ఫోకస్ పెట్టామని తెలిపారు. హైడ్రాకు అధికారం ఇచ్చి, చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రకృతితో జరుగుతుంది కాబట్టి అందరం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**సామాజిక బాధ్యతగా వర్షపునీటి సంరక్షణ..** వర్షపు నీటి సంరక్షణ ప్రభుత్వానికి, ప్రజలకు ఒక ఉమ్మడి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిహెచ్ఎంసి, జలమండలి నగరానికి సంబంధించిన సమగ్ర నీటి నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టి, భూమి లోకి ఇంకేలా చూడాలని ఆయన చెప్పారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, అవసరమైతే ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి చర్యలను అమలు చేయాలని కూడా సూచించారు. వర్షపు నీటి సంరక్షణపై దృష్టి సారించాలని నగరంలోని అపార్ట్‌మెంట్ వాసులకు ఆయన సూచించారు.

**చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించిన కమిషనర్..** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, వర్షాకాలంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో రోడ్ల మరమ్మతులు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, పూడికతీత, క్యాచ్ పిట్ ఏర్పాటు, రోడ్డు భద్రత కోసం చేస్తున్న పనులను గురించి తెలిపారు. జలమండలి అశోక్ రెడ్డి మాట్లాడుతూ మురుగు నీరు, వర్షపు నీరు కలిసే ప్రాంతాలను గుర్తించామని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెట్రోలో ప్రయాణించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివాహ వేడుకకు హాజరయ్యేందుకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ మెట్రోలో ఆదివారం ప్రయాణించారు. ఎల్‌బినగర్ నుంచి కెపిహెచ్‌బి వరకు మెట్రోలో ప్రయాణించిన ఆయన తోటి ప్రయాణీకులతో ముచ్చటించారు. ప్రత్యేకంగా చిన్నారులతో మాట్లాడారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న కూడా మెట్రోలో వెళ్లారు.

## ప్రతి విద్యార్థికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాల్సిందే

షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి కోరారు. ఆదివారం పట్టణంలోని డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ నెల 11వ తేదిన నిర్వహించే నులి పురుగుల నియంత్రణ కార్యక్రమంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు అంగన్‌వాడి సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. నులి పురుగుల నియంత్రణపై విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాఠశాలలకు వచ్చిన సమయంలో విధిగామాత్రలు వేయించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులుతోపాటు 122మంది వైద్య సిబ్బంది, 286మంది ఆశాలు, 318 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

## నగరంలో తొలిసారిగా..

# ఆటోమేటెడ్ మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్





నాంపల్లిలో తీరనున్న పార్కింగ్ కష్టాలు
త్వరలోనే అందుబాటులోకి తేస్తాం
మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పార్కింగ్ కష్టాలను తీర్చేందుకు నాంపల్లిలో అత్యాధునిక, బహుళ అంతస్తుల ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్ సిద్ధమవుతోంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ఆధ్వర్యంలో అద్భుతమైన ప్రాజెక్టుకు తుది మెరుగులు దిద్దుకుంటుంది. దేశంలోనే మొదటిసారిగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులను మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుండి తుది అనుమతులు రాగానే దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రాజెక్టును ప్రపంచస్థాయిలో రూపొందిస్తున్నామని, ఇది అత్యంత ఆకర్షణీయంగా ఉంటుందన్నారు.

**ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.102 కోట్ల పెట్టుబడి...** హెచ్ఎంఆర్ఎల్ పర్యవేక్షణలో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో 'నోవమ్' సంస్థ దీనిని నిర్మిస్తోంది. జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస్' టెక్నాలజీతో రూపొందించిన ఈ ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్ భారతదేశంలోనే మొదటిది. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక పార్కింగ్ కాంప్లెక్స్‌లలో ఇది ఒకటి. హెచ్ఎంఆర్ఎల్‌కు చెందిన 2,000 చదరపు గజాల స్థలంలో 50 ఏళ్ల కన్సెషన్‌పై డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావన రెడ్డిల ప్రైవేట్ పెట్టుబడులతో రూ.102 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు.

**250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం...** ఈ కాంప్లెక్స్‌లో 3 బేస్‌మెంట్‌లు, 7 అంతస్తులు సహా మొత్తం 10 పార్కింగ్ లెవల్స్ ఉన్నాయి. ఈ ప్రాజెక్టు వాణిజ్యపరంగా లాభదాయకంగా ఉండేందుకు మరో 5 అంతస్తులను వాణిజ్య కార్యకలాపాల కోసం కేటాయించారు. ఈ కాంప్లెక్స్‌లో రెండు ఆధునిక సినిమా థియేటర్లు, 11వ అంతస్తులో సిటీ వ్యూ గ్యాలరీ కూడా ఉన్నాయి. ఇందులో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచవచ్చు.

**మానవ ప్రమేయం లేకుండా పార్కింగ్...** ఈ ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్ పూర్తిగా సెన్సార్‌లతో పనిచేస్తుంది. దీనిలో మానవ ప్రమేయం ఉండదు. ఇది వాహనాలను ఎస్‌యువిలు, సెడాన్‌లు, చిన్న కార్లు వంటి వాటిని ఆటోమేటిక్‌గా గుర్తించి, వాటి కోసం కేటాయించిన ఫ్లోర్లలో పార్క్ చేస్తుంది. ఢిల్లీ, ముంబైలలో ఉన్న మెకానికల్ పార్కింగ్ సిస్టమ్స్‌లా కాకుండా, ఈ సిస్టమ్ ప్యాలెట్‌లు లేకుండా పనిచేస్తుంది. ఇది పార్కింగ్‌ను మరింత సులభతరం చేస్తుంది. ప్రవేశం, నిష్క్రమణ టెర్మినల్స్ విశాలంగా, స్మార్ట్‌గా ఉంటాయి. ఇక్కడ ఉన్న ఫ్లాట్ టర్న్‌టేబుల్స్ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు కూడా అనువుగా ఉంటాయి. వాహనాలను ఏ యాంగిల్‌లోనైనా టర్న్‌టేబుల్‌పై ఉంచవచ్చు. అది 360 డిగ్రీలు తిరిగి సరైన స్థానంలో ఉంచుతుంది.

**సులభమైన పార్కింగ్ అనుభవం...** పార్కింగ్ ప్రక్రియ సులభంగా, వినూత్నంగా ఉంటుంది. వాహనదారులు వచ్చిన తర్వాత క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డ్ అందుకుంటారు. టెర్మినల్ గేట్ వద్ద కార్డ్ స్వాప్ చేస్తే గేట్ తెరుచుకుంటుంది. కారును టర్న్‌టేబుల్‌పై ఉంచి, హ్యాండ్‌బ్రేక్ వేసి, ఇంజిన్ ఆఫ్ చేసి బయటకువెళ్లాలి. బయట కార్డ్ స్వాప్ చేస్తే పార్కింగ్ ప్రక్రియ మొదలవుతుంది. సిస్టమ్ వాహనాన్ని స్కాన్‌చేసి, దానిరకాన్ని బట్టి పార్కింగ్ స్థలానికి తరలిస్తుంది. వాహనం తిరిగి కావాలంటే, కౌంటర్ వద్ద ఫీజు చెల్లించి, ఐ/ఓ టెర్మినల్ వద్దకార్డ్ స్వైప్ చేస్తే, పార్కింగ్‌ప్లాట్‌ఫామ్ నుండివాహనం వెనక్కి వస్తుంది.

**పార్కింగ్ విప్లవానికి నాంది...** ఈ ప్రాజెక్టు హైదరాబాదీలకు ప్రపంచస్థాయి పార్కింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఇది కేవలం పార్కింగ్ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, టెక్నాలజీ, యూజర్ అనుభవం, భద్రత, సౌలభ్యం వంటి అంశాలలో దేశంలోనే ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌లోనే కాకుండా భారతదేశంలో కూడా పార్కింగ్ విప్లవానికి నాంది పలుకుతుందని ఆయన అన్నారు.

## 'బహుజన గణ మన' దీర్ఘకావ్యాన్ని ఆవిష్కరించిన గంధం బంగారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోరాటం లేకుండా మానవ మనుగడ లేదని సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గంధం బంగారు అన్నారు. ఇది మారిషస్ మ్యూజియం చెప్పే పాఠం అన్ని అసిత్వ ఉద్యమాలకు ప్రేరణ అవుతుందన్నారు. ఆదివారం మారిషస్‌లోని ఇంటర్ కాంటి నెంటల్ స్లేవరి మ్యూజియం వద్ద జూలూరు గౌరీశంకర్ రాసిన 'బహుజన గణ మన' దీర్ఘకావ్యంను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలోని ప్రతిఘటన జీవించే హక్కుకు చిహ్నంగా నిర్మించిన మ్యూజియం ముందు బడుగుల కావ్యం ఆవిష్కరించటం గర్వంగా ఉందని తెలిపారు.

## 'స్థానిక'లో స్థానికులకే మొదటి ప్రాధాన్యత

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చేందుకు రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో బుద్దుల జంగయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుండి మొదలుకొని మండల పరిషత్, మున్సిపాలిటి ఎన్నికల్లో స్థానికుల కంటే స్థానికేతరులకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. స్థానికేతరులకు అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు ఏమాత్రం తెలుసుకోవడం లేదని, ఎన్నికల్లో పెట్టిన ఖర్చులను తీసుకునేందుకే పని చేస్తున్నారని వివరించారు. స్థానికంగా ఉన్న నేతలకు టికెట్లు ఇస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని, దాంతో ఆయా ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వలస అభ్యర్థుల కారణంగా ప్రజలు విసుగుపోతున్నారని పేర్కొన్నారు. వార్డుల్లో ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని పని చేస్తే ఆ ప్రాంతాలు అభివృద్ధి సాధించడమే కాకుండా ప్రభుత్వ పథకాలు సైతం ప్రజలకు చేరేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాంతంలో రియల్ ఏస్టేట్ వ్యాపారం ఎక్కువగా అభివృద్ధి సాధించిన నేపథ్యంలో ఒక ప్రాంతం నుండి మరోప్రాంతంలో పోటీ చేసేందుకు నేతలు తీవ్రంగా యత్నిస్తున్నారని, దాంతో ప్రజల మనోభావాలు దెబ్బతినే అస్కారం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీల ఆధిష్టానాలు ప్రజలు మెచ్చిన నేతలకు టికెట్లు ఇచ్చేందుకు కృషి చేయాలని, అప్పుడు ఆశించిన స్థాయిలో మెజార్టీ సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. స్థానికేతరులకు టికెట్లు ఇస్తే అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా వెనుకబడే అస్కారం ఎక్కువగా ఉంటుందని, ఈ విషయంలో రాజకీయ పార్టీల నేతలు గ్రహించి టికెట్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు మున్సిపాలిటిల్లో సైతం పోటీ చేసేందుకు సిపిఐ పార్టీ సిద్ధంగా ఉంటుందని వివరించారు. సాధ్యమైనంత వరకు అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్దంగా ఉంటుందని, రాజకీయ పార్టీలకు కనువిప్పు కలిగించేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఫలాలు అందే వరకు నిరంతర పోరాటాలను సిపిఐ చేస్తుందని, ఇందుకు ప్రజల మద్దతు సైతం ఉండాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## పెంచిన బస్‌చార్జీలు తక్షణమే తగ్గించాలి

ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రాఖీ పండుగ వేళ ప్రభుత్వం పెంచిన ఆర్‌టిసి బస్సు చార్జీలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ డిమాండ్ చేశారు. పండుగల వేళ ప్రభుత్వం పెంచిన బస్‌చార్జీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రయాణీకుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పండుగల వేళ చార్జీలు ఎందుకు పెంచారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రయాణీకులతో ఆర్‌టిసి బస్టాండ్ నిండిపోయినప్పటికి ఆకస్మత్తుగా పెంచిన చార్జీలతో ఏమి చేయాలతో తెలియక ప్రజలు అవస్థలు పడ్డారని మండిపడ్డారు. పండుగ సమయంలో చార్జీలు పెంచడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆర్‌టిసి రంగాన్ని పూర్తిగా అప్పుల పాలు చేసిందని, దాంతో రవాణారంగం వెనుకబడిపోయిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఈ రంగం అభివృద్ధి సాధిస్తుందంటే అది కూడా ఆశించిన స్థాయిలో నడిపించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆర్‌టిసి రంగంలో డ్రైవర్లు, కండక్టార్లు లేక, సమయానికి బస్సులు రాక ప్రయాణీలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉచిత బస్సు లేకున్నా డబ్బులు పెట్టి టికెట్ తీసుకున్నా సమయానికి బస్సులు నడిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. దేశానికి స్వాతంత్రం రాకముందు ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పవన్ చౌహాన్ కోరారు. ఆగస్టు 12వ తేదిన షాద్‌నగర్‌లో 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. విద్యార్థుల పక్షాన పోరాటాలు చేసిన ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రీల్

## పసి మనసే పాట విడుదల



దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ మూవీ 'కాంత' టీజర్‌తో సంచలనం సృష్టించింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ వేఫేరర్ ఫిలమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కాంత ఫస్ట్ సింగిల్ హే పసి మనసేను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ని వింటేజ్ వరల్డ్ రోమాన్స్‌ని ప్రజెంట్ చేసేలా కంపోజ్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ ఝాను చంతర్. మెలోడీతో నిండిన ఆ కాలపు మ్యూజిక్ ఫీలింగ్‌ని మళ్లీ గుర్తు చేశారు. కృష్ణ కాంత్ రాసిన లిరిక్స్ ప్రేమలోని ప్రయాణాన్ని అందంగా ప్రజెంట్ చేస్తే, ప్రదీప్ కుమార్ – ప్రియాంకా ఎన్‌కే వోకల్స్ మనసుని హత్తుకున్నాయి. విజువల్స్ రెట్రో మ్యూజిక్ థీమ్‌కే తగ్గట్టు, అద్భుతమైన సెట్స్, కాస్ట్యూమ్స్‌తో వింటేజ్ సినిమా వాతావరణాన్ని తెరమీదకు తెచ్చాయి. దుల్కర్ సల్మాన్ – భాగ్యశ్రీ బోర్స్ కెమిస్ట్రీ వింటేజ్ ప్రేమ కథకి రియల్ ఫీల్ ని తీసుకొచ్చింది. కాంత' సెప్టెంబర్ 12న థియేటర్లలో రిలీజ్ కానుంది.

## 'జిగ్రీస్' టీజర్

కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్ ఫుల్ క్రేజీ ఎంటర్టైనర్ జిగ్రీస్. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తాజాగా టీజర్ ని లాంచ్ చశారు. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. కొంతమంది ఉంటారు శుద్ధ పూసలు. ఫస్ట్ వద్దేవద్దు అని షో చేస్తారు. తర్వాత కూర్చున్నాక నాకంటే ఎక్కువ తాగుతారు' అనే డైలాగ్ తో మొదలైన టీజర్ అవుట్ అండ్ హిలేరియస్‌గా సాగుతుంది. త్వరలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## సెప్టెంబర్ 12న కిష్కిందపురి



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అప్ కమింగ్ హారర్ మిస్టరీ థ్రిల్లర్ కిష్కిందపురిలో బోల్డ్ ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ మహిళా కథానాయికగా నటించింది. హారర్, మిస్టరీ, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో వస్తున్న కిష్కిందపురి ఈ సీజన్‌లో మోస్ట్ ఎవైటెడ్ మూవీలో ఒకటి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు పోస్టర్‌ను విడుదల చేశారు.

## పరదా ట్రైలర్ విడుదల



అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రల్లో సినిమా బండి ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తో వస్తున్నారు. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. 'పరదా' కథ సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) చుట్టూ తిరుగుతుంది. తన ఊరిలోని కఠినమైన, మగవారికి మాత్రమే మద్దతు ఇచ్చే సంప్రదాయాల వల్ల విసిపోయిన సుబ్బు, ఓ ధైర్యమైన నిర్ణయం తీసుకుంటుంది. ఇద్దరు అపరిచితులు (దర్శన రాజేంద్రన్, సాంగీత) తో కలసి, ఓ ఎనర్జీతో నిండిన రోడ్ ట్రిప్‌కి వెళుతుంది. కానీ, కథ ఒక్కసారిగా సీరియస్ మలుపు తిప్పుతుంది. సుబ్బు అదృశ్యమవుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే ఈ సినిమా కథ. ఈ సందర్భంగా రామ్ పోతినేని మాట్లాడుతూ ఈ సినిమా స్టోరీ లైన్ నాకు తెలుసు. చాలా అద్భుతమైన కథ. బాలీవుడ్‌లో లాపతలేడీస్ లాంటి సినిమాలు చూస్తుంటాం. మనం ఎందుకు అలాంటి సినిమాలు చేయలేమని ఆలోచిస్తుంటాం. ఇలాంటి సినిమాలు నిర్మిస్తున్న నిర్మాతల్ని తప్పకుండా ప్రోత్సహించాలి. ఈ సినిమా హిట్ అయి నిర్మాతలకు చాలా డబ్బులు రావాలని కోరుకుంటున్నాను. ఇలాంటి సినిమాలు విజయాలు సాధిస్తే నిర్మాతలకి ధైర్యం వస్తుంది. ప్రవీణ్ తీసిన సినిమా బండి సినిమా నాకు చాలా ఇష్టం. ఆగస్టు 22న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. మిస్ అవ్వకుండా చూడండి'అన్నారు.

## 'ఫీనిక్స్' టీజర్ లాంచ్



మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయమవుతున్న చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం యాక్షన్‌తో పాటు హై ఎమోషన్స్‌తో వుండబోతుంది. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ బ్యానర్ పై రాజలక్ష్మి అన్ల్ అరసు ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇపప్టికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్, సాంగ్స్‌ని మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సూర్య సేతుపతి మాట్లాడుతూ ఫీనిక్స్ తెలుగులో రిలీజ్ కాబోతుంది.

## సాయి దుర్గ తేజ్‌కు అవార్డు



యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 కార్యక్రమంలో శనివారం (ఆగస్ట్ 9) హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో జరిగింది. మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకు చెందిన కొంత మంది ప్రముఖులు కలిసి సందడి చేశారు. ఈ క్రమంలో సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మోస్ట్ డిజైరబుల్ (మేల్) అవార్డును గెలుచుకున్నారు. ఈ అవార్డును సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ప్రదానం చేశారు. ఈ అవార్డుని తల్లి విజయ దుర్గ, తండ్రి డాక్టర్ శివ ప్రసాద్ చేతుల మీదుగా తీసుకోవాలని సాయి దుర్గ తేజ్ కోరుకున్నారు. ఇక వేదికపైనే ఈ అవార్డుని, గౌరవాన్ని సాయి దుర్గ తేజ్ తన తల్లికి అంకితం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో తనను తల్లి కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేసుకున్నారు. 'నేను అంతా కోల్పోయానని అనుకున్నప్పుడు, నా తల్లి నాకు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. ఆమె నా ఆత్మవిశ్వాసాన్ని పెంచి నన్ను సాధారణ స్థితికి తీసుకువచ్చారు' అని అన్నారు.

## 'ఏలుమలై' నుంచి కాపాడు దేవా పాట విడుదల



హీరోయిన్ రక్షిత సోదరుడు రాన్నా హీరోగా పరిచయం కాబోతోన్నారు. రాన్నా హీరోగా ప్రియాంక ఆచార్, జగపతి బాబు ప్రధాన పాత్రల్లో తరుణ్ కిషోర్ సుధీర్ నిర్మాణంలో పునీత్ రంగస్వామి తెరకెక్కించిన చిత్రం 'ఏలుమలై'. నరసింహా నాయక్ (రాజు గౌడ) సమర్పణలో తరుణ్ సుధీర్ క్రియేటివ్స్, డీఈ ఆర్ట్ స్టూడియోస్ బ్యానర్లపై యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకి రచన, మాటలు, దర్శకత్వం పునీత్ రంగస్వామి వహించారు. ఇప్పటి వరకు 'ఏలుమలై' నుంచి వచ్చిన టైటిల్ టీజర్, పోస్టర్, పాటలు ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాలు పెంచేశాయి. తాజాగా ఈ చిత్రం నుంచి సింగర్ మంగ్లీ ఆలపించిన 'కాపాడు దేవా' అనే పాట శ్రోతల మనసుల్ని కదిలించేలా ఉంది. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటకు డి. ఇమ్మాన్ బాణీలు అందించారు.

## షూటింగ్‌లు పూర్తిగా నిలిపివేస్తాం

తెలుగు సినిమా కార్మికుల ఆందోళన వారం రోజులుగా కొనసాగుతోంది. ఆదివారం ఫెడరేషన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళనకు దిగారు. ర్యాలీ నిర్వహించారు. నిర్మాతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూఇప్పటికే షెడ్యూల్ ఉంటే ఒకట్రెండు రోజులు సమయం ఇస్తాం. సోమవారం నుంచి పూర్తిగా షూటింగ్‌లు బంద్ చేస్తామని ప్రకటించారు. షెడ్యూల్ ఉన్న వారితోనూ మాట్లాడి ఆ చిత్రీకరణలు నిలిపివేస్తాం అని అన్నారు. చర్చలు ఫలించకపోతే చిత్రీకరణలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ నోటీసు ఎందుకు పంపారో తెలియదని చెప్పారు. మేము కూడా ఫిల్మ్ ఛాంబర్‌కు నోటీసులు పంపిస్తాం అని తెలిపారు.



నిర్మాత విశ్వప్రసాద్ కోర్టును ఆశ్రయించారు కాబట్టి కోర్టు తీర్పు వచ్చే వరకు విశ్వప్రసాద్ షూటింగ్‌లకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. పీపుల్స్ మీడియా ఉనెన బకాయిలు రూ.90 లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు నిర్మాతలు జంకుతున్నారన్నారు. సినీ కార్మికుల శ్రమకు వేతనాల కోసమే పోరాడుతున్నాం అని పేర్కొన్నారు. సినీ కార్మికుల వేతనాలు పెంచడం నిర్మాతలకు పెద్ద సమస్య కాదని అన్నారు. బడ్జెట్ పెంచుకోవడం.. కట్టడి చేసుకోవడం వారికి అర్థం కావట్లేదు: ఫిల్మ్ ఫెడరేషన్ ఎవరినీ నిందించలేక సినీ కార్మికులను అడ్డం పెట్టుకుంటున్నారు. ఫెడరేషన్ తరఫున కలుస్తామని చిరంజీవికి సమాచారం ఇచ్చాం. ఛాంబర్‌తో చర్చలు ఫలించకపోతే జోక్యం చేసుకుంటానని చెప్పారు. ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. మాపై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలుస్తాం అని అనిల్ చెప్పారు.

# ఇజ్రాయెల్ దాడులకు బిజెపి మద్దతు సిగ్గుచేటు

### శాంతి ర్యాలీపై విమర్శలను ఖండించిన విద్యార్థి సంఘాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు బిజెపి మద్దతునివ్వడం సిగ్గుచేటని వామపక్ష విద్యార్థి సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా విద్యా సంస్థలపై, ఆసుపత్రులపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయెల్‌కు బిజెపి ఏ ప్రాతిపదికన మద్దతునిస్తుందో చెప్పాలని విద్యార్థి సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో ఇజ్రాయెల్ వైఖరికి నిరసనగా ప్రదర్శనలు జరుగుతున్నాయని ఈ క్రమంలోనే ఖమ్మంలో ఈ నెల ఏడున శాంతి ర్యాలీ జరిగిందని దీనిపై బిజెపి విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో పాలస్తీనా పట్ల భారత్ సానుకూల వైఖరిని అవలంభించిందని ఇప్పుడు బిజెపి ఎందుకు వైఖరిని మార్చుకుందో స్పష్టం చేయాలన్నారు. విద్యార్థి సంఘాలు శాంతి ర్యాలీకి మద్దతునిచ్చి ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న వారిని ర్యాలీకి ఆహ్వానించామని వారు ర్యాలీలో పాల్గొంటే తప్పేంటని వారు ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛను సైతం బిజెపి హరించేదిశగా పయనిస్తుందన్నారు. శాంతి ర్యాలీ జరిగితే బిజెపికి కడుపుమంట ఏమిటని వారు ప్రశ్నించారు. ఇకనైనా ఇటువంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని లేదంటే బిజెపికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు శివనాయక్, గోపి, మనోజ్, యశ్వంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల పెంపు తెలంగాణ బిల్లుకు బిజెపి అడ్డంకులు

### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ధ్వజం

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని బిజెపి సర్కార్ ధోరణిని ఎప్పటికప్పుడు తూర్పారబడుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తెలంగాణలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు 67శాతం రిజర్వేషన్ల పెంపును కోరే తెలంగాణ బిల్లుకు బిజెపి అడ్డంకులు సృష్టిస్తోందని ఆదివారం కాంగ్రెస్ నిప్పులు చెరిగింది. దానికి రాష్ట్రపతి సమ్మతిని తెలియజేసేందుకు 4నెలలకు పైగా సమయం ఎందుకు పడుతోందని కాంగ్రెస్ ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ మాట్లాడుతూ బిజెపికి సాంఘిక న్యాయంపై ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ఎద్దేవా చేసింది. '2023, నవంబర్ 9న బిహార్ అసెంబ్లీ ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబీసీలు, ఈబీసీలకు 65శాతం రిజర్వేషన్లు పెంచే బిల్లును ఆమోదించింది. శాసనమండలి 2023, నవంబరు 10న శాసనమండలి కూడా ఆమోదించింది. ఆ తర్వాత గవర్నర్ తన సమ్మతిని తెలియజేశారు. 2023, నవంబర్ 21న బిల్లు అధికారికంగా చట్టంగా మారింది' అని జైరామ్ రమేష్ ఆదివారం తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు 67శాతం రిజర్వేషన్ల పెంపు (బిసిలకు ఏదైతే 42శాతం రిజర్వేషన్) బిల్లు ఉన్నదో అది 2025 మార్చి 17న ఆమోదించింది అని ఆయన చెప్పారు. ఒక రోజు తర్వాత శాసనమండలి కూడా ఆమోదించింది. 2025 మార్చి 30న గవర్నర్ ఆ బిల్లును భారత రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. నాలుగు నెలలకు పైగా బిల్లు పాస్ కాకుండా సమ్మతి కోసం నిరీక్షించాలా? అని జైరామ్ రమేష్ తీవ్రంగా ఆ అంశాన్ని లేవనెత్తారు. నితీష్‌కుమార్ జెడి(యు)కి నాయకత్వం వహిస్తున్నప్పుడు ఆర్‌జెడి, కాంగ్రెస్ గవర్నర్లు కూడా ఈ చట్టం అమలులోకి తెచ్చారని ఆయన గుర్తుచేశారు. కానీ బిహార్ సామాజిక వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని, బిల్లు ఆమోదాన్ని ఆలస్యం చేయకుండా లేదా అడ్డుకునేలా గవర్నర్‌ను ఒత్తిడిచేసే స్థితిలో బిజెపి ఉంది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపలేదనే విషయాన్ని గమనించడం ముఖ్యమని జైరామ్ రమేష్ అన్నారు. అయితే 'తెలంగాణలో బిజెపి తన సామాజిక న్యాయం పట్ల తన నిబద్ధతను ఖచ్చితంగా బహిర్గతం చేస్తూ ఆటంకం సృష్టిస్తోంది. లేదంటే రాష్ట్రపతి సమ్మతికోసం నాలుగునెలలకు పైగా ఎందుకు నిలిపివేయబడ్డది' అని జైరామ్ రమేష్ ప్రశ్నించారు.




## పాక్‌ను దెబ్బతీశాం

**(మొదటి పేజీ తరువాయి)**

మాతా వైష్ణోదేవి కాత్రాఅమత్‌సర్, నాగపూర్ పుణే వందే భారత్ రైళ్లు ఉన్నాయి. తరువాత, ఎలక్ట్రానిక్ నగరాన్ని బొమ్మనహళ్లితో అనుసంధానించే ఎల్లో లైన్ మెట్రో సేవను ప్రధానమంత్రి ప్రారంభించారు. బెంగళూరు బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం తరువాత రెండు కారిడార్లతో కూడిన నమ్మ మెట్రో మూడవ దశకు మోదీ శంకుస్థాపన చేశారు. బెంగళూరు మెట్రో ఫేజ్3 ప్రాజెక్ట్ విలువ రూ. 15,610 కోట్లపైగా ఉంది. ఈ ప్రాజెక్టు 44.65 కిలోమీటర్ల పొడవుతో, 31 ఎలివేటెడ్ స్టేషన్లతో సుసాధ్యం అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌తో బెంగళూరులో ప్రజా రవాణా మరింత మెరుగుపడనుంది. ప్రధాని మోదీ బెంగళూరులోని కొన్ని ఇతర నగర కనెక్టివిటీ ప్రాజెక్టులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను కూడా తగ్గించడంలో సహాయపడతాయి.

**కేంద్రం కంటే ఎక్కువ ఖర్చు: సిద్దు**

బెంగళూరు మెట్రో కోసం కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేస్తోందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఈ మేరకు మాట్లాడారు. 'ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం, రాష్ట్రం సమానంగా నిధులు సమకూర్చాల్సి ఉంది. అయినప్పటికీ... రాష్ట్రం ఎక్కువ ఖర్చు చేస్తోంది' అని తెలిపారు. అభివృద్ధి విషయంలో మహారాష్ట్ర, గుజరాత్‌ల మాదిరే కర్నాటకకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

# 'విత్తన చట్టం' కసరత్తు పూర్తి!

రానున్న అసెంబ్లీ సమావేశంలో 'విత్తన ముసాయిదా బిల్లు...

వివిధ రాష్ట్రాలలో అధ్యయనం చేసిన 'విత్తన కమిటీ '

'నకిలీ విత్తనాల సరఫరా'పై కఠిన చర్యలకు సిఫారసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరుగాలం శ్రమిస్తు దేశానికి పట్టెడు అన్నం పెడుతున్న రైతన్నలకు నకిలీ విత్తనాలను అంటకట్టి నిలువున మోసం చేస్తున్న విత్తన కంపెనీలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విత్తన చట్టానికి శ్రీకారం చుట్టింది.. రాష్ట్రంలో తీసుకురానున్న విత్తన చట్టం దేశానికే దిక్సూచిగా వుండాలని సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్ధేశం చేయడంతో విత్తన చట్టం మూసాయిదాను కమిటీ పకడ్బందిగా రూపొందిస్తోంది. విత్తన చట్టాలకు సంబంధించి రాష్ట్రంలో 1951 యాక్ట్, దేశ వ్యాప్తంగా కేంద్రం 1961లో తీసుకువచ్చిన 54 యాక్ట్‌లు అమల్లో ఉన్నప్పటికీ, అవిసమగ్రంగా లేకపోవడంతో వాటిల్లో లొసుగులను అడ్డం పెట్టుకుని కార్పొరేట్‌తో పాటు ఇతర విత్తన కంపెనీలు యాధేచ్చంగా ప్రతి ఏటా రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రైతాంగం ఇకమీదట ధైర్యంగా వ్యవసాయం చేయలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకు వచ్చేందుకు కసరత్తు చేస్తోంది.వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విత్తన చట్టం బిల్లు తీసుకువచ్చే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది.

**రైతు సంక్షేమ కమిషన్ పర్యవేక్షణలో ముసాయిదా బిల్లు**

తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పర్యవేక్షణలో విత్తన ముసాయిదా బిల్లు రూపుదిద్దుకుంటుంది. కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి డైరెక్షన్ లో పనిచేస్తున్న విత్తన బిల్లు ముసాయిదా కమిటీ ఇప్పటికే విత్తన చట్టంలో వుండాల్సిన అంశాలపై పలు సూచనలు, సలహాలను స్వీకరించింది. ఇందులో భాగంగా విత్తన చట్టం ముసాయిదా రూపొందించడానికి ముసాయిదా కమిటి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అభిప్రాయాలను రైతులు, రైతు సంఘాల నేతలు, డీలర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యవరణ వేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధుల నుండి అభిప్రాయాలను సేకరించింది.అధ్యాయనంలో భాగంగా రైతు కమిషన్ ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో విత్తన బిల్లు ముసాయిదా కమిటి హార్యానా కు వెళ్లి అక్కడ క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుల నుండి అక్కడ అమలవుతున్న విత్తన చట్టంపై అభిప్రాయాలను సేకరించింది.ఇతర రాష్ట్రాల్లో కూడా విత్తన చట్టాలు, విధానాలను కమిటీ అధ్యయనం చేసింది. తద్వారా ఇతర రాష్ట్రంలో అమల్లో వున్న విత్తన చట్టం లోపాలను గుర్తించి తెలంగాణలో బలమైన సమగ్రమైన విత్తన చట్టం వుండాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. దాదాపుగా పూర్తి కావొచ్చిన విత్తన చట్టం ముసాయిదా తుది మెరుగులు దిద్దుకుంటోంది.

**రైతులను ఎవరూ మోసం చేసినా ఇక కఠిన చర్యలు :** నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులతో రైతులను ఎవ్వరూ మోసం చేసినా కఠిన చర్యలు ఉండేలా చట్టానికి పదును పెడుతోంది. రైతులను మోసం చేసిన విత్తన కంపెనీల నుండే నష్టపరిహారం వచ్చేలా ముసాయిదా బిల్లులో ప్రతిపాదించనున్నారు. నష్టపరిహారంతో సరిపెట్టకుండ జరిమానాలు, జైలు శిక్ష పడేలా చట్టాన్ని రూపొందిస్తోంది. అలాగే నష్టపరిహారం చెల్లించే అంశంలో ఒక్కొక్క పంటకు ఒక్కోక్క రకంగా చెల్లించేలా ముసాయిదాను సిద్ధం చేస్తున్నారు.

ఇందులో పంట సీజన్ పూరైయ్యే నాటికి నష్టం వాటిల్లినట్లు గుర్తిస్తే నష్టపోయిన రైతుకు 100 శాతం నష్టపరిహారం చెల్లించాల్సిందే.. పంట కాలం పూరై విత్తనాలు, ఎరువుల కారణంగా రైతు నష్ట పోతే పంటపెట్టుబడి, సీజన్, రైతు కష్టం అంతా వృదా కానుండడంతో 100 శాతం నష్టపరిహారం కల్పించేలా చట్టం తీసుకురాబోతున్నారు. అదేవిధంగా పంట కాలం మధ్యలో నష్టం వాటిల్లినట్లు తెలీతే.. 50 శాతం, విత్తనాలు వేసిన మొదట్లో అయితే.. 10 నుండి 20 శాతం నష్టపరిహారం అందేలా చట్టంలో పొందపర్చబోతున్నట్లు తెలిసింది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com